# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 54    సంచిక : 22-24    విజయవాడ    5-12-2021    పేజీలు : 24    వెల : రూ. 10/-


## మోడీ-మూడు చట్టాల రద్దు ప్రకటన-ఉద్యమించిన రైతుల విజయం

## మరో కోణంలో పాలకుల మోసకారీతనం

**నవంబర్** 19వ తేదీన ప్రధాని నరేంద్రమోడీ దేశప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించాడు. ఈ ప్రకటనతోపాటుగా మోడీ సుదీర్ఘ వివరణను కూడా జోడించాడు. తాము తెచ్చిన మూడు చట్టాలు చాలా వుపయోగకర మైనవనీ, దేశానికీ రైతులకూ ప్రయోజనకరమైనవనీ అయితే వీటిని 'కొందరు' రైతులకు సరిగా అర్థంచేయించలేకపోవటం వలన వారిలో అపోహలు తలెత్తి అసంతృప్తి వ్యక్తమైన కారణంగా ఈ చట్టాలను రద్దు చేస్తున్నట్లు వివరించాడు. అందువలన సరైన చట్టాలు అయినప్పటికీ అనవసరంగా రైతులు ఉద్యమం చేశారని మోడీ స్పష్టం చేయదలచుకున్నాడు.

ఇక, క్షమాపణలు కోరుతున్నానని ప్రకటించిన మోడీ ఎవరికి, ఎందుకు అనే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అస్పష్టంగా వ్యక్తీకరించాడు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో, దేశం మొత్తంలో ప్రజానీకం కకావికలు అవుతున్న నేపథ్యంలో 2020 జూన్‌లో హడావుడిగా తొలుత ఈ చట్టాలను ఆర్డినెన్స్‌లుగా ఎందుకు రూపొందించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వలేదు. 2020 సెప్టెంబర్‌లో పార్లమెంట్‌లో చట్టాలుగా రూపొందించే తరుణంలోనూ వీటిపై సంబంధిత ప్రజానీకంతోనే గాదు-కనీసం చట్ట సభలలో సవివరంగా ప్రజాస్వామ్యయుతంగా చర్చలు కూడా జరపకుండా ఎందుకంత హడావుడిగా, ఏకపక్షంగా, నిరంకుశంగా వ్యవహరించాల్సి వచ్చిందో వివరించలేదు. ఫలితంగా గత సంవత్సర కాలంగా రైతాంగం -ప్రధానంగా ఉత్తరభారత రైతాంగం-ఢిల్లీ సరిహద్దులనే నివాసంగా చేసుకొని ఎండ, వాన, చలి, వాతావరణ ప్రతికూలతలను, కరోనా విపత్కర పరిస్థితులను లెక్కచేయక మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని ముందుకు సాగిస్తున్నారు.

ఈ క్రమంలో బూటకపు చర్చల తతంగాన్ని 11 పర్యాయాలు కొనసాగించిన సందర్భంలో కూడా ఈ చట్టాలను వెనక్కు తీసుకోవాలనే ఆలోచన మోడీ ప్రభుత్వానికి రాలేదు; మొండిగా వ్యవహరించింది. తీవ్రమైన నిర్బంధం, అణచివేత ప్రయోగించింది; దుష్ప్రచారాలు సాగించింది. రైతుల ఉద్యమాన్ని విచ్ఛిన్నంచేసి, మూడు వ్యవసాయ చట్టాలను నిరాటంకంగా ముందుకు తీసుకువెళ్ళాలని సర్వదా, శతధా ప్రయత్నించింది.

ఉద్యమిస్తున్న అనేకమంది రైతులు, రైతు నాయకులపైనా, వారికి మద్దతుగా నిలిచిన జర్నలిస్టులు, ఇతర మేధావులపైనా రాజద్రోహ నేరాన్ని మోపి జైళ్ళలో నిర్బంధించింది. ఈ ఉద్యమ క్రమంలో దీనిలో పాల్గొంటూ గత సం॥ర కాలంలో 700 మందికి పైగా రైతులు వివిధ కారణాలతో మరణించారు. మరణించిన రైతాంగానికి సంతాపం తెలియజేయటానికి కూడా ఈ ప్రకటన సందర్భంగా మోడీకి నోరు పెగలలేదు.

'3 చట్టాలు రద్దుచేశాము కనుక ఇళ్ళకు వెళ్ళిపోండి' అనిన మోడీ పిలుపుకు రైతులెవరూ సానుకూలంగా స్పందించకపోవటమే కాదు;' ఆ మాటలు ఆచరణ రూపం తీసుకునే వరకు విశ్వంశించేదే లేదు; అక్కడినుండి కదిలేదు లేదు' అని తేల్చి చెప్పటం ప్రజల విశ్వాసాన్ని పాలకులెంతగా కోల్పోయారనే దానికి ఉదాహరణగా నిలుస్తుంది. రైతాంగానికి కీలకమైన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించటం గురించి, విద్యుత్తు బిల్లు-2020 రద్దు ఇతర డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకునేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించటం ఆహ్వానించాల్సిన అంశం.

### దొడ్డిదారిన అమలుకు వ్యూహాలు

మూడు వ్యవసాయ చట్టాల అమలు ఈపాటికే వివిధ రాష్ట్రాలలో భిన్నస్థాయిల్లో అమలుజరుగుతోందనేది వాస్తవం. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ల రద్దు, ఈ-నామ్‌ల (ఎలక్ట్రానిక్-నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) ఏర్పాటు, కాంట్రాక్టు, కార్పొరేటు వ్యవసాయం, ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను నీరుగార్చటం, కేంద్రప్రభుత్వ ధాన్యం కొనుగోలు సంస్థలను నిస్తేజం చేయటం, నిత్యావసరాలపై ప్రభుత్వ నియంత్రణను ఎత్తివేయటం మొదలైన రూపాల్లో ఈ మూడు నిరంకుశ చట్టాల్లోని వివిధ అంశాలు ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అనేక మోతాదుల్లో అమలు అవుతున్నాయి. వీటన్నింటినీ ఏకీకృతంచేసి, దేశవ్యాపితంగా మరింత కట్టుదిట్టంగా చట్టాలు చేసి, బడా బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకు మరింత మేలు చేయాలనుకున్న మోడీ వ్యూహం తాత్కాలికంగా బెడిసికొట్టింది. కార్పొరేటు సంస్థలు, సామ్రాజ్యవాద దేశాలు ఆశించిన స్థాయిలో వారికి వెంటనే ప్రయోజనం చేకూర్చే పనిని చట్టబద్ధం చేయలేకపోయినందుకు బహుశా మోడీ వారికి క్షమాపణ చెప్పివుండవచ్చు. కనుక సమీప కాలంలో జరగనున్న ఐదు ఉత్తరభారత రాష్ట్రాల శాసనసభ ఎన్నికల దృష్టితో మోడీ చేసిన మూడు చట్టాల రద్దు ప్రకటన మోసకారీతనంతో కూడుకున్నదనేది స్పష్టం.

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 54
సంచిక : 22-24


## లోపలిపేజీల్లో....


అంతర్జాతీయం :

'కాప్-26' సదస్సు 3

ప్రకటన :

మూడు నల్లచట్టాల రద్దుపై రై.కూ.సం 2

చరిత్ర :

మీరట్ కుట్రకేసు - ప్రకటన 10

ఏఐడబ్ల్యుపిపి మహాసభ సమీక్ష 13

కవిత :

మహాసంకల్పం - బెర్టోల్ట్ బ్రెహ్ట్ 18

రాజకీయార్థికం :

ఆస్తుల నగదీకరణ
- ప్రొ. తోట జ్యోతిరాణి 6

ధాల్‌పూర్ అకృత్యాలు
-హర్‌కుమార్ గోస్వామి 16

ఆటోమొబైల్ కేంద్రంగా
పారిశ్రామికాభివృద్ధి 19

నివాళి :

కా॥ సనాల్ 15

కా॥ అశిష్‌మజుందార్ 15



వెల : విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :

32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,
ఎం.ఆర్.పురం, విజయవాడ-10.


## గత అనుభవం

బ్రిటిష్ పాలనా కాలంలో ప్రజాప్రయోజనం పేరుచెప్పి రైతులనుండి, ప్రజలనుండి ప్రభుత్వం భూములను ఇష్టారాజ్యంగా సేకరించే 'భూసేకరణ చట్టం-1894'కు యుపిఏ-2 పాలనాకాలం చివరలో కొన్ని సవరణలు చేశారు. కాగా, ఎన్‌డిఏ - పాలనా కాలంలో దీనికి మరిన్ని సవరణలు చేసి, దేశ, విదేశీ బడా కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకు ప్రజల, రైతుల భూములను పాలకులు తమ చిత్తమొచ్చిన విధంగా కట్టబెట్టేందుకు అన్ని అవకాశాలు కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టారు. భూములు, వ్యవసాయం మొదలైనవి రాష్ట్ర జాబితాలోని అంశాలైనప్పటికీ కేంద్ర పాలకులు ఖాతరు చేయలేదు.

విచక్షణారహితంగా భూముల సేకరణ బిల్లుపై దేశవ్యాపితంగా రైతాంగం, ప్రజానీకంనుండేకాక, పాలక ప్రతిపక్షాలనుండి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవటంతో మోడీ ప్రభుత్వం ఆ బిల్లుకు చట్టరూపమివ్వకుండా ప్రక్కనుంచి, రాష్ట్రాలు తమ అవసరం కనుగుణంగా వ్యవహరించుకోమని ఆయా ప్రభుత్వాలకు వదలివేసింది. ఆ తర్వాత క్రమంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ప్రాజెక్టుల పేరున లక్షలాది ఎకరాల భూములను-అటవీ భూములతో సహా-ప్రజలనుండి, రైతులనుండి గుంజుకొని బడాపారిశ్రామిక వర్గాలకు కట్టబెట్టటంలో వారికి ఏ చట్టాలూ అడ్డురాలేదనేది గమనించాలి.

## చట్టాల రద్దు తర్వాత ఉద్యమం మరింత ముందుకుసాగాలి

కార్పొరేట్ల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు దోపిడీ పాలకులు ఎంతగా ఊడిగం చేస్తారో ఈ ఉద్యమ క్రమంలో మరోసారి తేటతెల్లమైంది. గత 75 సం॥లుగా భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ అనుకూల విధానాలను పాలకులు అమలుచేసుకుంటూ వస్తున్న దానిలో భాగమే ప్రస్తుత 3 వ్యవసాయ నల్లచట్టాలు అనేది అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం ఈ చట్టాలను రద్దుచేసినా, వీటిని మరో రూపంలోనైనా అమలుజేసే పాలకుల ప్రయత్నాలను ప్రతిఘటించాలి. దేశ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్ని దోపిడీ వర్గాలకు అనుగుణంగా మలిచే పాలకుల విధానాలను బహిర్గతం చేయాలి. దేశీయ, స్వతంత్ర, ప్రజల నిజమైన వాస్తవికమైన అభివృద్ధి సాధించటంకోసం ఉద్యమించాలి. ✡

# రైతాంగ పోరాటానికి జేజేలు

**మూడు** రైతాంగ వ్యతిరేక చట్టాలను ఉపసంహరించాలని కేంద్రం నిర్ణయించడం దేశ రైతాంగం, ప్రజలు సాధించిన ప్రాథమిక విజయం.

ప్రభుత్వ నిర్ణయం పార్లమెంట్‌లో చట్ట రూపం తీసుకొనేవరకూ వేచి చూడాల్సి వున్నా ప్రభుత్వ ప్రకటన ఒక ప్రజా విజయమే. ఈ విజయపు స్ఫూర్తితో మరిన్ని పోరాటాలకు రైతాంగం, ప్రజలు సిద్ధపడాలి.

మూడు వ్యవసాయ చట్టాలను కేంద్రం ఉపసంహరించుకోక తప్పని పరిస్థితులకు తెచ్చే విధంగా, రైతాంగం తీవ్ర కష్ట నష్టాలకి ఓర్చి పోరాడింది. ఈ విజయం యొక్క ముఖ్య ప్రాధాన్యత ఇది.

దీనికి ఎనలేని కష్ట నష్టాలను రైతాంగం ఓర్చింది. లఖింపుర్ ఖేరి లాంటి దురాగతాలను ఎదిరించింది. నేటి దేశ సామాజిక పరిస్థితులలో ఈ విజయం చాలా ప్రాధాన్యత కలిగింది.

అదే సమయంలో పంటలకు గిట్టుబాటు ధరలను పొందే చట్టబద్ధ హక్కు కోసం, విద్యుత్ చట్టం సవరణ బిల్లులను ఉపసంహరించుకునేంత వరకూ రైతాంగం, ప్రజలు కలసి ఆందోళన కొనసాగించాల్సి ఉంది.

ఇదే స్ఫూర్తితో విశాఖ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరణను కూడా కేంద్రం ఉపసంహరించుకునేలా ప్రజలు పోరాడాలని కోరుతున్నాము. ఈ పార్లమెంటు సమావేశాలలోనే ప్రభుత్వం విశాఖ స్టీలుప్లాంట్ ప్రైవేటీకరణ బిల్లును రద్దు చేయాలి.

సామ్రాజ్యవాదుల, వారి దళారీ కార్పోరేట్ల దోపిడీ విధానాలే రైతాంగ, కార్మిక, ప్రజానీకపు అన్ని కడగండ్లకు కారణమని గుర్తించి, మరింత ఐక్యతతో మౌలిక సమస్యల పరిష్కారం కోసం కదలాలి.

**ఎస్. ఝాన్సీ**

**19-11-2021** **అధ్యక్షులు, రైతుకూలీ సంఘం ఆంధ్రప్రదేశ్.**

**(AIKMKS అనుబంధం)**

# 'కాప్-26' సదస్సు

# ప్రకృతిని ధ్వంసంచేసే పెట్టుబడిదారీ క్రూర స్వభావానికి మేలిముసుగు

**భూగ్రహంపై** వేడి, కాలుష్యం తదితర వాతావరణ దుష్పరిణామాలు పెరగటాన్ని కట్టడి చేసేందుకు 1995 సం॥లో ఐక్యరాజ్యసమితి, ప్రపంచదేశాల సదస్సు నిర్వహించింది. సదస్సుకు హాజరైన దేశాలతో 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (సిఒపి-కాప్) ఏర్పడింది.

'ప్రజలు, భూగోళం, సౌభాగ్యం' ఇతివృత్తాలుగా పేర్కొంటూ 'కాప్-26' సదస్సు 2021 అక్టోబర్ 31 నుండి నవంబర్ 12 వరకు బ్రిటన్ ఆధ్వర్యంలో స్కాట్లండ్‌లోని గ్లాస్గో నగరంలో జరిగింది. దాదాపు 200 దేశాలకు చెందిన ప్రభుత్వాధినేతలు, దౌత్యవేత్తలు, పర్యావరణ ఉద్యమకారులతోసహా 20 వేలమంది, రెండువారాలపాటు జరిగిన ఈ సదస్సులో పాల్గొన్నారు.

## 'కాప్-26' : నేపథ్యం

వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గిస్తూ, క్రమంగా నిరోధించే స్థాయికి చేరుకోవటం ద్వారా భూఉష్ణోగ్రత పెరుగుదలను- పారిశ్రామికీకరణకు ముందు నాటికంటే-1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించి పెరగకుండా చూడాలని 2015లో జరిగిన 'కాప్' సదస్సు తీర్మానించింది. గత ఆరు సం॥ల కాలంలో పురోగమనం లేకపోగా భూగోళం అత్యంత వేగంగా వేడెక్కుతోందని, ఇది మానవాళి పాలిట పెనుముప్పుగా మారబోతోందని ఐక్యరాజ్యసమితి నియమించిన అంతర్ ప్రభుత్వాల కమిటి(ఐపిసిసి) తన తాజా నివేదికలో పేర్కొంది. ఇప్పటికే భూతాపం పెరుగుదల 1.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని, గడిచిన దశాబ్దకాలం అత్యంత ఉష్ణమయంగా రికార్డులకెక్కిందని ఆ నివేదిక పేర్కొంది. అంతేగాదు; భూతాపం 2050 సం॥నాటికి 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పెరగవచ్చునని మొదట అంచనా వేసినా, 2030 సం॥నాటికే ఈ పరిస్థితి దాపురించ నుందని కూడా స్పష్టం చేసింది.

## శుష్కవాగ్దానాలు-శూన్యహస్తాలు

ఇప్పటికే ప్రపంచవ్యాపితంగా అసాధారణంగా -అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు, కార్చిచ్చులు, భూకంపాలు, కుండపోత వర్షాలు, వరదలు, మంచుకొండలు కరిగి సముద్రమట్టాల పెరుగుదల, భారీగా పంటల ముంపు, అరుదైన జీవజాతులు, వన్యప్రాణులు వేగంగా అంతరించిపోవటం, గాలి, నీరు, ఆహారకాలుష్యం... వంటి అనేక దుష్పరిణామాలతో ప్రజానీకం తీవ్ర సమస్యల నెదుర్కొంటున్నారు. ప్రపంచవ్యాపితంగా ప్రతి ఏటా కాలుష్యం బారినపడి 70 లక్షలమంది పైగా మరణిస్తున్నారు. కాలుష్యం శరీరంలోని ప్రతి అవయవంపై ప్రభావం చూపుతుంది. దీర్ఘకాలం కాలుష్యంలో జీవించినవారు గుండె, ఊపిరితిత్తులు, బ్రెయిన్‌స్ట్రోక్‌లతోపాటు మానసిక సమస్యలకు లోనవుతున్నారు. ఫలితంగా కోట్లాదిమంది ప్రజల ఆయుర్దాయం క్షీణిస్తోంది. ప్రమాదకర అతినీలలోహిత (అల్ట్రావయిలెట్) కిరణాల నుండి మానవాళిని రక్షిస్తున్న ఓజోన్ పొర మరింత దెబ్బతింటే ప్రపంచ మానవాళి ముందు మరో విలయం పొంచి వున్నట్లేనని అధ్యయనాలు తెల్పుతున్నాయి.

సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాధినేతలు నాయకత్వం వహిస్తున్న ప్రస్తుత 'కాప్-26' సదస్సులోనూ గంభీరమైన ప్రసంగాలు, భారీ వాగ్దానాలు, ప్రపంచ ప్రజల సౌభాగ్యం పట్ల, ప్రకృతి, పర్యావరణాలపట్ల అంతులేని భక్తి శ్రద్ధలను ఒలకబోసే కపటనాటకాలే ప్రధానంగా సాగాయి. ఇదంతా నిజమే కాబోలునని మధ్యతరగతి మేధావులు కొందరు భ్రమపడుతూ వుంటారు; బూర్జువా మేధావులు, వారి ప్రసార సాధనాలు ఆవిధంగానే ప్రచారం చేస్తుంటాయి. కానీ వాస్తవాలు భిన్నంగా వున్నాయి.

కాలుష్యానికి ప్రధాన వనరులుగా పేర్కొంటున్న బొగ్గు, ముడిచమురు, సహజవాయు (శిలాజ ఇంధనాల) ఉత్పత్తులను రెట్టింపు చేయాలని అనేక సంపన్న దేశాలు ప్రణాళికలు రూపొందించుకున్నాయని 'కాప్-26' సదస్సుకు పదిరోజుల ముందు అక్టోబర్ 20న – ఐక్యరాజ్య సమితి ఒక ప్రకటనలో తెల్పింది. ఈ సదస్సులో నాయకుల వాగ్దానాల డొల్లతనాన్ని ఈ ప్రకటన వెల్లడిచేస్తోంది. 'కాప్-26' సదస్సు జరగటానికి ముందురోజే జి-20 దేశాధినేతల సమావేశం రోమ్ నగరంలో ముగిసింది. ప్రపంచంలోని 20 భారీ ఆర్థికవ్యవస్థలకు, అంతర్జాతీయ వాణిజ్యంలో అత్యధిక భాగానికి ఈ దేశాలు ప్రాతినిధ్యం వహిస్తాయి. అలాగే అత్యధిక కర్బన ఉద్గారాలను, కాలుష్యాన్ని వెలువరించటంలోనూ ఈ దేశాలదే ప్రథమ స్థానమనేది నిర్వివాదాంశం. కాగా, ఈ జి-20 సదస్సులో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు ఇకముందు సహాయం చేయబోమని ప్రకటించారుగానీ, తమతమ దేశాలలో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని ఎలా నియంత్రిస్తారో, కాలుష్య తీవ్రతను ఎలా కట్టడిచేస్తారో తెల్పి చెప్పకపోవటంలోనే వీరి వంచన వెల్లడవుతుంది.

రెండువారాలపాటు చర్చోపచర్చలు సాగించిన 'కాప్-26' సదస్సు కూడా 'కొండను తవ్వి ఎలుకను బట్టిన'చందంగా బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని దశలవారీగా తగ్గించాలంటూ తీర్మానం చేసి చేతులు దులుపుకుంది. ప్రపంచ దేశాల నేతలు తమ వాగ్దానాలను చేతల్లో చూపించటంలో విఫలమయ్యారని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ సదస్సును ఉద్దేశించి వ్యాఖ్యానించాడు.

## 'కాప్-26' లో భారతప్రధాని ప్రగల్భాలు

'కాప్-26' సదస్సులో పాల్గొన్న మోడీ 'మనదేశంలో సాంప్రదాయేతర ఇంధన విద్యుత్తు సామర్థ్యాన్ని 500 గిగావాట్లకు(1గిగావాట్ అంటే వెయ్యి మెగావాట్లు) పెంచటం; పునరుత్పాదక ఇంధన వనరులతోనే 50 శాతం విద్యుత్తు అవసరాలను తీర్చుకోవటం; దేశంలోని 246 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను 100 కోట్ల టన్నులకు తగ్గించటం' తమ లక్ష్యంగా పేర్కొన్నాడు. ఈ లక్ష్యాలను 2030 సం॥నాటికి చేరుకుంటామని ప్రపంచవేదికపై నిస్సంకోచంగా మోడీ వాగ్దానం చేశాడు. ఇంకా, మనదేశాన్ని 2070 సం॥నికి కర్బన తటస్థీకరణ స్థితికి చేరుస్తామని ఆయన ప్రకటించాడు. (వాతావరణంలోకి విడుదలయ్యే కర్బన ఉద్గారాలను, అంతేస్థాయిలో వాతావరణం నుండి వాటిని పరిహరించే చర్యలు చేపట్టటాన్ని కర్బన తటస్థీకరణ లేదా 'నెట్‌జీరో' అంటారు) ఇవన్నీ ప్రచారార్భాటంతో కూడిన మోసపూరిత వాగ్దానాలే.

'కాప్-26' సదస్సుకు ముందురోజు రోమ్‌లో జరిగిన జి-20 సమావేశంలో మోడీ ఈ లక్ష్యాల జోలికే వెళ్ళలేదు. ప్రభుత్వ కాలుష్య నియంత్రణా చర్యల బండారం తెలియనదేమీకాదు. కరోనా విజృంభించిన కాలంలోనే కేంద్రప్రభుత్వం కొత్తగా 14 బొగ్గు బ్లాక్‌ల తవ్వకాలకు వేలం నిర్వహించింది. పైగా న్యూక్లియర్ సప్లయిగ్రూప్(ఎన్ఎస్‌జి)లో భారత్‌కు సభ్యత్వమిచ్చేదాకా, అణువిద్యుత్తును భారీగా ఉత్పత్తిచేసే దాకా, సాంప్రదాయేతర

ఇంధనాల వైపుకు వెళ్ళలేమని, బొగ్గుతో నడిచే విద్యుత్తు కేంద్రాలను నియంత్రించలేమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖామంత్రి పీయుష్‌గోయల్ ఈ సదస్సులోనే స్పష్టంచేశారు. అలాగే అత్యంత అధిక విస్తీర్ణంలో అడవులు కలిగివున్న పది దేశాలలో ఒకటైన మనదేశం ఏవో కుంటిసాకులతో 'కాప్-26' రూపొందించిన 'అటవీ నిర్మూలన నిరోధ' ప్రకటనపై సంతకం చేయలేదు.

## అణువిద్యుత్తు : పెనంపై నుండి పొయ్యిలో పడటం

అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగివున్న రష్యా (చెర్నొబిల్), అమెరికా (త్రీమైల్ ఐలండ్), జపాన్ (పుకిషిమా) దేశాలలో అణువిద్యుత్తు కేంద్రాలలో సంభవించిన పెనువిధ్వంసక ప్రమాదాల తీవ్రత, దశాబ్దాలు గడుస్తున్నా ఆ ప్రాంత ప్రజలను వెంటాడుతోంది. అభివృద్ధిచెందిన దేశాలలో ఈ పరిణామాల తర్వాత అణువిద్యుత్తు పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తటంతో అనేక దేశాలలో అణువిద్యుత్తు ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేశారు.

సామ్రాజ్యవాద దేశాలు వారి వద్ద నిరుపయోగంగా వున్న అణువిద్యుత్ సాంకేతికతలను, యంత్రాలను వెనుకబడిన, అభివృద్ధిచెందుతోన్న దేశాలకు తరలిస్తున్నాయి. దళారులైన ఆయా దేశాల పాలకులద్వారా అణు విద్యుత్ కేంద్రాలను స్థాపిస్తూ, లాభాలార్జిస్తున్నాయి. సామ్రాజ్యవాదులకు తలొగ్గిన మనదేశ పాలకులు పెనువిధ్వంసాన్ని, ప్రజావ్యతిరేకతను ఖాతరు చేయకుండా ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాల్లో అణువిద్యుత్ కేంద్రాలను స్థాపించారు. అణువిద్యుత్ కేంద్రాలలో ప్రమాదం సంభవిస్తే కలిగే వినాశనం, విడుదలయ్యే కాలుష్యం-బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల కాలుష్యంతో పోల్చడానికే వీలులేనన్ని రెట్లు-భారీగా వుంటుంది. దీనికి పుకుషిమానే తాజా ఉదాహరణ.

2011లో సంభవించిన భూకంపం కారణంగా పుకుషిమాలోని 3 అణురియాక్టర్లు ధ్వంసమయ్యాయి. వాటిలోని ఇంధన కడ్డీలు మరీ వేడెక్కకుండా 12 లక్షల 50వేల టన్నుల సముద్రపు నీటిని రియాక్టర్లలోకి పంపారు. తర్వాత అణువ్యర్థాలతో కూడిన ఆ నీటిని వెయ్యి స్టీలు ట్యాంకులలో నిల్వ వుంచారు. ఇవి ఏ రూపంలో బయటకొచ్చినా దీనిలో అణుధార్మిక విషపదార్థాలు వాతావరణంపై, జీవ-జంతు జాలంపై ప్రభావం చూపి తీవ్ర నష్టం కలుగచేస్తాయి. ఇంతటి ప్రమాదకరమైన అణువిద్యుత్తును ప్రత్యామ్నాయంగా పేర్కొనటంలోనే పాలకుల దళారీ స్వభావం మరోమారు వెల్లడవుతోంది.

## సౌరవిద్యుత్తు మరో ప్రత్యామ్నాయమా?

భారతదేశ విద్యుత్తు అవసరాల్లో 12శాతం మాత్రమే పునరుత్పాదక ఇంధనాలు తీరుస్తున్నాయని అంటున్నారు. మోడీ ప్రకటించిన విధంగా రానున్న 8 సం॥లలో దీనిని 50 శాతానికి పెంచటం అసాధ్యం. సౌర విద్యుత్తును దీనికి పరిష్కారంగా చూపుతూ గ్లాస్గో వేదికపై నుండి మోడీ 'ఒకే సూర్యుడు - ఒకటే ప్రపంచం - ఒకే గ్రిడ్' అనే నినాదమిచ్చాడు.

వందల, వేల ఎకరాల విస్తీర్ణంలో సౌర పలకలను ఏర్పరచినా దాని ద్వారా లభించే విద్యుత్తు స్వల్పమే. అంతేగాక, కాలపరిమితి దాటిన, నిరుపయోగమైన కోట్లాది టన్నుల సౌర పలకలు మరో కాలుష్య వ్యర్థాల ఉపద్రవంగా పరిణమిస్తాయి. అయినప్పటికీ, పర్యావరణ హితం పేరుతో దేశవ్యాపితంగా లక్షలాది ఎకరాల విస్తీర్ణంలో బడా, బహుళజాతి కంపెనీల ఆధ్వర్యంలో సోలార్ పార్కులను ఏర్పాటు చేయటానికే పాలకులు మొగ్గుచూపుతున్నారు.

**దేశంలో విస్తృతంగా లభ్యమయ్యే జల వనరులనుపయోగించి, దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతోనే ఎక్కడికక్కడ చెక్‌డ్యామ్‌లపై మినీ జలవిద్యుత్ కేంద్రాలను నిర్మించుకోవచ్చు. చౌకగా, పర్యావరణహితంగా, పుష్కలంగా విద్యుత్తు తయారు చేసుకునే ఈ మార్గాలను మరింతగా అభివృద్ధి చేయటానికి దళారీ పాలకులు పూనుకోరనేది స్పష్టం.**

## వాతావరణాన్ని విషమయం చేస్తున్న పెట్టుబడిదారీ లాభాపేక్ష

అణువిద్యుత్ కర్మాగారాలతోపాటు ప్రమాద భరితమైన రసాయన, ఔషధ పరిశ్రమలకు, యురేనియం వంటి అణుధార్మిక స్వభావం కలిగిన ఖనిజ తవ్వకాలకు, బాక్సైట్ వంటి ఖనిజాల శుద్ధి కర్మాగారాలకు దేశ, రాష్ట్రాల పాలకులు అనుమతులిస్తున్నారు. ఈ కారణంగా వాతావరణంతోపాటు నదీజలాలు, తాగునీరు - సాగునీరు ఎంతో కలుషితమౌతున్నాయి. హైదరాబాద్ పరిసరాల్లో రసాయన, బల్క్‌డ్రగ్స్ పరిశ్రమల కాలుష్యం - వాతావరణాన్నేకాక, భూగర్భజలాల్ని సైతం విషపూరితం చేస్తోందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పారిశ్రామిక యాజమాన్యాలు కాలుష్యాలను క్రమబద్ధీకరించే, శుద్ధిచేసే, పరిహరించే చర్యలేమీ చేపట్టకపోయినా పాలకులకు చీమకుట్టినట్లయినా లేదు.

ఇంకా, భారీ నీటిపారుదల ప్రాజెక్టుల పేరున, నూతన - విమానాశ్రమాలు, నౌకాశ్రయాలు, ఆరు - ఎనిమిది వరుసల రహదార్లు, పర్యాటక అభివృద్ధి కేంద్రాల వంటి పలు పేర్లతో అటవీ భూములు, పంటపొలాలతో సహా, లక్షలాది ఎకరాల భూములను బడా, బహుళజాతి కంపెనీలకు కట్టబెడ్తున్నారు. అధికార రాజకీయ నాయకులు, బడా కాగిత పరిశ్రమ యజమానులు, కలప మాఫియాలు కుమ్మక్కై లక్షలాది ఎకరాల విస్తీర్ణంలోని వెదురు, టేకు, మద్ది, ఎర్రచందనం తదితర మేలైన వృక్ష జాతులను నరికిపారేస్తూ, అడవులను హరించివేస్తున్నారు. మరోవైపున తరతరాలుగా అడవులను సంరక్షించుకుంటూ, వన్యప్రాణులతో సహజీవనం చేస్తూ వస్తున్న ఆదివాసులు సాగించే కొండపోడు వ్యవసాయమే అడవులు అంతరించిపోవటానికి కారణమంటూ పాలకులు, వారి మీడియా దుర్మార్గంగా ప్రచారం చేస్తున్నారు.

పట్టణాలు, నగరాల్లో నివాస, వాణిజ్య సముదాయాలకోసం పచ్చదనమే లేకుండా కాంక్రీట్ మయం చేస్తున్నారు. పారిశ్రామిక యాజమాన్యాల లాభాలకోసం ఇబ్బడిముబ్బడిగా ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాల వాడకాన్ని పెంచటంతో, దానికనుగుణంగా విద్యుత్తు వినియోగం కూడా భారీగా పెరుగుతోంది.

71శాతం అటవీ భూమి వున్న ఉత్తరాఖండ్ రాష్ట్రంలో భారీగా నిర్మించే రోడ్లు, భవనాలు, పర్యాటక కేంద్రాలతో అటవీప్రాంతం తరగి పోతోంది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఉత్పాతాలు సంభవిస్తున్నాయి; జీవవైవిధ్యం నశిస్తోంది. నదీతీరాల్లో విచక్షణా రహితంగా ప్రోత్సహిస్తున్న ఇసుక తవ్వకాలు, భారీ రహదార్లు, డ్యామ్‌ల నిర్మాణం - నదుల సహజ ప్రవాహ గమనాన్ని దెబ్బతీస్తున్నాయి. దీనితో ఆకస్మికంగా భారీ వరదలు గ్రామాలను, పట్టణాలను ముంచెత్తటాన్ని ఇటీవల కాలంలో తరచూ చూస్తున్నాం. అధిక శాతం నదులు 2019 సం॥లో భారీ వరద ఉధృతితో ప్రవహించాయని కేంద్ర జలశక్తిశాఖ నివేదిక తెలుపుతోంది.

గుజరాత్ నుండి తమిళనాడు వరకు ఐదు రాష్ట్రాల పరిధిలో 1.60 లక్షల చ॥కి॥మీ॥మేర పశ్చిమ కనుమలు విస్తరించి వున్నాయి. ఒడిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడులలోని విశాల ప్రాంతాల్లో తూర్పుకనుమలు విస్తరించి వున్నాయి. పర్యావరణపరంగా సున్నితమైన ఈ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆర్థికమండళ్ళు, హిల్ స్టేషన్ల పేరిట పాలకులు అనుమతులిస్తున్నారు. అలాగే లేటరైట్, బాక్సైట్ తదితర అనేక ఖనిజాల తవ్వకాలకు భూములు కేటాయిస్తూ విశాల అటవీ ప్రాంతాలను విధ్వంసం చేయటం ప్రకృతి విపత్తుల తాకిడిని పెంచుతోంది. ప్రపంచ దేశాల మార్కెట్‌లను చేజిక్కించుకునేందుకు సామ్రాజ్యవాద అగ్రరాజ్యాలు వివిధ దేశాలపై దాడులలో ప్రయోగించే బాంబులు, పేలుడు పదార్థాలు,

క్షిపణులు, అత్యంత క్రూరమైన జీవరసాయన ఆయుధాలు, సముద్రగర్భంలో అణుజలాంతర్గాముల సంచారం వంటివన్నీ లెక్కల్లో చూపని జీవావరణ, పర్యావరణ, వాతావరణ విధ్వంసకాలే.

## పర్యావరణ హితం పేరుతో విద్యుత్ వాహనాల అమ్మకాలు

పాలకులు ప్రజారవాణా వ్యవస్థపై దృష్టి సారిస్తే వందవాహనాల బదులు వందమందిని ఒక వాహనమే గమ్యానికి చేరుస్తుంది. దీనితో వాహనరద్దీ, కాలుష్యం తగ్గటమేగాక సమయం, ఇంధనమూ ఆదా అవుతాయి. పెట్టుబడిదారులకు ఈ పద్ధతి లాభదాయకంకాదు గనుక వ్యక్తి గత వాహన వినియోగాన్ని కోట్లాది రూపాయల ప్రకటనలిచ్చీ, జీరో వడ్డీలకు రుణాలిచ్చీ, ఇఎమ్ఐ సదుపాయం కల్పించీ భారీగా ప్రోత్సహిస్తున్నారు. రోడ్లమీదకు వచ్చిన లెక్కకు మించిన వాహనాలు వెలువరించే కర్బన ఉద్గారాలు, పారిశ్రామిక కాలుష్యాలతో కలిసి నగర జీవనాన్ని నరకప్రాయం చేస్తున్నాయి. ఇప్పటికే ఢిల్లీ నగరంలో కాలుష్య తీవ్రత కారణంగా వారాంతాల్లో లాక్‌డౌన్ విధించాలని చూస్తున్నారు. ఢిల్లీ పరిసర గ్రామాల్లో రైతాంగం పంట వ్యర్థాలను పొలాలలోనే తగుల బెట్టటాన్ని ప్రధానకారణంగా జూపి పాలకులు తమ తప్పిదాల్ని మరుగుపరుస్తున్నారు. తాగునీటిని కలుషపూరితం చేసి బడా, బహుళజాతి కంపెనీలు ఇప్పటికే లక్షలకోట్ల రూ॥ల నీటి వ్యాపారం చేస్తున్నాయి. పీల్చే గాలిని కాలుష్య భరితంచేసి ఆక్సిజన్ క్లబ్బుల నేర్పరచి గంటల లెక్కన ఛార్జీలను పిండుకోవటం ఇప్పటికే ప్రారంభమైంది.

మరలా తిరిగి వాతావరణాన్ని చల్లబరచటం కోసమంటూ ఏ.సి. కార్లు మొదలుకొని నివాసాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, కళ్యాణమండపాలు, జిమ్‌లు, సెలూన్ల వరకు ఎయిర్ కండిషనర్ల వాడకాన్ని పెంచారు. ఇవన్నీ వెలువరించే వేడి కర్బన ఉద్గారాలు తిరిగి వాతావరణాన్ని మరింత దుర్భరం చేస్తోంది. ఖర్చుతో కూడిన ఏసీలు, రిఫ్రిజరేటర్లు, మినరల్‌వాటర్ తదితర సదుపాయాలతో సంపన్న వర్గాలు కులాసాగా జీవిస్తోంటే, అత్యధిక ప్రజానీకం కాలుష్యపు కోరలకు బలవుతున్నారు. ఈ కాలుష్యానికి పరిష్కారం పేరుతో పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలకు బదులుగా విద్యుత్తు బ్యాటరీతో నడిచే వాహనాలను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నారు. ఇటీవలే ఓలా సంస్థ విద్యుత్తు స్కూటర్ల అమ్మకాలు ప్రారంభిస్తే తొలి రెండు రోజుల్లోనే 1100 కోట్ల రూ॥ల విలువైన స్కూటర్ల విక్రయాలు జరిగాయని ప్రకటించింది. కాలుష్యాన్ని కట్టడి చేసే పేరుతో, 15 ఏళ్ళకు పైబడిన వాణిజ్య వాహనాలను, 20 ఏళ్ళకు పైబడిన వ్యక్తిగత వాహనాలను (మొత్తం 2 కోట్ల 80 లక్షల వాహనాలని అంచనా) తుక్కుగా మార్చాలని, వాటిని రోడ్లపై తిరగనివ్వరాదంటూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'తుక్కు విధానం' ప్రకటించింది. ఈ చర్యలన్నీ రానున్న కాలంలో బహుళజాతి, బడా కార్పొరేట్ కంపెనీలకు విస్తృత మార్కెట్‌ను కల్పిస్తాయనేదాంట్లో సందేహం లేదు. ఇదొక విషవలయం.

## పోగుపడుతున్న ఘన వ్యర్థాలు

పర్యావరణ హితమైన జనపనార సంచులు, గోతాల స్థానంలో పాలిథీన్ సంచుల, గోతాల వాడకాన్ని, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని బడా పారిశ్రామిక వర్గాలు భారీగా పెంచారు. వ్యవసాయాధారిత జనపనార మిల్లులను మూతవేయించి, ఆ కార్మికులను, జనపనార రైతులను దెబ్బతీశారు. ప్లాస్టిక్, పాలిథీన్‌ల దిగుమతి, సంచుల ఉత్పత్తి ఏలిన వారి కనుసన్నలలోనే జరుగుతుండగా, వాటిని నిరోధించకుండా 'పాలిథీన్ వినియోగంపై నిషేధం' అనే బూటకపు చర్యలకు పాలకులు పాల్పడుతున్నారు. ఈ పాలిథీన్ శతాబ్దాల కాలం భూమిలో కలిసిపోకుండా ఘన వ్యర్థాలుగా మిగిలిపోతుందని అందరికీ తెలిసిందే. 2020 నాటికి దేశంలో 7,800 కోట్ల ఘన వ్యర్థాలున్నాయని అంచనా వేశారు. సముద్రాలలోనూ 15 కోట్ల టన్నుల వ్యర్థాలు పోగుపడ్డాయి. 2025 సం॥ నాటికి సముద్ర గర్భంలో ప్రతి 3 టన్నుల చేపలకు ఒక టన్ను ప్లాస్టిక్ ఘనవ్యర్థాలు వుండబోతున్నాయి.

## సముద్రాలపై కాలుష్యాల దుష్ప్రభావం

భూతాపం కారణంగా ధృవప్రాంతాల్లో, మంచుకొండల్లో మంచు వేగంగా కరిగిపోతూ సముద్రమట్టాలు పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాపితంగా సముద్ర మట్టాలు ప్రతి ఏటా 3.7 మి.మీ మేర పెరుగుతున్నట్లు శాస్త్రీయ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. తుపానులు సైతం ఈ కారణంగా అధికమౌతున్నాయి. ఫలితంగా తీరప్రాంతం అధికంగా కోతకు గురవుతోంది. మనదేశ తీర ప్రాంతంలో 32 శాతం భిన్నస్థాయిల్లో కోతకు గురవుతోందని జాతీయ తీరప్రాంత పరిశోధనా కేంద్రం ఇటీవల వెల్లడించింది.

దీనికితోడుగా, సముద్ర అలల ఉధృతికి తీరం కోతకు గురికాకుండా గోడలా నిలిచి రక్షణ కల్పించే తీరప్రాంతంలోని మడ అడవుల, సరుగుడు తోటల విధ్వంసం జరుగుతోంది. చేపల, రొయ్యల చెరువులకోసం, నౌకాశ్రయాల నిర్మాణం పేరిట, శాండ్‌మైనింగ్, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పేరుతో తీరప్రాంత విధ్వంసం పాలకుల ఆమోదంతోనే సాగుతోంది. తీరప్రాంత నియంత్రణ చట్టాలన్నింటినీ తుంగలో తొక్కి, సముద్ర తీరాన్ని సర్వనాశనంగావిస్తూ, తరతరాలుగా సముద్రాన్నే నమ్ముకొని జీవిస్తున్న తీరప్రాంత మత్స్యకారులను తరిమివేస్తున్నారు.

## పోరాటమే పరిష్కారం

పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ లాభాపేక్ష ప్రధాన సూత్రంగా నడుస్తుంది. ఇది కార్మికుల శ్రమశక్తిని నికృష్టంగా దోపిడీ చేయటంతోపాటు, ప్రకృతిలోని వనరులన్నింటిని విచక్షణా రహితంగా కొల్లగొట్టి తన లాభాలుగా పోగేసుకుంటుంది. ఈ దుష్ట విధానాల దుష్ఫలితాలను ప్రపంచ ప్రజానీకమంతా అనుభవించాల్సి వస్తోంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి మనిషిని ప్రకృతినుండి వేరుచేస్తుందని, హద్దుల్లేని వనరుల దోపిడీ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని కారల్‌మార్క్స్ 180 సం॥ల క్రితమే వ్యాఖ్యానించాడు. ప్రకృతిని ఇన్ని విధాలుగా ధ్వంసం చేస్తున్న దోపిడీశక్తులే, వాతావరణాన్ని పరిరక్షించాలంటూ 'కాప్-26' వేదికపై నుండి గుండెలు బాదుకోవటం ఒక క్రూర పరిహాసం. కనుక, దోపిడీ పాలకుల వంచనాత్మక 'వాతావరణ పరిరక్షణ' పిలుపులలోని బూటకత్వాన్ని ఎండగట్టాలి. కాలుష్యాన్ని నియంత్రించే నిర్దిష్ట డిమాండ్లపై ప్రజాఉద్యమ నిర్మాణం సాగించాలి. పెనువిధ్వంసకరమైన అణువిద్యుత్ వంటి ప్రత్యామ్నాయాలను నిలువరించేందుకు పోరాటం చేయాలి.

ప్రజల జీవనానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం పరిసరాలన్నింటినీ కాలుష్యభరితం చేస్తున్న దోపిడీ వర్గాలకు లాభాలు సమకూర్చే పాలకుల విధానాలను ప్రజానీకం అర్థం చేసుకోకుండా వుండేందుకే 'కాప్-26' సదస్సు వంటి వాటిని ప్రచారార్భాటంతో నిర్వహిస్తున్నారు. దీనికి భిన్నంగా, ప్రకృతి-మానవ సమాజాలు ఆంగిక సంబంధం కలిగివున్నాయనే అవగాహనతో సోషలిస్టు సమాజం నడుస్తుంది. ప్రకృతి సూత్రాలను అర్థంచేసుకోవటం, ప్రకృతిపై స్వారీ చేయడానికి కాకుండా, ప్రకృతి-మానవాళి మనుగడల నడుమ సమతుల్యతను సాధించేందుకు ఉపయోగిస్తుంది. వ్యక్తుల చైతన్యాన్ని పెంపొందించటం ద్వారా వ్యక్తిగత ప్రయోజనాలను సమాజ ప్రయోజనాలకు లోబరిచి ఈ రెంటికీ మధ్య సామరస్యాన్ని సాధించటం సోషలిస్టు వ్యవస్థలోనే సాధ్యమౌతుంది. అందుకు నూతన ప్రజాస్వామికం ద్వారా సోషలిస్టు వ్యవస్థ దిశగా ప్రజలను కార్యోన్ముఖుల్ని చేయాల్సిన అవసరముంది. ✶

# లీజు పేరుతో మౌలిక సదుపాయాల రంగాన్ని గుత్త పెట్టుబడులకు స్వాధీనం చేస్తున్న ఆస్తుల నగదీకరణ

- ప్రొ. తోట జ్యోతిరాణి

**"నగదీకరణ** ద్వారా సృజన" అనే విధాన ప్రాతిపదిక మీద మౌలిక సదుపాయాలకు సంబంధించిన, రాబడికి అవకాశమున్న ఆస్తులను ప్రైవేటు పెట్టుబడిదారులకు లీజు/ అద్దె కివ్వడం గురించి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 23, ఆగస్టు 2021న గర్వంగా ప్రకటించిన సంగతి మనకు తెలుసు. ఇందువల్ల, ఒకవైపు ప్రభుత్వం ఆస్తుల మీద యాజమాన్యాన్ని కోల్పోకుండా, అప్పులు తీసుకోకుండా, అదనపు పన్నులు వేయకుండా, ఆస్తులను అద్దెకివ్వడం ద్వారా నిధులను సమకూర్చుకోవచ్చని, ఇది ప్రభుత్వ రాబడి చరిత్రలోనే ఒక గొప్ప నవకల్పన అని ఈ విధానం యొక్క ప్రాముఖ్యతను చెబుతున్నది ప్రభుత్వం. మరొకవైపు, ఈ విధంగా అద్దెకివ్వడం వల్ల అసంపూర్ణ వినియోగంలో ఉన్న మౌలికరంగ ఆస్తులను పూర్తిగా వినియోగించటానికి, నాణ్యతను పెంచటానికి ప్రైవేటు పెట్టుబడిదారుల సామర్థ్యం ఉపయోగ పడుతుందని, ఇట్లా మౌలిక సదుపాయాల రీసైక్లింగ్ కి వీలవుతుందని ప్రభుత్వం ఆస్తులను అద్దెకివ్వడంలో ఇమిడి ఉన్న ప్రయోజనాలను చెబుతున్నది. దీనికి సంబంధించిన వివరాలను, నియమ నిబంధనలను నీతీ ఆయోగ్ రెండు సంపుటాలుగా విడుదల చేసింది.

ఈ ప్రక్రియలోని మొదటి విడత రాబోయే నాలుగు సంవత్సరాలు, అంటే 2021 - 2025 వరకు కొనసాగుతుందని, ఆస్తులను 30 సంవత్సరాలకు లీజు/ అద్దెకు ఇవ్వటం, తద్వారా 6 లక్షల కోట్ల రూపాయలను సంపాదించటం, అందులో ఈ సంవత్సరమే 88,000 వేల కోట్లు సంపాదించటం లక్ష్యమని ప్రకటించింది.

ఒకవైపు కోవిడ్ -19 విపత్తుతో ప్రజలందరి జీవితాలు ఎంత సీరియస్‌గా అస్తవ్యస్త మవుతున్నాయో అందరికీ తెల్సిందే. ప్రజల జీవితాలు, జీవనోపాధులు ముఖ్యం అని ఆర్థిక సర్వే 2021 స్పష్టంగా వ్యక్తం చేసింది. కానీ ఈ అంశం ప్రభుత్వానికి పట్టనిదే అయింది. ప్రజల ప్రయోజనాలను విస్మరించడమే, ప్రజల జీవితాలను దుర్భర స్థితిలోకి నెట్టివేసే విధానాలను రూపొందించి అమలు పరచటమే సాహసోపేతమైన చర్యగా బలంగా ప్రచారం చేసుకుంటున్న సందర్భం ఇది. అందువల్లనే కోవిడ్ విపత్తు సందర్భంలో ప్రభుత్వం హడావుడిగా మౌలిక సదుపాయాల ఆస్తులను అద్దెకివ్వటానికి కావలసిన పనులను గబగబా చేసుకుంటున్నది. అసలు దేశంలో ఎన్ని మౌలిక వసతులు నిర్మించబడి ఉన్నాయి? అందులో అధిక రాబడితో గుత్త పెట్టుబడులకు ఆకర్షణీయంగా ఉన్న ఆస్తులేమిటి? వెంటనే లీజుకివ్వవలసిన ఆస్తులను గుర్తించటం, గుత్త పెట్టుబడుల సౌలభ్యం కోసం ఏ రాయితీలను ఇవ్వాలి? అందుకు చేయవలసిన చట్ట సవరణలు ఏమిటి? వీటన్నింటికీ సంబంధించిన నిర్ణయాలు హడావిడిగా జరిగిపోతూనే ఉన్నాయి. ప్రజల సంక్షేమం నుంచి స్పష్టంగా విడిపోయిన ప్రభుత్వానికి, ప్రజల విపత్తు ఆటంకం కానేకాదు. పైగా వివాదాస్పదమైన ప్రజావ్యతిరేక చట్టాలు చేసి అమలు పరచటానికి కోవిడ్ విపత్తు ప్రభుత్వానికి అందివచ్చిన అవకాశం. వీటిని తీవ్రంగా ప్రతిఘటించటానికి వీలు కూడా లేని స్థితికి ప్రజలు నెట్టివేయబడి ఉన్న సందర్భం ఇది. ప్రపంచం మొత్తం "రాజకీయ నియంతృత్వం, ఆర్థిక విధ్వంసం"తో కూడిన విషవలయంలో బందీగా ఉన్నదని, "అందువల్ల, ఏ విపత్తు సంభవించినా దానిని పాలకవర్గం సమర్థవంతంగా ఉపయోగించుకుని కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం కావాల్సిన విధానాలను రూపొందించి, హడావుడిగా అమలు చేస్తుందని, కెనడాకు చెందిన రచయిత నవోమి క్లెయిన్ తన గ్రంథం 'ద షాక్‌డాక్ట్రిన్, ద రైజ్ ఆఫ్ డిజాస్టర్ కాపిటలిజమ్'లో వివరంగా చర్చించడం ప్రస్తావించుకోవాల్సిందే. "ఆస్తులను అద్దెకిచ్చే" ప్రక్రియను వేగవంతం చేయటం ఇటువంటిదే. త్వరత్వరగా, దూకుడుగా దేశ సంపదను బడా పెట్టుబడుదారులకు అప్పగించే నయా ఉదారవాద ప్రక్రియలో భాగమే "ఆస్తులను అద్దెకివ్వడం".

**అందువల్లనే ప్రజాపక్ష వాదులు దీనిని వ్యవస్థీకృత లూటీ అని, చట్టబద్ధమైన దోపిడీ అని సీరియస్‌గా నిరసిస్తున్నారు . క్రోనీ పెట్టుబడిదారీ వ్యవస్థను బలోపేతం చేయటానికి, అందుకు అతి కీలకమైన మౌలిక వసతులను పెట్టుబడులకు అప్పగించటానికి దళారీ ప్రభుత్వం పకడ్బందీగా రూపొందించిన సరికొత్త నయా ఉదారవాద విధానమే 'ఆస్తుల నగదీకరణ'. ఇందుకోసం కావాల్సిన సంస్థలను, విధివిధానాలను 2014 నుండే ప్రభుత్వం రూపొందిస్తున్నది. అంటే 2014లోనే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసిన ప్రస్తుత ప్రభుత్వం, సకల దేశ సంపదను గుత్త పెట్టుబడులకు అమ్మకం, అద్దె, అభివృద్ధి పేరుతో అప్పగించటానికి ప్రణాళికాబద్ధంగా, 'దృఢసంకల్పం'తో పనిచేస్తున్నది.**

## మౌలిక వసతుల రంగాన్ని గుత్త పెట్టుబడులకు అప్పగించటానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు :

ఆంతరంగిక భద్రతకు, రక్షణకు, దేశ అభివృద్ధికి అతి కీలకమైన మౌలిక సదుపాయాల రంగంలో ప్రవేటు పెట్టుబడులను బలోపేతం చేసే క్రమం 2014లోనే ప్రారంభమైంది. అవస్థాపన పెట్టుబడుల ట్రస్టుల ఆవిష్కరణ అందులో భాగమే. షేర్ల ద్వారా నిధులను సమీకరిస్తుంది. అవస్థాపన ప్రాజెక్టులలో పెట్టుబడులను పెడుతుంది. పూర్తయిన ప్రాజెక్టుల మీద 80 శాతం, నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టుల మీద 20 శాతం నిధులను ఉపయోగించాలి. పూర్తయిన ప్రాజెక్టులను బ్రౌన్ ఫీల్డ్ అవస్థాపన అంటారు. ప్రస్తుతం ప్రకటించిన 'ఆస్తుల నగదీకరణ'లో అద్దెకిచ్చే ఆస్తులు బ్రౌన్ ఫీల్డ్ మౌలిక సదుపాయాలవే. అంటే ఆగస్టు 23, 2021న ప్రకటించిన 'ఆస్తులను అద్దెకివ్వటం' అంశానికి అవసరమైన పునాది 2014 లోనే సృష్టించబడింది. ఇక కేల్కర్ కమిటీ 2015, సూచన ప్రకారం ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యానికి సరైన ప్రత్యామ్నాయం 'ఆస్తుల నగదీకరణ'నే. మౌలిక సదుపాయాలను గుత్త పెట్టుబడులకు అప్పగించడానికి ఆగస్టు 2021న వెలువడిన ప్రకటనకు, ఈ కమిటీ సూచనతో సైద్ధాంతిక ప్రాతిపదిక, కమిటీ నివేదిక ద్వారా రూపొందింది.

2019లో రియల్ ఎస్టేట్ పెట్టుబడుల ట్రస్టులు ప్రారంభమైనాయి. బ్రౌన్ ఫీల్డ్ అవస్థాపన ఆస్తులను అద్దెకు తీసుకోవడానికి ఈ రెండు ట్రస్టులు కీలకమని ప్రభుత్వం చెబుతూనే ఉన్నది. ఈ పెట్టుబడులను ఆకర్షించటానికి క్యాపిటల్ గెయిన్స్ మీద పన్నును రద్దు చేయటం, అయితే ఈ ట్రస్టు వాటాదారులు పొందిన డివిడెండ్ల సొమ్ము మీద ఆదాయపన్ను ఉంటుంది. ట్రస్టు

యాజమాన్యం, గుత్త పెట్టుబడులకు పన్ను మినహాయింపు అన్నమాట. ఈ ట్రస్టులను దివాళా చట్టం పరిధిలోకి తీసుకురావటం, దివాళాకు ఆప్షన్ ఇవ్వటం ద్వారా ట్రస్టులకు రక్షణ, ఆదాయ పన్ను చట్టం 1961లోని 54 ఇ.సి. సెక్షన్ ద్వారా పన్ను ప్రయోజనం కల్పించాలని, ఆవిధంగా 'ఆస్తుల నగదీకరణ'కు ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాలంటుంది ప్రభుత్వం. వీటివల్ల, ఖజానాకు నష్టమే. కానీ మౌలిక వసతుల రంగంలో గుత్త పెట్టుబడులను బలోపేతం చేయాలంటే ఈ నష్టం తప్పదు మరి.

జూలై 2021 నాటికి ఈ రెండు ట్రస్టులూ సమీకరించిన నిధులు 9.7 బిలియన్ డాలర్లు. ఇక, ఆస్తులను అద్దెకు తీసుకోవటమే మిగిలివున్న ప్రక్రియ.

## మౌలిక సదుపాయాల రంగం గురించి జాతీయ అవస్థాపన పైప్ లైన్ :

2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల విలువ గల ఆర్థిక వ్యవస్థగా రూపొందటానికి మౌలిక వసతుల రంగం వేగవంతంగా అభివృద్ధి చెందాలి. ఈ విలువ గల ఆర్థిక వ్యవస్థ లక్ష్యమే కుబేరుల సంపదను మరింత పెంచటం కదా! గుత్త పెట్టుబడులను బలోపేతం చేయటం దీనితోనే ముడిపడి ఉంటుంది. అదే సమయంలో, మౌలిక రంగం మీద గుత్త పెట్టుబడుల ఆధిపత్యం బలపడాలి, స్థిరపడాలి. నిర్మించబడిన మౌలిక సదుపాయాల రంగ ఆస్తులను అంటే బ్రౌన్ ఫీల్డ్ అవస్థాపన ఆస్తులను ప్రధానంగా రాబడి అధికంగా వచ్చే వాటిని అద్దెకు తీసుకోవటానికి గుత్త పెట్టుబడుల రంగం సిద్ధం చేయబడింది. ఇందుకోసం, గ్రీన్ ఫీల్డ్ మౌలిక సదుపాయాలు నిర్మించబడాలి కదా! ప్రైవేటు పెట్టుబడులకు ఇందులో రిస్కు ఎక్కువ. అందువల్ల ఈ సదుపాయాలను నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అవుతుంది. అప్పుడే మౌలిక సదుపాయాల రంగం అభివృద్ధి చెంది, ఒకవైపు సంపన్నుల సంపద పెరుగుతుంది. మరొకవైపు గుత్త పెట్టుబడులకు స్వాధీనం చేయటానికి బ్రౌన్ ఫీల్డ్ మౌలిక సదుపాయాలు సిద్ధమవుతాయి.

ఈ లక్ష్యంతోనే డిసెంబర్ 2019లో 111 లక్షల కోట్ల రూ.ల విలువ గల మౌలిక రంగ సదుపాయాలను 6 సంవత్సరాల కాలంలో, అంటే 2025 నాటికి నిర్మించే లక్ష్యంతో "జాతీయ అవస్థాపనా పైప్ లైన్" ప్రకటించబడింది. స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల వాటా 2008- 12 మధ్యకాలంలో 7 శాతం ఉండగా, 2013- 17 మధ్య కాలంలో అది 5.8 శాతానికి తగ్గింది. అందువల్లనే, ఈ వాటాను పెంచే క్రమంలో 2018లో 10.2 లక్షల కోట్లను, 2019లో 10 లక్షల కోట్లను ప్రభుత్వం ఈ రంగానికి కేటాయించింది. నిజానికి గ్లోబల్ మౌలిక సదుపాయాల అవసరాల దృష్టికోణం నుండే మన దేశంలో ఈ రంగానికి ప్రాధాన్యత ఏర్పడింది.

గ్లోబల్ మౌలిక సదుపాయాల అవుట్ లుక్ 2017 ప్రకారం 2016- 2040 మధ్య కాలంలో ఈ రంగానికి 94 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయి. అందులో 50 శాతం ఆసియా నుండే రావాలి. ఇందులో ప్రధాన పాత్ర చైనా, ఇండియా, జపాన్ లదే.

కాగా, ప్రకటించిన జాతీయ మౌలిక సదుపాయాల పైప్ లైన్ కోసం 111 లక్షల కోట్ల రూ.లను ఎట్లా సమకూర్చుకోవాలి? 83 నుండి 85 శాతం వరకు సంప్రదాయిక విత్త వనరుల ద్వారానే. అంటే బడ్జెట్, బడ్జెటేతర విత్త వనరులు, రుణాలు. ఇక 15 నుండి 17 శాతం నిధులను సరికొత్త ప్రత్యామ్నాయ వనరుల ద్వారా, అంటే ఆస్తులను అద్దెకివ్వటం ద్వారా సమకూర్చుకోవటం. మౌలిక సదుపాయాల విత్తం కోసం డెవలప్‌మెంట్ ఫైనాన్స్ ఇన్స్టిట్యూషన్ (డిఎఫ్ఐ) ఏర్పాటు చేయబడింది. ఇందుకోసం నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ బిల్లు- 2021, మార్చి 2021లో ఆమోదించబడింది. ఈ సంస్థ ప్రారంభ వాటా ధనం 20,000 కోట్ల రూపాయలు. దీని పరపతి సృజన మూడు సంవత్సరాల కాలంలో 5 లక్షల కోట్ల రూపాయలు.

## ఆస్తుల నగదీకరణ కోసం గుర్తించిన మౌలిక సదుపాయాలు :

దీనిని వేగవంతం చేసే క్రమంలో నీతీ ఆయోగ్ కేంద్ర ప్రభుత్వ మౌలిక సదుపాయాల జాబితాను రూపొందించింది.

ఆస్తుల నగదీకరణ దృష్ట్యా ఆస్తులను అతి ముఖ్యమైనవి ఇతరాలుగా గుర్తించడం జరిగింది. అతి ముఖ్యమైనవి అంటే వాణిజ్య లక్ష్యాలకు కేంద్రమైనవి. ఇందులో రవాణాకు చెందిన రోడ్లు, రైల్వేలు విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, పంపిణీకి సంబంధించిన నెట్ వర్క్, పైప్ లైన్లు, గిడ్డంగులు మొదలైనవి ఉంటాయి. ఇక ఇతరాలలో భూమి, పార్సిల్స్, భవనాలు ఉంటాయి.

| ఆస్తులు | వివరాలు, విలువ |
|---|---|
| 1. రోడ్లు | 132, 499 కి.మీ హైవే |
| 2. విద్యుచ్ఛక్తి ట్రాన్స్ మిషన్ | (i) 171,950 కి.మీటర్ల ట్రాన్స్ మిషన్ లైన్లు<br>(ii) 262 సబ్ స్టేషన్లు<br>ట్రాన్స్ మిషన్ శక్తి 444, 738 ఎం.వి.ఏ |
| 3. విద్యుచ్ఛక్తి జనరేషన్ | (i) థర్మల్ విద్యుత్తు 60,224 మె.వా<br>(ii) హైడ్రో విద్యుత్తు -4912 మె.వా<br>(iii) సోలార్ మొదలగునవి- 7071 మె.వా |
| 4. విమానాశ్రయాలు | 137 |
| 5. నౌకాశ్రయాలు | 12 భారీ పోర్టు ట్రస్టులు<br>నిర్వహణ శక్తి 1535 ఎంఎంటిపిఏ |
| 6. టెలికాం టవర్లు | 69,047 |
| 7. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ | నిడివి : 5,25,706 కి.మీ. |
| 8. రైల్వేస్టేషన్లు | 7325 |
| 9. రైల్వే ట్రాక్ | 1,26,366 ట్రాక్ కి.మీ (67,956 రూట్ నిడివి) |
| 10. సహజ వాయువు పైప్ లైన్ | 19,998 కి.మీ |
| 11. పెట్రోలియం ఉత్పత్తుల పైప్ లైన్ | 14,623 కి.మీ |
| 12. గిడ్డంగులు | నిల్వ చేయగల శక్తి 818 లక్షల మెట్రిక్ టన్నులు |
| 13. క్రీడా స్టేడియంలు | 5 జాతీయ స్టేడియంలు<br>ఎన్నో ప్రాంతీయ కేంద్రాలు |

ఆస్తుల నగదీకరణలో ప్రాధాన్యత దృష్ట్యా మొదటి మూడు1). రోడ్లు - 27%, 2). రైల్వేలు - 25%. 3). విద్యుచ్ఛక్తి - 15 %. ఈ పథకం ద్వారా సమకూర్చుకునే రాబడిలో దాదాపు 70% ఈ మూడు రంగాల నుండే. వెంటనే అద్దెకివ్వడానికి గుర్తించిన ఆస్తులు.

1). 26,700 కి.మీ రోడ్లు. ఇవి 22 స్ట్రెచెస్‌కి సంబంధించినవి.

2). 400 రైల్వే స్టేషన్లు.

3). 90 ప్యాసింజర్ రైళ్లు.

4). 28,600 కి.మీ ట్రాన్స్ మిషన్ లైన్లు.

ఇంకా భారత్ ఫైబర్ నెట్‌వర్క్, బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ టవర్లు, గిడ్డంగులు, నౌకాశ్రయాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, సివిల్ ఏవియేషన్, క్రీడా స్టేడియంలు, ఖనిజ సంపద ఉన్నాయి.

## భూమికి సంబంధించిన వివరాలు :

మౌలికసదుపాయాల నగదీకరణకు సంబంధించి మాంటెక్ సింగ్ అహ్లూవాలియా, ఒకప్పటి ప్రణాళికా సంఘంలో డిప్యూటీ ఛైర్మన్, ప్రభుత్వ ఫైనాన్స్, విధాన జాతీయ సంస్థలో ఆర్థికవేత్త అజయ్ షా మధ్య జరిగిన చర్చ బాగా ప్రచారమైంది. అద్దెకివ్వటం కంటే అమ్మటం వల్లనే ఆస్తులను సమర్థవంతంగా ఉపయోగించ డానికి వీలుంటుందని అమిత్ షా వాదిస్తే, ఎంతో విలువైన భూములు ఈ మౌలిక సదుపాయంలో ఇమిడి ఉన్నాయి. కాబట్టి అద్దెకి ఇవ్వడమే సరైనది అంటాడు మాంటెక్ సింగ్ అహ్లువాలియా. ఈ చర్చలో ప్రజల ప్రస్తావన ఉండదు. ప్రభుత్వం కేవలం ఒక వాణిజ్య సంస్థ. పైగా గుత్త పెట్టుబడుల ప్రయోజనం కోసం మాత్రమే నిరంతరం కృషి చేస్తున్న సంస్థ అన్న దృక్పథం చర్చలో స్పష్టంగా బయటపడింది. ఈ క్రమంలో అజయ్ షా మాట్లాడుతూ, ముంబాయి లోని భారత ఆహార సంస్థ గిడ్డంగుల వద్ద అనవసరంగా 120 ఎకరాల భూమి ఉన్నది. నిరుపయోగంగా ఉన్నది. దీనిని అమ్మాల్సిందే అంటాడు. ప్రభుత్వ రుణాలను తగ్గించుకోవడానికి ఇదొక మార్గం అని.

ఇక, ప్రభుత్వ భూ సమాచార వ్యవస్థ ప్రకారం కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలో 72 పార్సిళ్లుగా 15,531 చదరపు కి.మీ భూమి ఉన్నది. ఇందులో మూడవ వంతు వృథాగా ఉన్నది. ఈ విధంగా ఎంతో విలువ గల భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టటానికి కావలసిన నేపథ్యం పకడ్బందీగా రూపొందుతున్నది.

## మౌలిక సదుపాయాలను అద్దెకివ్వటం:

నిజానికి ఈ ప్రక్రియ ఎప్పుడు మొదలైంది. దూకుడుగా అమలు చేస్తున్న క్రమంలోనే ప్రస్తుత ప్రకటన వెలువడింది.

2009-10, 2014-15 ఆపరేట్ - మైయిన్‌టెయిన్ - ట్రాన్స్ఫర్ (ఓఎమ్‌టి) పద్ధతిలో ఎన్‌హెచ్ఏఐ 2400 కి.మీల హైవేను లీజుకిచ్చింది. 2016లో టోల్-ఆపరేట్-ట్రాన్స్ఫర్ (టిఓటి) నమూనాను ప్రవేశపెట్టారు. 15-30 సంవత్సరాల వరకు టోల్ వసూలు చేసుకొనే హక్కు నివ్వడం జరుగుతుంది. 2395 కిలోమీటర్లను అద్దెకివ్వటానికి నిర్ణయించిన ఐదు రూట్లలో మూడు రూట్లు పూర్తయినాయి. 1400 కి.మీ రోడ్డును అద్దెకివ్వటం జరిగింది. అదేవిధంగా, జూన్ 2020లో మహారాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్, ముంబై - పూనే ఎక్స్ ప్రెస్ వే, పాత ముంబై - పూనే కారిడార్‌లో టోల్ వసూలు చేసుకునే హక్కును ప్రైవేటు పెట్టుబడిదారులకు అమ్మింది. కమర్షియల్ ట్రాఫిక్ 85% ఉన్న ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లోని 9 హైవే స్ట్రక్చర్స్‌కి చెందిన 682 కి.మీ హైవే టోల్ హక్కులను 2018లో విక్రయించింది.

2006లోనే ఆపరేట్ - మెయిన్‌టెయిన్ - డెవలప్(ఓఎమ్‌డి) పద్ధతిలో ఢిల్లీ, ముంబయి విమానాశ్రయాలకు కాంట్రాక్టుకు ఇవ్వటం జరిగింది. కన్సేషన్ కాలం 30 సంవత్సరాలు.

2019లో 6 బ్రౌన్ ఫీల్డ్ విమానాశ్రయాలు - అహ్మదాబాద్, జైపూర్, లక్నో, గుహవతి, తిరువనంతపురం, మంగళూరు విమానాశ్రయాలను 50 సంవత్సరాలకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా లీజుకిచ్చింది. దీనికోసం అనుసరించిన నమూనా పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యం(పిపిపి) టెలికంలో, ఇప్పటికే వునికిలో ఉన్న ప్రైవేటు పెట్టుబడిదారులకు లీజుకిచ్చే క్రమం కొనసాగుతూనే ఉన్నది.బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ టవర్లను, మొబైల్ సైట్స్‌ను అద్దెకిస్తూనే ఉన్నది. అదేవిధంగా బస్సు టెర్మినల్స్‌ని, రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్లు కూడా.

ఆదాని గ్రూపు ఇప్పటికే విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, విద్యుచ్ఛక్తి, గ్యాస్, ఆయిల్, బొగ్గులో లీజు వ్యవస్థలో బలంగా ప్రవేశించింది.

ఆస్తుల నగదీకరణను తమిళనాడు ప్రభుత్వం సీరియస్‌గా వ్యతిరేకిస్తున్నది. ఈ ఆస్తులు నిజానికి ప్రజల సంపద. సేలం స్టీల్ ప్లాంట్‌ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించటాన్ని వ్యతిరేకిస్తున్నది. ప్రస్తుత ఆస్తుల నగదీకరణ కోసం గుర్తించిన ఆస్తులలో 4 విమానాశ్రయాలు, ఒక హెరిటేజ్ రైలు, ముఖ్యమైన హైవేలు తమిళనాడుకు చెందినవి. ఆ భూమి, ఆస్తులు తమిళనాడు ప్రజలవి!

గత సంవత్సరం ఆదానీ గ్రూపు గెలుచుకున్న 6 విమానాశ్రయాలలో కేరళకు చెందిన త్రివేంద్రం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉన్నది. దీనిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం అపెక్స్ కోర్టుకు వెళ్ళింది. విఫలమైన ఈ కేసు ఇప్పుడు సుప్రీం కోర్టులో ఉన్నది.

## ప్రభుత్వ రుణ భారం తగ్గిందా!

మేక్ ఇన్ ఇండియా అంటూ స్వదేశీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం, రక్షణ ఖనిజాలను గుత్త పెట్టుబడులకు అప్పగించటం, ఫైనాన్స్ రంగంలోని సంస్థలను కూడా ప్రైవేటీకరించటం, మౌలిక సదుపాయాలను లీజుకివ్వటం, దూకుడుగా అమలవుతున్న ప్రస్తుత సందర్భంలో గుత్త పెట్టుబడుల సంపద పెరిగింది. మన దేశ సమస్త సంపద మీద కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెరిగింది. కానీ ప్రభుత్వ రుణ భారం ఏమైంది? దేశ సంపద దేశ ప్రజల సొత్తు. ఎన్నికైన ప్రభుత్వం బాధ్యత ఈ సంపదను ప్రజాశ్రేయస్సు కోసం ఉపయోగించడం, కాపాడటం, సురక్షితంగా సమాజానికి అప్పచెప్పటం. కానీ దేశ సంపద ప్రభుత్వ వ్యక్తిగత ఆస్తిగా పరిగణించబడుతున్న ఘోరమైన పరిస్థితులు బలంగా ప్రచారం అయినాయి. సంప్రదాయిక పద్ధతులతో, నవకల్పనలతో కొత్తకొత్త సాధనాల ద్వారా దేశసంపదను హడావుడిగా గుత్త పెట్టుబడులకు స్వాధీనం చేసే క్రమం ముమ్మరమైంది.

కార్పొరేట్ పన్ను కనిష్టంగా ఉండటమే కాకుండా, రకరకాల రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్ల ప్రత్యక్ష పన్ను రాబడిలో ప్రభుత్వ రాబడి పెరిగే ప్రశ్నేలేదు. అందుకే పన్ను రాబడి - జీడీపీ నిష్పత్తి కనిష్టంగా ఉన్నది. రోజురోజుకీ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులలో బతుకుతున్న పీడిత ప్రజల మీద పరోక్ష పన్నుల భారం అత్యధికంగా పరాకాష్ఠ దశకు చేరుకున్నది. అందువల్ల ఇక మిగిలింది అప్పులు చేయటమే. అందుకే ప్రభుత్వ రుణ భారం పెరుగుతూనే ఉన్నది. 2020-21లో స్థూల దేశీయోత్పత్తిలో ప్రభుత్వ ఋణ వాటా 60.5 శాతం ఉండగా 2021-22లో అది 61.7 శాతానికి పెరిగింది. అందులో విదేశీ రుణాలు 11.5 బిలియన్ల డాలర్లు. ఈ రుణాల వాటా ప్రమాదకరమైన స్థాయిని దాటింది.

## మౌలిక సదుపాయాల రంగంలో ఇతర దేశాల అనుభవాలు, చర్యలు :

ఆస్తుల నగదీకరణ నిజానికి 2013లో ఆస్ట్రేలియా ఆస్తుల రీసైక్లింగ్ పేరిట అమలు పరిచిన విధానంగా చెబుతూ అనుసరిస్తున్నారు. ఆస్ట్రేలియాలోని 8 రాష్ట్రాలలో 3 రాష్ట్రాలు

మాత్రమే అనుసరించాయి. ఆశ్చర్యకరంగా, మౌలిక సదుపాయాలను లీజుకు తీసుకున్నది అబుదాబి, కువైట్. ఈ పథకం వల్ల ఆస్ట్రేలియా చేదు అనుభవాలనే చవి చూసింది. అందుకే ఆస్ట్రేలియన్ కాంపిటీషన్ అండ్ కన్స్యూమర్ కమిషన్ చైర్మన్ రాడ్ సియన్ మన దేశాన్ని ఈ విషయంలో హెచ్చరించడం గమనించాలి.

యు.కె లో రైల్వేల ప్రైవేటీకరణ వల్ల తలెత్తిన సమస్యలు, గందరగోళం వల్ల తిరిగి జాతీయీకరించే క్రమం ప్రారంభమైంది. అమెరికాలో డెమొక్రాట్స్, మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే నిర్మించాలన్న ప్రయత్నాలు ప్రారంభమైనాయి.

ఏ దేశానికైనా మౌలిక వసతుల రంగం కీలకమైంది. ఏ దేశం మీదైనా దాడి చేయాలంటే మౌలిక వసతులను నాశనం చేస్తే సరిపోతుంది. అమెరికా ఆఫ్ఘనిస్థాన్‌లో అధికారాన్ని ఆక్రమించుకున్న తాలిబన్లను బెదిరించడానికి, ఆ దేశ ప్రజలు దాచుకున్న అమెరికన్ బ్యాంకులలోని అకౌంట్లు సీజ్ చేసింది. ఎంతో ప్రాధాన్యత గల ఈ రంగాన్ని మన ప్రభుత్వం స్వయంగా గుత్త పెట్టుబడులకు స్వాధీనం చేయాలన్న తపనతో సీరియస్ గా కృషి చేయటం ఖండించవలసిందే.

## భారతదేశ గత అనుభవాలు :

మనదేశంలో కూడా ఇది మరొకరూపంలో కొనసాగుతున్న విధానమే. ఇది గుత్తపెట్టుబడులకు సహకరించే వర్గాలను, దళారీలుగా పనిచేసే ఆధునిక భూస్వామ్య వర్గాన్ని లేక నయా జమీందారీ వర్గాలను బలోపేతం చేయడానికి కూడా తోడ్పడుతుంది. గతంలో దేవాదాయ భూములు, కో ఆపరేటివ్ బ్యాంకుల ఆస్తులు, హౌసింగ్ బోర్డు ఆస్తులు, మున్సిపాలిటీ ఆస్తులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఒకసారి ఈ దోపిడీ వర్గాల చేతిలోకి వెళ్లిన ప్రజల ఏ మౌలిక ఆస్తి అయినా తిరిగి ప్రజల వుపయోగం కోసం మళ్లీ వెనక్కు వచ్చిందా అంటే లేదనేదే సమాధానం. అంతెందుకు?, గడచిన 20 సంవత్సరాలుగా అమలౌతున్న ఏ ప్రాజెక్ట్ అయినా తిరిగి ప్రభుత్వం వెనక్కు తీసుకోగలిగిందా? లేదు.

## ముగింపు :

గౌరవంగా, భద్రతతో ప్రజలు జీవించటానికి విద్య, వైద్యంతో పాటు రవాణా, విద్యుచ్ఛక్తి తప్పనిసరిగా ప్రభుత్వ రంగంలోనే ఉండాలి. గత 10 నెలలుగా ఉద్యమిస్తున్న రైతుల డిమాండ్‌లో విద్యుచ్ఛక్తి (సవరణ) బిల్లు, 2020 రద్దు చేయటం ఉన్నది. అందుకు విభిన్నంగా విద్యుత్ రంగానికి చెందిన సమస్త మౌలిక సదుపాయాలను గుత్త పెట్టుబడులకు అప్పగించటానికి ప్రారంభించిన 'ఆస్తుల నగదీకరణ' సామ్రాజ్యవాద దోపిడీ సాధనమే. 2012లో దేశమంతా తీవ్రంగా నిరసించిన ఢిల్లీలో జరిగిన జ్యోతిసింగ్ దుర్ఘటనకు ప్రధాన కారణం ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవడమే అని జస్టిస్ వర్మ కమిటీ అభిప్రాయపడింది. గత సంవత్సరం తెలంగాణలోని హాజీపూర్‌లో ముగ్గురు అమ్మాయిలు అత్యాచారం, హత్యకు గురి కావడానికి కారణం ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవటమే. సరైన రవాణా సౌకర్యాలు లేకపోవటం వల్ల సమయానికి ఆస్పత్రికి రాలేక చనిపోతున్న గర్భిణీ స్త్రీలు ఎందరో!

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసే ప్రభుత్వాలు మౌలిక వసతులను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. కానీ ఇందుకు భిన్నంగా లాభాల దృష్టికోణంతో మాత్రమే మన ప్రభుత్వం మౌలిక సదుపాయాల గురించి, వాటి నిర్మాణాల గురించి, అద్దెకివ్వడం, అందుకు ఆకర్షించడానికి రాయితీలు ఇవ్వడం గురించి ఆలోచిస్తున్నది. ఇందువల్ల కనీస మౌలిక వసతుల నుండి మెజారిటీ పీడిత ప్రజలు దూరం చేయబడతారు. ఎందుకంటే గ్రీన్ ఫీల్డ్ అవస్థాపన నిర్మాణాలను, అవి గుత్త పెట్టుబడులకు అధిక రాబడి నిచ్చే బ్రౌన్ ఫీల్డ్ అవస్థాపన సౌకర్యాలుగా రూపొందాలన్న దృష్టికోణంతోనే ప్రభుత్వం మౌలిక సదుపాయాలను నిర్మిస్తుంది. కాబట్టి ఈ క్రమం ఇదే విధంగా కొనసాగితే కనీస మౌలిక వసతులు అందుబాటు నుండి మెజారిటీ ప్రజలు బయటకు నెట్టి వేయబడతారు.

చట్టాలను సవరించటం, కొత్త చట్టాలను చేయటం, కొత్త పద్ధతులను కనిపెట్టి అమలు పరచటం ద్వారా ప్రభుత్వం 'చట్టబద్ధంగా' వ్యవస్థీకృతంగా, ప్రత్యేకించి 2014 నుండి దూకుడుగా దేశ ప్రజల సమస్త సంపదలను గుత్త పెట్టుబడులకు అప్పగించే క్రమాన్ని హడావుడిగా ముమ్మరం చేసింది. సాగు భూమిని గుత్త పెట్టుబడులకు అప్పజెప్పే క్రమాన్ని గత పది నెలల నుండి రైతాంగం నిటారుగా, నిలకడగా, నిక్కచ్చిగా ప్రశ్నిస్తూ పోరాడుతున్న విషయం మనకు తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకునే పోరాటం అటువంటిదే. పీడితవర్గం మొత్తం సంఘటితం కావాలి. జరుగుతున్న పోరాటాలకు మద్దతుగా బలంగా నిలబడాలి. దోపిడీని అంతం చేయడానికి ప్రజలందరూ సమానంగా, గౌరవంగా బ్రతికే వ్యవస్థను నిర్మించుకోవటానికి బలమైన సంఘటిత పోరాటాలు మాత్రమే మార్గం. ✸

---

**(12వ పేజీ నుండి)**

గాంధీవాదం ఒక సమగ్రమైన, చక్కగా ఆలోచించి రూపొందించిన బూర్జువా సంస్కరణ వాదం. దీన్ని మేము వ్యతిరేకిస్తాం. ప్రతి సంస్కరణవాదానికున్నట్లే, దీనిక్కూడా రెండు పార్శ్వాలున్నాయి. ఒకటి, శాంతియుతంగాను, చట్టబద్ధంగాను సంస్కరణలను సంపాదించడం. రెండు, విప్లవాన్ని వ్యతిరేకించడం. రెండవది ఆచరణలో ఎక్కువ ప్రాధాన్యం గలది. గాంధీజీకి సర్వసంగపరిత్యాగి అనే కీర్తి వుంది. దానివల్ల ప్రజల్లో పలుకుబడి సంపాదించారు. తద్వారా భారత బూర్జువావర్గ ప్రతినిధి అయారు.

బూర్జువావర్గం గాంధీవాదం ద్వారా ప్రజానీకాన్ని చాల విస్తృతంగా సమీకరించగలిగింది. ఇతర విధానాల వల్ల సాధ్యం కానంత పలుకుబడిని అది సంపాదించింది. గాంధీవాదం ఖద్దరు కార్యక్రమం ద్వారాను, అనేక రక్షణలతో కూడిన పరిమిత పన్నుల నిరాకరణోద్యమాల ద్వారాను రైతుల ప్రతినిధినని చెప్పుకొంటూంది. అహమ్మదాబాద్ జౌళి కార్మికుల సంఘం వంటి సుతిమెత్తని యూనియన్ల ఆధారంతో కార్మికుల ప్రతినిధినని కూడా చెప్పుకొంటూంది. కార్మికవర్గం మీద గాంధీవాదం యొక్క ప్రభావం తక్కువది కాదు. అహమ్మదాబాద్‌లో అది మిక్కుటంగానే వుంది. దేశమంతటా దాని ప్రభావం కొద్దోగొప్పో వుంది. అది అత్యంత అభివృద్ధి నిరోధకమైనట్టిది. రైతాంగ జనాభాలో ప్రధానంగా ధనిక రైతులే దానికి అండ. గాంధీజీ నడిపిన రైతు ఉద్యమాలు రైత్వారీ ప్రాంతాలకు మాత్రమే పరిమితం. జమీందారీ ప్రాంతాల్లో ఆయన వర్గ సామరస్యాన్ని బోధించారు.

స్థూలంగా, గాంధీవాదంలోని విప్లవ వ్యతిరేకాంశ యీ క్రింది లక్షణాల్లో ద్యోతక మవుతుంది: శత్రువుపట్ల సమరశీలత లోపించడం ("నీ శత్రువును ప్రేమించు"); "సాత్విక నిరోధ" పద్ధతి; "శాసన" ధిక్కారం వగైరా, వ్యక్తులు ముందుగా నోటీసు యిచ్చి అరెస్టుకావడం, జైళ్ళను నింపడం మొదలైన పద్ధతులు సామ్రాజ్య వాదానికే ఉపయోగపడతాయి. ఎందుచేతంటే యివి రంగంలో వున్న క్రియాశీలురను, చైతన్య వంతులను పోరాటం నుంచి అతి సులభంగా దూరం చేస్తాయి.

(ముజఫర్ అహమ్మద్ సంపాదకత్వం క్రింద వెలువడ్డ సంయుక్త ప్రకటనలోని ముఖ్య భాగాలకిది సరళానువాదం : పుటలు 81-90, 93, 98-102, 268-269) ✸

# మీరట్ కుట్రకేసులో కమ్యూనిస్టు నిందితుల సంయుక్త ప్రకటనలో భాగాలు

*1929 మార్చి 20న చార్జిషీటు పెట్టి 1933 జనవరి 16న సెషన్సు కోర్టులో తీర్పు చెప్పబడిన మీరట్ కమ్యూనిస్టు కుట్రకేసు 31 మందిపై పెట్టబడింది. ఇది ప్రపంచ చరిత్రలోనే పెద్ద కుట్రకేసుగా పేర్కొనబడింది. భారత కమ్యూనిస్టు పార్టీ, పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీలకు చెందిన సభ్యులూ, ట్రేడ్ యూనియన్ రంగంలో పనిచేస్తున్న కార్యకర్తలూ, బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులూ ఈ కేసులోని ముద్దాయిలు. 1. బెన్ బ్రాడ్లే 2. ఫిలిప్ స్ప్రాట్ (వీరిద్దరూ గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులు) 3. ముజఫర్ అహమ్మద్ 4. షంషుల్ హుదా 5. అయోధ్య ప్రసాద్ 6. సోహన్‌సింగ్ జోష్ 7. మీర్ అబ్దుల్ మజీద్ 8. పి.సి.జోషి 9. ఎస్.ఎ.డాంగే 10. యస్.వి.ఘాటే 11. కె.ఎన్ జోగ్లేకర్ 12. శాంతారామ్ శ్యామల్‌రామ్ 13. శివరామ్ నింబకర్ 13.మిరాజ్‌కర్ 14. జి.అధికారి 15. షౌకత్ ఉస్మానీ 16. అమీర్ హైదరాలీఖాన్ (అసలు దొరకలేదు. మద్రాసు చేరి రహస్య విప్లవ కార్యక్రమాలు చేపట్టాడు. ఈ 14 మంది భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులు) 1933 జనవరిలో సెషన్స్ కోర్టులో చారిత్రాత్మకమైన ఈ ప్రకటన చేశారు. 17. రాధా రమణ మిత్ర 18. ధరణీకాంత గోస్వామి 19. గోపేంద్ర కృష్ణ చక్రవర్తి 20. గోపాలవాసర్ 21. డుండ్ రాజ్ తెంగీ (ఈ ఐదుగురు పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ సభ్యులు) 22. శివనాథ బెనర్జీ 23. కిషోర్‌లాల్ ఘోష్ 24. ఎం.జి.దేశాయ్ 25. హచిన్‌స్సన్ 26. చౌదరి ధర్మవీర్ సింగ్ (ఈ ఐదుగురు మరి ఆరుగురు ఏ పార్టీకి చెందని జాతీయ విప్లవకారులు). ఈ 31 మంది పైన రాజద్రోహ నేరం తదితర సెక్షన్‌ల క్రింద చార్జ్ షీట్ పెట్టబడింది. దీనిలోని భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపక సభ్యులు 14 మంది కోర్టు బోనులో నుంచి చారిత్రాత్మకమైన రాజకీయ ప్రకటన చేశారు. దాని సంక్షిప్త రూపంలో ముఖ్యాంశాలు జనశక్తి పాఠకుల కోసం ఇక్కడిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర కంభంపాటి సత్యనారాయణగారి రచనలో అనుబంధంగా ఈ ప్రకటన యివ్వబడింది. దీనిని ముజఫర్ అహమ్మద్‌గారి "కమ్యూనిస్ట్ ఛాలెంజ్ ఇంపీరియలిజం ఫ్రం ది డాక్" పుస్తకం నుండి సేకరించిన ముఖ్యభాగాలకు సరళానువాదమని కంభంపాటి గారు చెప్పారు.*

*ఈ ప్రకటనలో భారత వ్యవస్థను వలస, ఫ్యూడల్-అర్థఫ్యూడల్ వ్యవస్థగా పేర్కొన్నారు. సాగే విప్లవం బూర్జువా ప్రజాతంత్ర విప్లవమనీ సూత్రీకరించారు. ఈ విప్లవ లక్ష్యాలు: 1. బ్రిటిష్ పాలనను కూలద్రోసి సంపూర్ణ రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడం; 2. సామ్రాజ్యవాదంతో ముడిపడి వున్న ఫ్యూడల్-అర్థఫ్యూడల్ వ్యవస్థలను రద్దుచేయడం 3. ప్రజానురంజకమైన ప్రజాతంత్ర వ్యవస్థను నిర్మించడం. ఇది బూర్జువా ప్రజాతంత్ర విప్లవమైనప్పటికీ బూర్జువావర్గం దీనికి నాయకత్వం వహించజాలదనీ చెప్పారు. నూతన లేక జనతా ప్రజాతంత్ర విప్లవమని విస్పష్టంగా చెప్పకపోయినప్పటికీ కార్మికవర్గ నాయకత్వాన మాత్రమే ఈ బూర్జువా ప్రజాతంత్ర విప్లవం విజయవంతమవుతుందని చెప్పిన దానినిబట్టి పాతకాలపు (యూరప్‌లోవలె) బూర్జువా ప్రజాతంత్ర విప్లవం కాదనేది స్పష్టం. భారత బూర్జువావర్గం బ్రిటిష్ వ్యతిరేక విప్లవాన్ని నీరుగారుస్తున్న తీరునిబట్టీ, చైనా విప్లవంలో బూర్జువావర్గం వెన్నుపోటు పొడిచిన అనుభవాల నుంచి వారు ఈ నిర్ధారణకు వచ్చారు.*

*భారత బూర్జువావర్గాన్ని కాంప్రడార్(తాబేదారీ, దళారీ) పెట్టుబడిదారీ వర్గంగానూ, బూర్జువావర్గంగానూ వేరు చేశారు. సామ్రాజ్యవాదం, దాని మిత్రులైన సంస్థానాధీశులూ, జమీందారులు, భూస్వాములూ, ఉన్నత ప్రభుభక్తులు ఒకవైపూ కార్మికులు, రైతులూ, పట్టణ పేదలూ, పెటీబూర్జువావర్గం, విప్లవ చైతన్యంగల యువకులు మరోవైపు వుండి సాగే పోరాటంగా వుంటుందని సూత్రీకరించారు. బూర్జువావర్గం వూగిసలాడుతూ క్రమంగా సామ్రాజ్యవాదంతో చేతులు కలిపి విప్లవ ప్రతీఘాతుక పాత్ర నిర్వహిస్తుందనీ చెప్పారు. బ్రిటిష్ వ్యతిరేక విప్లవోద్యమానికి సానుకూలంగా వున్నట్లుంటూనే అది ప్రతీఘాతుక పాత్ర నిర్వహిస్తుందని స్పష్టపరిచారు.*

*కనుక ఈ విప్లవానికి పారిశ్రామిక కార్మికవర్గమే నాయకత్వం వహించాల్సి వుంటుందనీ, బూర్జువావర్గం వహించజాలదనీ విస్పష్టంగా చెప్పారు. గాంధీయిజం బూర్జువా సంస్కరణవాదమనీ, దోపిడీవర్గాలకే అది సేవచేస్తుందనీ వారి ప్రకటనలో కరాఖండిగా వెల్లడించారు.*

*1933లో 14 మంది కమ్యూనిస్టులు చేసిన ఈ ప్రకటన శత్రువులను, మిత్రులను వేరుచేసి విప్లవానికి నాయకత్వమెవరన్నది స్పష్టపరచింది. బూర్జువావర్గ విద్రోహకర పాత్రను చూడగలిగింది. కానీ బూర్జువావర్గం గురించి విస్పష్ట అవగాహన నివ్వలేకపోయింది. బ్రిటిష్ వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించిన బూర్జువా వర్గాన్ని జాతీయ బూర్జువా వర్గమని పరిగణించినట్లుగా వుంది. అయతే అది విప్లవానికి ద్రోహం చేస్తుందని పేర్కొంది. ఈ ప్రకటన తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ మరింత పరిశీలనతో పార్టీ కార్యక్రమాన్ని రూపొందించుకోగలిగి వుండేది. కానీ ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతంలోనే కృషిచేస్తూ అసంఘటితంగా వుండి దీనిపై శ్రద్ధ పెట్టలేదు. దీని ఫలితంగా కాలక్రమంలో బూర్జువావర్గంపై భ్రమలు పెంచుకొంది. బూర్జువావర్గం యొక్క దళారీ స్వభావాన్ని చూడటం మానివేసింది. బూర్జువావర్గ నాయకత్వానికి తోకగా మారి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి ఛాంపియన్ గాలేకపోయింది. వక్కాణింపులు మావి.*

**- సం॥**

**బ్రిటిష్** సామ్రాజ్యవాదం భారతదేశాన్ని దోచుకొంటూ, దాని ఆర్థికాభివృద్ధినీ, సకల విధాలైన అభివృద్ధినీ అడ్డుకొంటూండడంవల్ల నేటి పరిస్థితి బాహ్యాత్మకంగా విప్లవ స్వభావాన్ని కలిగి వుంది. ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు సామ్రాజ్యవాద ఆధిపత్యం నుంచి విముక్తి చెందడానికి పోరాడక తప్పని పరిస్థితి ఏర్పడింది. కార్మిక-కర్షకులు ఖచ్చితంగా విప్లవ మార్గమే ఎంచుకుంటారు. ఇందులో సందేహం లేదు. బూర్జువావర్గం కూడా స్వాతంత్ర్యాన్ని కాంక్షిం చేందుకు అతిబలవత్తరమైన కారణాలు వున్నాయి. సామ్రాజ్యవాదం మన పరిశ్రమల పట్ల అభివృద్ధి

నిరోధక విధానమవలంబిస్తోంది. మన కరెన్సీని స్వప్రయోజనార్థం తన అదుపులో వుంచుకొంది. (ఉదాహరణకు, యీ మధ్యనే, పడిపోతున్న బ్రిటిష్ పౌను విలువతో మన రూక విలువను ముడిపెట్టడం). ప్రజల దోపిడీ ద్వారా లభిస్తున్న లాభాల్లో అత్యధిక భాగాన్ని తాను మింగుతోంది. సామ్రాజ్యవాద దోపిడీవల్ల యిలాంటివే అనేక నష్టాలు, చిన్నవీ పెద్దవీ కలుగుతూండడం చూస్తే, బూర్జువావర్గం సామ్రాజ్యవాదం పట్ల శత్రువైఖరి నవలంబించడం తప్ప మరో మార్గం లేదనిపించక మానదు. ఇక, మధ్య తరగతి విషయం. దీనినే పెటీబూర్జువావర్గం అంటాము. అంటే, బూర్జువా వర్గంలో క్రింది శ్రేణికి చెందిన వర్గం : చేతి వృత్తులవారు, పేదలైన యితర వృత్తులవారు, మేధావులు వగైరా. వీరు స్వాతంత్ర్యం వల్ల బూర్జువావర్గం కంటే అధికంగా లబ్ధి పొందుతారు. ఇక సంస్థానాధీశులున్నారు; జమీందార్లు, భూస్వాములు వున్నారు; సామ్రాజ్యవాద వ్యవస్థతో సన్నిహితంగా ముడిపడియుండి దానివల్ల లాభపడే ఉన్నత బూర్జువావర్గం, ఉన్నత వృత్తులవారు వున్నారు. వీరిని మాత్రమే ఖచ్చితమైన విప్లవ ప్రతీఘాత శక్తులుగా పరిగణించాలి.

భారతదేశంలో విప్లవం త్వరలోనో, కాస్త ఆలస్యంగానో వచ్చి తీరుతుంది. ఆ విప్లవం యీ ప్రధాన లక్షణాల్ని కలిగియుంటుంది: 1.బ్రిటిష్ పాలనను కూలద్రోసి సంపూర్ణ రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడం;

2. సామ్రాజ్యవాదంతో ముడివడియున్న ఫ్యూడల్, అర్థఫ్యూడల్ వ్యవస్థల్ని (స్వదేశ సంస్థానాలు, జమీందారీ విధానం, భూస్వామ్య విధానం) రద్దుచేయడం;

3. ప్రజారంజకమైన ప్రజాతంత్ర వ్యవస్థను నిర్మించడం. క్లుప్తంగా చెప్పాలంటే, భారతదేశంలో విప్లవం బూర్జువా ప్రజాతంత్ర విప్లవమై యుంటుంది.

ఈ విప్లవాన్ని ఏ సామాజికశక్తులు తీసుకొస్తాయి? ఇది బూర్జువా ప్రజాతంత్ర విప్లవమే అయినా, దీన్ని అమలుజరిపేది లేదా నడిపేది బూర్జువావర్గం కానక్కర్లేదు. భారత దేశంలో జాతీయ విప్లవాన్ని బూర్జువావర్గం నడపదు. బాహ్యాత్మకంగా, అది విప్లవపంథా అనుసరించజాలదు. ఇందుకు కారణాలు : 1. భారతీయ పరిశ్రమల్లో బ్రిటిష్ పెట్టుబడులకు, జాతీయ పెట్టుబడులకు మధ్య సన్నిహిత సంబంధం వుంది. బ్రిటిష్ పెట్టుబడులకు ఆధిక్యత వుండేటట్లు యీ సంబంధాన్ని పెంచడం బ్రిటిష్ పాలసీ. అందుచేత, ఘర్షణ అంతకంతకు కష్టమవుతుంది; 2. ఎగుమతి దిగుమతులు అధికంగా బ్రిటిష్ ప్రయోజనాల కనుగుణంగా జరుగుతున్నాయి. దిగుమతి అయ్యేవన్నీ బ్రిటిష్ సరకులే. ఈ ఎగుమతి దిగుమతులమీద మన వర్తక పెట్టుబడిదారులు ఆధారపడియున్నారు. వీరే తాబేదారీ(కాంప్రెడార్) పెట్టుబడిదారులు. ఈ వర్గం, చైనాలోలాగ, సామ్రాజ్యవాదంపట్ల విధేయతతో మెలగుతూ వుంటుంది; 3. సామ్రాజ్య వాదాన్ని విధేయతతో సేవించే ఫ్యూడల్ భూస్వామ్య వర్గ ప్రయోజనాలతో బూర్జువా వర్గానికి దగ్గర సంబంధాలున్నాయి. పారిశ్రామిక పెట్టుబడుల ప్రాథమిక సమీకరణలో అధికభాగం భూ ఆదాయం మీద వచ్చిందే. సంస్థానాధీశులకు పరిశ్రమలు సంస్థానాల్లోనూ వున్నాయి. బ్రిటీష్ ఇండియాలోనూ వున్నాయి. భూస్వాముల్లో అనేకమంది పరిశ్రమల్లో కాక వడ్డీవ్యాపారంలోను, భూములమీద, వర్తకం మీద పెట్టుబడి పెడుతున్నారు. వీరి ప్రయోజనాలు రాజకీయంగా అభివృద్ధి నిరోధకమైనవి; 4. భారత దేశంలో బూర్జువావర్గం బలహీనమైనట్టిది. భిన్న రాజకీయ పార్టీల మధ్య అది చీలి వుంది (కాంగ్రెసు, లిబరల్ ఫెడరేషను, మతోన్మాద సంస్థలు).

బూర్జువావర్గానికి తన బలహీనత తనకు తెలుసు. పారిశ్రామిక, వ్యవసాయరంగాల్లో వర్గ సంఘర్షణ పెరుగుతూందని కూడా దానికి తెలుసు. అందుచేత, ప్రజల్ని రంగంలోకి దింపి విప్లవ మార్గమవలంబిస్తే, ఉద్యమాన్ని తన కంట్రోలులో వుంచుకోలేకపోవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే, భారతదేశంలో బూర్జువావర్గం బలహీనమైనట్టిది. దాని ప్రయోజనాలు బ్రిటిష్ సామ్రాజ్యవాదంతోను, ఫ్యూడలిజంతోను పెనవేసుకుపోయాయి. రెండోవైపు, తన ప్రయోజనాలకూ, ప్రజల ప్రయోజనాలకూ(ఈ ప్రజలే విప్లవంలో మిత్రులుగా వుండవలసినవారు) మధ్య ప్రత్యక్ష వైరుధ్యం వుంది. ఎంత ప్రత్యక్ష మైనదంటే, బ్రిటిష్ పాలనను విప్లవ మార్గంలో అది కూలద్రోయజాలదు.

భారత జాతీయ కాంగ్రెసు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా రెండుసార్లు ప్రజా ఉద్యమాల్ని నిర్మించక తప్పని పరిస్థితి ఏర్పడింది. (1919-22 సహాయ నిరాకరణోద్యమం, 1930-31 శాసనోల్లంఘనోద్యమం). ఆ రెండు సార్లూ, వాటికి నిధులిచ్చిన, వాటిని కంట్రోలు చేసిన బూర్జువాగ్రూపులూ, బూర్జువా-పెటీబూర్జువా రాజకీయవేత్తలూ తమ అనుచరులు విప్లవమార్గం చేబట్టకుండా చేసేందుకు చాల జాగ్రత్తలు తీసుకున్నారు. సహాయ నిరాకరణోద్యమాన్నిగానీ, శాసనోల్లంఘనోద్యమాన్నిగాని విప్లవోద్యమాలుగా పరిగణించడం మౌలికంగా పొరబాటు. ఆ రెండు ఉద్యమాలూ బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని డిమాండు చేయలేదు. మద్రాసు కాంగ్రెసు తరవాత కొందరు వామపక్ష నాయకులు స్థాపించిన సంపూర్ణ స్వాతంత్ర్య సమితి పటాటోపంతో కూడిన ఒక యుక్తి మాత్రమే. సామాన్య కాంగ్రెసు నాయకుని దృష్టిలో సంపూర్ణ స్వాతంత్ర్యం అంటే, సాధారణ కాంగ్రెసువాదుల్ని సంతృప్తిపరచేందుకూ, రెండోవైపు ప్రభుత్వాన్ని బెదిరించేందుకూ పనికివచ్చే ఒక శబ్దం. అంతేకాదు. ఈ రెండు ఉద్యమాలూ అధికారాన్ని హస్తగతం చేసుకొనేందుకవసరమైన కార్యక్రమాల్ని ప్రజల ముందుంచలేదు. వాటి నాయకులు హింస ద్వారా సాధ్యమయే దానిని అహింస ద్వారా రాకుండా చేశారు. ప్రజలు తమంత తాము విప్లవోద్యమంలోకి వస్తూంటే, వారిని అడ్డుకోడానికి సందేహించలేదు. ఉదాహరణకు చౌరీచౌరాలో ప్రజలు పోలీసులపై ప్రతీకార చర్య జరపడాన్ని సాకుగా తీసుకొని మొత్తం సహాయ నిరాకరణోద్యమాన్నే ఉపసంహరించడం. 1930-31 శాసనోల్లంఘనోద్యమం రెండు ఉద్దేశాలతో ప్రారంభింపబడింది. ఒకటి, ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం. రెండు, ప్రజల్లో పెరుగుతున్న దౌర్జన్యాన్ని (అనగా విప్లవ చైతన్యాన్ని) అరికట్టడం. వీటిలో రెండవదే, అంటే విప్లవాన్ని అరికట్టడం, ఎక్కువ జయప్రదమైంది.

కాబట్టి, భారత బూర్జువావర్గం విప్లవమార్గం అవలంబించజాలదు. కొంతకాలం అది సామ్రాజ్య వాదాన్ని సౌమ్యంగానో, గట్టిగానో ఎదుర్కోవచ్చు. అంతేగాని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విప్లవమార్గం మాత్రం చేబట్టదు. దాని రాజకీయ కార్యకలాపాలు ఎలాంటివంటే, ప్రభుత్వాన్ని ఏ మోతాదులో వ్యతిరేకిస్తుందో, ఆ మోతాదులో ప్రజల విప్లవోద్యమ బీజాల్ని అరికడుతుంది. ఎప్పుడైతే ప్రజావిప్లవం దాని ఉనికికి ప్రమాదం కలిగిస్తుందో, అప్పుడది ప్రత్యక్షంగాను, చురుగ్గాను విప్లవ ప్రతీఘాతశక్తిగా తయారై ప్రజలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదంతో చేతులు కలుపు తుంది. బూర్జువావర్గం కొంతకాలం విప్లవ ప్రతీఘాతశక్తులకూ (సామ్రాజ్యవాదం, దాని మిత్రులైన సంస్థానాధీశులు, జమిందార్లు, భూస్వాములు, ఉన్నత వర్గ ప్రభుభక్తులు). విప్లవ శక్తులకూ (కార్మికులు, రైతులు, పట్టణ పేదలు, పెటీబూర్జువావర్గం, విప్లవ చైతన్యంగల యువకులు) మధ్య ఊగిసలాడవచ్చు. ప్రారంభదశలో కొంతమేరకు విప్లవోద్యమ పురోగతికి సహాయం కూడా చేయవచ్చు. కాని, తరవాత దానిని అంతకంతకు అడ్డుకొంటుంది. వక్రమార్గం పట్టిస్తుంది. చివరకు, విప్లవోద్యమం బలం

పుంజుకొనేకొద్దీ, విప్లవ ప్రతీఘాతశక్తులతో చేతులు కలుపుతుంది. అందుచేత, భారత బూర్జువావర్గం ఉత్తరోత్తరా విప్లవ ప్రతీఘాత పాత్ర నిర్వహిస్తుందనడంలో ఎట్టి సందేహం లేదు. ఇదే సరియైన అంచనా అని చైనా విప్లవ ఘటనలు రుజువుచేస్తున్నాయి. అక్కడ జాతీయ బూర్జువా వర్గం 1927లో విప్లవానికి తిలోదకాలిచ్చి, కార్మిక-కర్షకుల విప్లవోద్యమాన్ని అణచేటందుకు సామ్రాజ్యవాదంతో చేతులు కలిపింది. అత్యంత ఘాతుకమైన హింసాకాండను అమలుజరిపింది. చరిత్రలో యిది పరమ కిరాతక చర్యల్లో ఒకటి(8 నెలల్లో 20,000 మంది ఊచకోతకోయబడ్డారు).

దీన్నిబట్టి, సామ్రాజ్యవాదానికీ, బూర్జువా వర్గానికీ మధ్య వైరుధ్యం ఎల్లకాలం వుంటుందా లేక రాజీ సంభవమవుతుందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న సాధారణ పంథా ఒకటే: పారిశ్రామికాభివృద్ధిని అరికట్టడం, ద్రవ్యనిధులపైన, బ్యాంకింగ్‌పైన పూర్తి కంట్రోలు, వగైరా. ఈ విధానం బూర్జువావర్గ అభివృద్ధికి దోహదమిచ్చే రాజీ అసాధ్యపడేటట్లు చేస్తుంది. ప్రపంచ పరిస్థితి యిందుకనుగూలంగా లేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఆర్థికంగా బలహీన పడుతోంది. అందుచేత అది బూర్జువా వర్గానికి గణనీయంగా సౌకర్యాలిచ్చే స్థితిలో లేదు. పైగా, భారతదేశాన్ని ఇంకా ఎక్కువగా దోచుకొనేందుకు, తన రాజ్యాధిపత్యాన్ని మరింతగా ఉపయోగించు కొనేందుకు ప్రయత్నిస్తుంది. ఇందుకు అన్ని మార్గాలూ ఉపయోగిస్తుంది. 1920-22 సహాయ నిరాకరణోద్యమాన్నీ, 1930-31 శాసనోల్లంఘనోద్యమాన్నీ అణచేందుకు అది పాశవిక నిర్బంధ విధానమవలంబించింది. ఫలితం, బూర్జువావర్గ దాసోహం. సైమన్ కమిషన్ నివేదికగాని, మొదటి రౌండ్‌టేబుల్ సమావేశం గాని, రెండవ రౌండ్‌టేబుల్ సమావేశంగాని రాజీకి అనుకూలమైన సూచనలేవీ చేయలేదు.

సామ్రాజ్యవాదం బూర్జువా వర్గానికి సదుపాయాలేవైనా కలిగిస్తే, అవి సామ్రాజ్యవాదానికే ముప్పు తెస్తాయి. అందుచేత, బూర్జువావర్గ ఆశయాలను సంతృప్తిపరచే సుస్థిర రాజీకి అవకాశమేమీ లేదు. ముందుముందు అట్టి సుస్థిర రాజీజరగడమే తటస్థపడితే, విప్లవ ప్రజా ఉద్యమం బూర్జువావర్గాన్ని విప్లవ ప్రతీఘాత సామ్రాజ్యవాద శిబిరంలోకి నెట్టివేసినప్పుడు మాత్రమే సంభవం. గాంధీ-ఇర్విన్‌ల మధ్య జరిగిన ఒడంబడిక కొద్దిరోజులే అమల్లో వుంది. తరువాత సామ్రాజ్యవాదం దాన్ని తుత్తునియలు చేసింది. అందుచేత, ఉభయ పక్షాల మధ్య సుస్థిర రాజీకి భౌతిక ఆధారమేమీ లేదు. ముందుముందు ఏదైనా రాజీ జరిగితే, అది పైపై రాజీగానే వుంటుంది.

పెటీబూర్జువా వర్గం కూడా విప్లవానికి నాయకత్వం వహించలేదు. ఈ వర్గంలో ముఖ్యంగా పట్టణ పెటీబూర్జువావర్గంలో, విప్లవ విజయాన్ని కోరే సెక్షన్లు ఉన్నమాట నిజమే. దానివల్ల వారు లబ్ధిపొందేమాట కూడ నిజమే. కాని, పెటీబూర్జువా వర్గం ఒక వర్గంగా విప్లవానికి నాయకత్వం వహించజాలదు. నిజానికి అదొక వర్గమే కాదు. అందులో సమాన ఆర్థిక లక్షణాలు గల సెక్షన్లు ఉన్నప్పటికీ, వాటి కార్యకలాపాలు భిన్నమైనట్టివి. ఏ సామాజిక బంధమూ వాటిని కలిపివుంచడం లేదు. ఈ వర్గానికి రాజకీయ చైతన్యం వుంది. ఐతే, అది నికరమైనది కాదు; నిలకడగలది కాదు. ఈ వర్గానికి చెందిన వ్యక్తులు కొందరు విప్లవోద్యమానికి ఉపయోగకరమైన సహాయం చేయవచ్చు. అయితే, ఆ వర్గానికి చెందినవారుగా మాత్రం కాదు.

**ఇక కార్మికవర్గం వుంది. విప్లవానికి నాయకత్వం వహించవలసింది పారిశ్రామిక కార్మికవర్గమే.**

**ఆధునికయుగంలో సామాజికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తి బృహత్ పరిశ్రమలు. ఈనాడు సమాజాన్ని నడుపుతున్నది పారిశ్రామికనగరం. దాన్ని వెంబడించేది పల్లెసీమ. రైతు వెనుకబడ్డ ఉత్పత్తి విధానానికి ప్రతినిధి. అది ఎప్పటికైనా అంతరించకమానదు. అట్టి వర్గం సమాజ పురోగతికి దారితీసే ఏ ఉద్యమాన్నీ, నడపలేదు.**

ఉత్పత్తి విధానాన్ని బట్టీ, జీవిత విధానాన్ని బట్టీ చూస్తే, రైతాంగం సాంస్కృతికంగా (కల్చరల్లీ) కార్మికవర్గం కంటే వెనుకబడియుంది. కార్మిక వర్గం ప్రత్యక్షంగా పెట్టుబడిదారీ విధానానికెదురుగా నిలిచియున్నందున, ఆధునిక సమాజంయొక్క స్వభావాన్ని రైతాంగం కన్న సమగ్రంగా అది అవగాహన చేసుకొంటుంది. రైతాంగం కన్న సమగ్రమైన వర్గచైతన్యాన్ని పొందుతుంది. సాధారణ భావాలను, విధానాలను అలవరుచుకొని వాటికోసం పోరాడగల్గుతుంది. రైతాంగం అలాకాక, సంకుచిత ప్రయోజనాలను మాత్రమే కలిగియుంటుంది. సాధారణ రాజకీయ విధానాలు అప్పటికప్పుడు రైతాంగ అవగాహన కందవు. రైతులు అప్పటికప్పుడు తమ పీడకునికి వ్యతిరేకంగా, తమ భూస్వామికి వ్యతిరేకంగా, తమ వడ్డీవ్యాపారస్తునికి వ్యతిరేకంగా చేతులు కలిపి పోరాడగలరు. కాని, విస్తృత ప్రాంతంలో ఒక వర్గంగా అది భూస్వామ్య వర్గాన్నెదుర్కోడానికి అంతకంటే ఎన్నో చిక్కుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. కార్మికవర్గం అలాకాక, జాతీయస్థాయిలోను, అంతర్జాతీయ స్థాయిలోను వర్గచైతన్యాన్ని సులభంగా అలవరుచుకొంటుంది (1857 భారత స్వాతంత్ర్య సమరాన్ని ఇంగ్లండులో ఛార్టిస్టులు నిర్ద్వంద్వంగా బలపరచారు- కం.సం). సాంస్కృతికంగా కార్మికవర్గం రైతాంగం కన్న అభివృద్ధిచెందింది గనుక విప్లవానికి నాయకత్వ పాత్ర వహించగలదు.

రైతాంగంతో పోలిస్తే. కార్మికవర్గంలో ఐకమత్యం హెచ్చు. పేద, మధ్య, ధనిక రైతుల ప్రయోజనాలు భిన్నమైనట్టివి. వాటి మధ్య ఘర్షణ తప్పనిసరిగా వుంటుంది. కార్మికవర్గంలో కూడా భిన్నతరగతులున్నప్పటికీ వాటి మధ్య ఘర్షణ స్వల్పమైనదిగానే వుంటుంది. కార్మికులు కలిసి నివసించడం వల్లా, కలిసి పనిచేయడం వల్లా, కలిసి కష్టసుఖాలను అనుభవించడంవల్లా వారిలో సంఘీభావం, క్రమశిక్షణ వాటంతట అవి అలవడతాయి. రైతుల్లోగాని, యితర వర్గాల్లోగాని యిది అసంభం. దోపిడీకి గురిఅవుతూ కార్మికులు గడించే అనుభవం ఆర్థిక రాజకీయ వ్యవస్థను మరింత సమగ్రంగా అవగాహన చేసుకొనేటట్లు చేస్తుంది. అందుచేత, యితర వర్గాలకంటే సమగ్రమైన విప్లవ దృక్పథం అలవరచుకొంటుంది. వీటన్నింటిని బట్టి చూస్తే, కార్మికవర్గ చైతన్యం రైతుల చైతన్యంకంటే ఉన్నతమైనదని గ్రహించగలం.

చివరగా, కార్మికులు పట్టణాల్లోను, నగరాల్లోను పనిచేస్తూ, ఉత్పత్తికేంద్రాల్నీ, రవాణా కేంద్రాల్నీ, కమ్యూనికేషన్ కేంద్రాల్నీ కంట్రోలు చేయగల స్థితిలో వుంటారు. సమాజంయొక్క ఆయువుపట్లు వీరి చేతుల్లో వుండడంవల్ల, యీ వర్గం తీసే దెబ్బ దాని సంఖ్యాబలం కన్న చాలా శక్తివంతమైనది.

భారతదేశంలో కార్మికవర్గం వెనుకబడి యున్నప్పటికీ, రైతాంగంతో పోలిస్తే అది చాలా అభివృద్ధిచెందిన వర్గం. దాని రాజకీయ అనుభవం, చైతన్యం కూడ ఉన్నతమైనట్టివి. అందుచేత భారతదేశ విప్లవంలో కార్మికవర్గమే నాయకత్వం వహిస్తుందనీ, రైతాంగం భూస్వాముల భూమిని స్వాధీనమొనర్చుకోవడం ద్వారాను, భూస్వామ్య-పెట్టుబడిదారీ వ్యవస్థను నాశనం చేయడం ద్వారాను గ్రామసీమల్లో విప్లవానికి పునాదులు నిర్మిస్తుందనీ మేము అభిప్రాయ పడుతున్నాం.

**(తరువాయి 9వ పేజీలో)**

# భారత వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ మహాసభ

**(1928 సం॥లో ఏర్పడిన ఆల్ ఇండియా వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ (ఏఐడబ్ల్యుపిపి) మహాసభ సమీక్షా నివేదిక ఇది. అధ్యయనం కోసం ప్రచురిస్తున్నాము)**

**భారత** జాతీయ ఉద్యమంలోని విప్లవశక్తులు నిర్మాణాయుతమౌతున్నాయి.అవి ఇప్పటికి ఒక ఐక్య నాయకత్వాన్ని కనుగొనలేదు. అటువంటి దానికోసం అవి, తెలిసో, తెలియకో సరైన దిశలో అనగా కార్మికవర్గం వైపు చూస్తున్నాయి.జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాలతోపాటు నిర్వహించిన పలు అనుబంధ సమావేశాలలో చేసిన ప్రసంగాలు, తీర్మానాలు చూస్తే, జాతీయ స్వాతంత్ర పోరాటంలో కార్మికవర్గం తన ఆధిపత్యం నెరపడానికి అనువుగా పరిస్థితులు ఎంతవరకు పరిపక్వమయ్యాయో కనబడుతుంది.

కొద్ది సంవత్సరాల క్రితం సోషలిజం అంటే భారత దేశంలో ఎవరికీ తెలియదు. రాడికల్ పెటీ బూర్జువాల దృక్పథంలో కూడా సోషలిజం పట్ల అనుమానం, విరుద్ధ భావన వ్యక్తమయేది. జాతీయవాద పెటీ బూర్జువాల సామాజిక దృక్పథమైతే నిశ్చయంగా ప్రతీఘాతకంగా ఉండేది. భవిష్యత్తు పట్ల ఆశ, వర్తమానంలోని కఠోర వాస్తవాలు, కాలంచెల్లిన గతం పట్ల భ్రమల నుండి, పెటీ బూర్జువాలకు విముక్తి కల్పిస్తున్నాయి. ఫ్యూడల్ సంప్రదాయాల నుండి విడగొట్టుకున్న వాళ్లకు పెట్టుబడిదారి వ్యవస్థలో కొద్దిపాటి ఓదార్పు మాత్రమే లభిస్తోంది తప్ప,వలసవాద దోపిడీ సాగుతోన్న పరిస్థితుల్లో, వాళ్ళ వర్గానికి గణనీయమైన ఆర్థిక పురోగతి లభించడం లేదు. భవిష్యత్తులోకి మరింతగా దృష్టి పెట్టడానికి వాళ్ళు ధైర్యాన్ని కూడగట్టుకోవలసి వుంది. రాజకీయ అణచివేత, ఆర్థిక వినాశం, సాంస్కృతిక స్థబ్దతల నుండి బయటపడడానికి సోషలిజం మాత్రమే ఏకైక మార్గంగా, ఒక దివిటీలాగా వాళ్ళ దృష్టిని ఆకర్షిస్తోంది. దాని ఫలితంగా ఈ రోజు భారతదేశంలోని రాజకీయ పరిస్థితి యొక్క విశిష్ట లక్షణంగా, సోషలిజం యొక్క ఖ్యాతి తీవ్రవేగంతో విస్తరిస్తోంది. జాతీయ కాంగ్రెస్ అనుబంధమైన పెటీ బూర్జువా సంస్థలన్నీ కూడా సోషలిజాన్ని ప్రవచిస్తున్నాయి.

సామ్రాజ్యవాదంతో రాజీపడే విధానానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తోన్న పెటీ బూర్జువా రాడికల్స్, అదే సమయంలో సోషలిజాన్ని ప్రవచించడాన్ని మనం గుర్తించాల్సి వుంది. దీనితో స్వతంత్ర రాజకీయ పాత్ర పోషించడంలో పెటీ బూర్జువా వర్గానికున్న అశక్తత మరోసారి బయటపడుతోంది. బడా బూర్జువా నాయకత్వంతో తెగతెంపులు చేసుకోవడానికి ఎప్పుడైతే ప్రయత్నిస్తారో వాళ్ళంతట వాళ్ళే శ్రామికవర్గ ప్రభావంలోకి వస్తారు. పెటీ బూర్జువా వర్గం సోషలిస్టు వర్గం కాకపోవడం వలన అలా చేస్తారు. వాళ్ళంతట వాళ్ళు ఆలా చేసినప్పటికీ వాళ్ళు విప్లవ దిశలో పురోగమించలేరు. జాతీయ విప్లవ కార్యక్రమానికి ద్రోహం చేసినందుకు బడా బూర్జువాపై తిరుగుబాటు చేస్తున్న వారితో, శ్రామిక వర్గమే సగం దూరం ముందుకు వచ్చి, జాతీయ విప్లవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వాళ్ళతో కలిసి పోరాట సంఘటన ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. శ్రామికవర్గ విప్లవ నాయకత్వం కింద వాళ్ళను తీసుకురావడానికున్న అవకాశాన్నివాళ్ళు సోషలిజాన్ని ప్రవచించడం ద్వారా ఇస్తోన్న ఒక సంకేతంగా తీసుకోవాలి. శ్రామికవర్గ నాయకత్వాన జాతీయ ప్రజాస్వామిక విముక్తి కోసం సాగే విప్లవ పోరాటంలో వాళ్లలో కొందరు పూర్తిగా తమ వర్గ లక్షణాలను వదిలించుకుని సోషలిజాన్ని చైతన్యవంతంగా స్వీకరించగల అవకాశముంది. మరోవైపు శ్రామికవర్గం దిశగా వాళ్ళు వేస్తున్న అడుగుల పట్ల సకాలంలోను, చాకచక్యంగానూ స్పందించ నట్లైతే వాళ్ళు మళ్లీ బడా బూర్జువా నియంత్రణలోకి వెళ్లిపోవడం లేదా సోషల్ డెమొక్రాటిక్ పార్టీగా అభివృద్ధి చెందడంలాంటి ప్రమాదముంది.

పెటీ బూర్జువా రాడికలిజం సంస్కరణవాద సోషల్ డెమొక్రాటిక్ పార్టీగా రూపాంతరం చెందడంలో వున్న ప్రమాదాన్ని, ఆ ఉద్యమంలోని కొందరు నాయకులు రాజ్యం విధులు, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి సాధనాలు, వర్గ సంబంధాలు, భూమి స్వాధీనం మొదలగు కీలక అంశాల పట్ల వ్యక్తం చేసిన అభిప్రాయాలతో బయటపడుతోంది.

భవిష్యత్తు పరిణామాలు, మన కర్తవ్యాల పట్ల ఈ వర్తమాన చిత్రం చాలా స్పష్టమైన అవగాహన కలిగిస్తోంది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంపై నాయకత్వం కోసం పోటా పోటీ పెనుగులాట ఇది. అది ఏ దిశలో అభివృద్ధి చెందాలి - బూర్జువా నాయకత్వంలో రాజ్యాంగబద్ధ ఉద్యమం దిశగా అది అభివృద్ధి చెందుతుందా లేక శ్రామికవర్గ ఆధిపత్యంలో విప్లవ ప్రతిఘటనగా మారుతుందా!? జాతీయోద్యమంలో చైతన్య పూర్వకంగా, చురుగ్గా వుండే శ్రేణుల్లో అత్యధికంగా నిండి వున్న పెటీ బూర్జువాలు, మధ్యలో నిలబడి వున్నారు. వాళ్ళు విప్లవం దిశగా కదలడానికి ఇష్టపడుతున్నారు, కానీ వాళ్లకు స్థిర చిత్తం, స్పష్టమైన దృష్టికోణం వున్న ఐక్య నాయకత్వం కొరవడుతోంది. అది శ్రామికవర్గం నుండి మాత్రమే వస్తుంది కాబట్టి మన ముందున్న కర్తవ్యం స్పష్టంగా వుంది.

జాతీయ కాంగ్రెస్ సమావేశాలు జరుగు తున్నప్పుడే ఈ కింది అనుబంధ సంఘాలు విడిగా సమావేశాలు జరుపుకున్నాయి :

1.ఆల్ ఇండియా యూత్స్ లీగ్ 2. స్వాధీన్ భారత్ సంఘ్ (విప్లవ కార్యక్రమాలు చేపట్టడం వల్ల అణచివేతకు గురైనవాళ్ళ సంఘం) 3. సోషలిస్ట్ యూత్ లీగ్ 4. ఆల్ ఇండియా వాలంటీర్స్ కార్ప్స్. ఈ సంస్థలలోని సభ్యులు కాంగ్రెస్ శ్రేణుల్లోని మెజారిటీకి మరియు అత్యంత చురుకైన శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వాళ్లంతాకూడా సామాజికంగా పెటీ బూర్జువా మేధావులు. ఆలా అంటున్నామంటేనే వాళ్లంతా ఆర్థికంగా దుస్థితిలో వున్నవారని సూత్రప్రాయంగా అర్థం! కాంగ్రెస్‌లోని వామపక్ష విభాగ నాయకులు ఈ మధ్య ప్రారంభించిన ఇండిపెండెంట్ లీగ్, ప్రస్తుతం ఈ విప్లవ ప్రజానీకానికి రాజకీయ నాయకత్వం నెరపుతోంది. కాంగ్రెస్ సభల సమయంలోనే లీగ్ కూడా తన సమావేశం నిర్వహించింది. కానీ కాంగ్రెస్‌లో అంతర్గత విభాగం అవడం వలన అది తన స్వంత అస్థిత్వాన్ని ప్రదర్శించలేకపోతోంది. దాని పర్యవసానంగా అన్ని సమావేశాలు, సభలలో (ఆల్ పార్టీస్ కన్వెన్షన్‌లో తప్ప) రాడికల్, విప్లవ శక్తులు మెజార్టీలో ఉన్నప్పటికీ వాటికి ఒక ఐక్య నాయకత్వం లేకుండా పోయింది. కాంగ్రెస్ మరియు విప్లవకర స్వభావం స్పష్టంగా కలిగివున్న దాని అనుబంధ సంఘాల మీద వాటి బయట నిలబడి ఉన్నటువంటి బూర్జువాలు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. అనుబంధ సంఘాల సభలలో చేసిన ప్రసంగాలు, ఆమోదించిన తీర్మానాలలోని కొటేషన్స్ చూస్తే, ప్రస్తుత విప్లవకర వాస్తవ

పరిస్థితికి కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహించడంలేదని సూచిస్తోంది. అవి ఈ కింద ఇవ్వబడ్డాయి.

అధినివేశ (డొమినియన్) ప్రతిపత్తికి వ్యతిరేకంగా ఆల్ పార్టీ కన్వెన్షన్‌లో స్వాధీన్ భారత్ సంఘ్ అధికార ప్రతినిధి ప్రసంగంలో ఇలా వుంది :

"అధినివేశ ప్రతిపత్తి అంటే భారతదేశంలోని రాజకీయాలన్నీ అంతిమంగా బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం బ్రిటిష్ నియంత్రణకు లోబడి ఉండడమే! సోషలిస్ట్ పాలన ఏర్పడడం ద్వారానే భారత దేశం యొక్కదాని ప్రజల యొక్క విముక్తి సాధ్యమని మేము అభిప్రాయపడుతున్నాము. నెహ్రూ రిపోర్టులో ప్రతిపాదించిన రాజ్యాంగం, పెట్టుబడిదారీ విధానం మీద సమాజాన్ని నిర్మించాలని కోరుకుంటోందని మేము భయపడు తున్నాము. మేము ఈ రాజ్యాంగాన్ని అంగీక రించడానికి సిద్ధంగా లేము."

స్వాతంత్రమా లేక అధినివేశ ప్రతిపత్తి అనే వివాదంలో జాతీయ కాంగ్రెస్ యొక్క రాజీ వైఖరికి విరుద్ధంగా యూత్ కాంగ్రెస్ ఈ విధంగా తీర్మానించింది.

"సామంత దేశ ప్రతిపత్తి కాదు, సంపూర్ణ స్వరాజ్యం భారత దేశం యొక్క తక్షణ లక్ష్యం కావాలి."

యువకులంతా "అన్ని రకాల పద్ధతుల్లో "ఈ లక్ష్య సాధనకు కృషి చేయాలని ఈ సమావేశం పిలుపునిచ్చింది. 1927 సం.లో కాంగ్రెస్ చేసిన స్వాతంత్ర్య తీర్మానికన్నా ఇది మెరుగుగా వుంది. ఆనాటి తీర్మానంలో స్వాతంత్ర సాధన కోసం అనుసరించాల్సిన పద్ధతుల మీద ఆంక్షలు విధించడంతో, మొత్తం తీర్మానం కాస్తా వాగాడం బరంగా కుదించి వేయబడింది.

ఈ సమావేశం తన రెండవ తీర్మానంలో "పెట్టుబడిదారీ విధానాన్ని అందుబాటులో వున్న అన్ని సాధనాలతో ప్రతిఘటించమని "యువకులను నిర్దేశించింది."మన దేశం యొక్క ఉత్తమ ప్రయోజనాలకు కాపిటలిజం హానికర మైనదని"ఖండన జారీ చేసింది.

ఇక మూడో తీర్మానం మితవాదుల శాంతియుత మార్గం పట్ల, వారి విశ్వాసం మీద తిరుగుబాటును సూచించింది. దీనర్థం పెటి బూర్జువా జాతీయవాదానికి ఆదర్శప్రాయుడైన గాంధీని తిరస్కరించడమే! ఆ తీర్మానం ఇలా పిలుపునిచ్చింది:

"సామ్రాజ్యవాదం విసురుతోన్న నూతన సవాలును యువ భారతం స్వీకరించాలి. ప్రతిహింస అమలును నిరుత్సాహపరిచే వాతావరణం లేని పరిస్థితులను దేశంలో సృష్టించాలి."

ఈ తీర్మానం పరిస్థితులమీద నేరుగా ప్రభావం చూపుతోంది. జాతీయ కాంగ్రెస్ సమావేశాల కన్నా కొద్ది రోజుల ముందే, లాహోర్‌లో ఒక బ్రిటిష్ పోలీస్ అధికారి చంపబడ్డాడు. ఒక ప్రదర్శనలో పోలీస్‌ల దాడితో కలిగిన గాయాల వలన మరణించిన లాలా లజపతిరాయ్ మృతికి ప్రతీకారంగా జాతీయవాదులు ఈ హత్య చేశారని అందరు చెప్పుకుంటున్నారు. గతంలో లాగే కాంగ్రెస్‌తోసహా జాతీయవాద నాయకులందరూ ఈ చర్యకు పాల్పడిన నేరస్థులను తీవ్రంగా ఖండించడంలో పోటీలుపడ్డారు. బూర్జువా నాయకుల ద్రోహపూరితమైన, పిరికి చర్యల పట్ల శ్రేణుల్లో ఎప్పుడూ నిరసన కనపడుతూనే వుంది. ఇప్పుడు బహిరంగంగానే ఖండించబడింది. జాతీయవాద శ్రేణులు, సామ్రాజ్యవాద హింసకు విప్లవ హింసతో జవాబు చెప్పాలనే తమ సంకల్పాన్ని ప్రకటిస్తున్నారు. "మాకు విప్లవం కావాలి - సంస్కరణ కాదు" అనే నినాదంతో సోషలిస్ట్ యూత్ కాన్ఫరెన్స్ సమావేశమైంది. ఆ సమావేశం ప్రారంభోపన్యాసంలో మనం ఈ కింది విషయాలు చూడవచ్చు:

"జాతీయవాదం మధ్యతరగతి యొక్క నినాదం. సోషలిజం పీడితజనాల ఆక్రందన! ప్రస్తుత సామాజిక రుగ్మతలు సంస్కరణలతో నయంకావు.విప్లవమే వాటికి మందు."

"సామంత దేశ ప్రతిపత్తి అనేది స్వార్ధపూరిత శక్తుల పిలుపు. పెట్టుబడిదారీ వర్గంలోని అతివాద శక్తులు రాజకీయాలలో ఎంతవరకు విప్లవాత్మకంగా వుంటాయో చూడాల్సి వుంది."

జాతీయవాద వాలంటీర్లుగా వచ్చిన వేలాదిమంది యువకులు మిలటరీ యూనిఫామ్ ధరించి వచ్చారు. స్వేచ్ఛ కోసం పోరాటంలో తలపడాలనే వాళ్ళ ఉత్సాహాన్ని, సంకల్పాన్ని ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. గతంలో వాళ్లు ఇంట్లోనే తయారు చేసుకున్న ధోతి, గాంధీ టోపీలను యూనిఫామ్‌గా ధరించిన విషయంతో పోలిస్తే ఈ చర్య ఉద్యమ పరిణామాన్ని స్పష్టం చేస్తోంది.

ఈ పరిస్థితులకు అంతిమ ఘట్టంగా ఇరవై వేలమంది పైగా యువకులు పాల్గొన్న భారీ ప్రజా ప్రదర్శన జరిగింది. గతంలో కాంగ్రెస్ సమావేశాలలో బూర్జువా నాయకుల ప్రసంగాలు వినడానికి వేలాదిమంది కార్మికులను, ముఖ్యంగా రైతులను కార్యకర్తలు తరలించేవారు. వాళ్లకు మాట్లాడటానికి లేదా చేయడానికి ఏమీ ఉండేది కాదు. సంస్కరణవాద బూర్జువా జాతీయవాదానికి ఒక బలమైన నేపథ్యాన్ని కల్పించేవారు. నేడు వాళ్లు ఏమాత్రం అటువంటి ఉదాసీన పాత్రతో సంతృప్తిగా లేరు. ఈ సంవత్సరం ప్రదర్శన బూర్జువా నాయకత్వానికి వ్యతిరేకంగా చేసిన సాధారణ తిరుగుబాటులో భాగంలా వుంది. ఆ తిరుగుబాటులో ఒక అత్యంత ముఖ్యమైనదిగాను, శక్తివంతమైనదిగాను వుంది. రాజకీయ చిత్రం మీద స్వతంత్ర శక్తిగా అవతరించడానికి, శ్రామికవర్గం సిద్ధంగా ఉందని ఈ ప్రదర్శన సూచించింది. విప్లవం యొక్క నూతన దశలో నూతన నాయకుడిగా ఎదిగే సామర్థ్యం సంతరించు కోవడానికి అది తప్పనిసరి అవుతుంది.

అన్ని దిక్కులా విప్లవకర పరిస్థితులు అభివృద్ధి చెందుతున్న ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టులు చోదక శక్తిగా వున్న వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ సమావేశం కావడం, వస్తుగతంగా చూస్తే నేటి స్థితిలో ఇదొక ముఖ్యమైన ఘట్టం. వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీలో కమ్యూనిస్టులు నాయకత్వంలో, ఆధిపత్య పాత్ర పోషిస్తున్నప్పటికీ, అది కమ్యూనిస్టు పార్టీ కాదు. ఎన్నో ఏళ్ల క్రితం జాతీయవాద ప్రజానీకంలో మొదటిసారిగా పొడచూపిన రాడికల్ లక్షణాలకు ప్రతినిధిగా అది రంగం మీదకు వచ్చింది. కమ్యూనిస్టులు దానికి మద్దతునిచ్చి, ఎదుగుదలలో తోడ్పడ్డారు. గత రెండు సంవత్సరాలలో చేసిన ప్రముఖ సమ్మెలన్నీ ఆచరణలో వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ బ్యానర్ కిందనే నిర్వహించబడ్డాయి. జాతీయవాద విప్లవ శక్తులన్నిటిని ఏకం చేయడానికి వేదికగా ఈ కొత్త పార్టీని ఏర్పాటు చేయాలనేది కమ్యూనిస్టుల లక్ష్యం! ఆ విధంగా దాన్ని నేటి తక్షణావసరమైన ఒక జాతీయవాద విప్లవ ప్రజా పార్టీగా అభివృద్ధి చేయాలని వాళ్ళు కోరుకుంటున్నారు.

గత సంవత్సరంలో జాతీయవాద శ్రేణుల్లో రాడికల్ భావాలు వ్యాప్తి చేయడాన్ని వేగవంతం చేయడంలో వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ అనుకూలమైన స్థితిలో వుంది. ఇప్పటివరకు పార్టీ ఒక కేంద్రం అనేది లేకుండా వదులైన రీతిలో, ఆయా ప్రావిన్స్‌లలో దాదాపు స్వతంత్ర సంస్థల మాదిరి పని చేస్తోంది. జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు సమాంతరంగా అదే స్థలంలో ఒక కాన్ఫరెన్స్ నిర్వహించి జాతీయ స్థాయిలో పార్టీని పునర్నిర్మాణం చేయాలని నిర్ణయించడమైనది.

వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ కాన్ఫరెన్స్ విజయవంతమైంది. పెద్ద ఎత్తున హాజరయ్యారు. దేశంలో నెలకొని వున్న అద్భుత విప్లవ పరిస్థితికి అది అద్దం పట్టింది. కానీ అలా చేయడంలో అది, జాతీయ విప్లవశక్తులందరిని తన బ్యానర్ కింద సమీకరించాలనే దాని వస్తుగత లక్ష్యాన్ని మరిచి పోవడమో లేక ఇంకా చెప్పాలంటే నిర్లక్ష్యం చేసింది.

# సిపిఐ(ఎం-ఎల్) పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటి సభ్యుడు కామ్రేడ్ అశిష్‌మజుందార్‌కు జోహార్లు

**17-10-21**న కామ్రేడ్ మజుందార్ తీవ్ర గుండెపోటుతో కనుమూశారు. 1968 మొదలుకొని, కడదాకా విప్లవోద్యమంలో ఆయన చురుగ్గా వున్నారు. మరణించే నాటికి ఆయన పశ్చిమబెంగాల్ సిపిఐ(ఎం-ఎల్)రాష్ట్రకమిటి సభ్యులుగా వున్నారు. 1971 ఆగస్టులో ఆయన, నాటి సిపిఐ(ఎం-ఎల్) పశ్చిమబెంగాల్-బీహార్ సరిహద్దు ప్రాంతీయ కమిటీలో సభ్యులుగా కృషిచేశారు.

తదనంతరం ఆయన కా॥ కానుసన్యాల్ నాయకత్వంలోని పార్టీలో చేరి, క్రమంలో సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటి సభ్యుడయ్యారు. గత 3 సం॥లుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో పోరాడుతున్నారు. ఈ స్థితిలోనూ ఆయన తను చేయగలిగిన తోడ్పాటును పార్టీకి అందిస్తూ వచ్చారు.

కామ్రేడ్ అశిష్ మజుందార్‌కు అరుణారుణ జోహార్లు

**అలోక్‌ముఖర్జీ**
**సిఇసిఎమ్**
**కేంద్రకమిటి, సిపిఐ(ఎం-ఎల్)**

# సిపిఐ(ఎం-ఎల్)కేరళ రాష్ట్రకమిటి సభ్యుడు కామ్రేడ్ సనాల్‌కు జోహార్లు

**సిపిఐ(ఎం-ఎల్)** కేరళ రాష్ట్రకమిటి సభ్యుడు, తిరుచూర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సనాల్ (53 సం॥లు) 2021 అక్టోబర్ 9న మరణించారు. పాంక్రియాస్ గ్రంధికి సంబంధించిన వ్యాధితో గత కొంతకాలంగా ఆయన బాధపడుతూ, చికిత్స పొందుతున్నాడు. గత మూడున్నర దశాబ్దాలుగా కేరళ రాష్ట్రంలో విప్లవ కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన క్రియాశీలకంగా పనిచేశారు. ప్రజాఉద్యమాలలో పాల్గొంటున్న సందర్భాలలో అనేక కేసులను పోలీసులు ఆయనపై బనాయించారు. దేశీయ మత్స్యకారుల హక్కులకై పోరాడే కేరళ మత్స్యకారుల యూనియన్‌కు కా॥ సనాల్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. తిరుచూరు జిల్లా కార్యక్రమాల మేరకే కాకుండా కేరళ రాష్ట్రంలో జరిగే కార్యకలాపాలన్నింటిలోనూ కా॥ సనాల్ చురుగ్గా పాల్గొన్నారు. తాను జన్మించిన ఇదథిరుత్తి జిల్లాలో వరదలలో నష్టపోయిన వందలాదిమందికి మద్దతుగా నిలచి వారి తాగునీటి సమస్య పరిష్కారం కోసం, నదీజలాల కాలుష్యానికి వ్యతిరేకంగా నిలకడైన ఉద్యమం నిర్మించారు. కా॥ సనాల్ దృష్టి అంతా విప్లవోద్యమ కృషి, అధ్యయనంపైనే వుండేది. మనపై అనేక విప్లవ బాధ్యతలను మోపి, కలల్ని మిగిల్చి కా॥ సనాల్ వెళ్ళిపోయాడు. ఆ కామ్రేడ్ మరణం కేరళ రాష్ట్ర విప్లవోద్యమానికి, దళిత సమూహ ఉద్యమాలకు తీరని నష్టం. సిపిఐ(ఎం-ఎల్) కేరళ రాష్ట్రకమిటి కా॥ సనాల్ మృతిపట్ల తీవ్రవిచారం వ్యక్తంచేస్తూ, ఆయనకు సంతాపం తెలియజేస్తోంది.

**పి. సుశీలన్**
**కార్యదర్శి, కేరళ రాష్ట్రకమిటి**
**సిపిఐ(ఎం-ఎల్)**

➡యావత్ విప్లవానికి నాయకుడిగా బయటకు వచ్చే బదులు, తనను తాను విప్లవానికి మాత్రమే నాయకుడిగా ఉండే స్థితిలో పెట్టుకుంది.

కాన్ఫరెన్స్‌లో చేసిన ప్రధాన రాజకీయ తీర్మానంలో నెహ్రూ రిపోర్టును "అంతగా పురోగామి స్వభావం లేని బూర్జువా ప్రజాస్వామిక పథకంగా "సరిగ్గానే" ఖండించింది. కానీ కాంగ్రెస్‌లో మితవాద బూర్జువాలను వ్యతిరేకించే ఇండిపెండెట్ లీగ్ పట్ల కూడా వైరి భావంతో విమర్శ చేసింది. కాంగ్రెస్‌లోని రెండు విభాగాల పట్ల తేడా చూపలేదు. జాతీయవాద ఉద్యమ నాయకత్వం నుండి బూర్జువా నాయకులను కూలదోయాలని పెటీ బూర్జువా వామపక్ష రాడికల్స్ ప్రయత్నిస్తున్న సమయంలో వారికి మద్దతు ప్రకటించలేదు; పైగా వాళ్ళను కూడా బడా పెట్టుబడిదారులు, భూస్వాములతో సమానంగా శ్రామికులు, కర్షకులకు శత్రువులన్నట్టు విమర్శించారు. ఇండిపెండెంట్ లీగ్ కార్యక్రమానికి వ్యతిరేకంగా చేసిన విమర్శ మౌలికంగా సరైనది. అయినప్పటికీ ఆ విమర్శతో పాటు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటన ఏర్పాటుకు దాన్ని ఆహ్వానించి ఉంటే అది పాజిటివ్ చర్యగా ఉండేది! మిగిలిన జాతీయవాద ఉద్యమంతో వున్న సంబంధాలను ఈ కింది విధంగా పరిగణించవచ్చు:

"వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ దేశంలో సాపేక్షికంగా బలహీనంగాను మరియు నిర్మాణాత్మకంగా లేని కారణంగా కాంగ్రెస్ సంస్థలలో ఫ్రాక్షన్స్ ఏర్పాటుచేసే సంప్రదాయాన్ని కొనసాగించాల్సిన అవసరం వుంది. ఉద్యమాలు నిర్మించడం కోసం, ప్రతీఘాత నాయకత్వాన్ని బహిర్గతపరిచి విప్లవ శక్తులను డబ్ల్యుపిపి దిశగా సమీకరించుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. అయితే ఇది తాత్కాలిక విధానం మాత్రమే! కాంగ్రెస్ నాయకత్వాన్ని హస్తగతం చేసుకోవడం లేదా దానిపై ఆధిపత్యం నెరపడం డబ్ల్యుపిపి ఉద్దేశం కాదు. కాంగ్రెస్‌లో దాని సభ్యులు విమర్శనాత్మక పాత్ర పోషించాలి. అందువలన మన పార్టీ సభ్యులు కాంగ్రెస్ సంస్థలలో అధికారం చేపట్టరాదు."

ఇండిపెండెంట్ లీగ్‌లో పార్టీ సభ్యులు చేరి దాన్ని హస్తగతం చేసుకోవాలనే తీర్మానం కూడా తిరస్కరించబడింది.

**(ఇన్‌ప్రెకర్, వాల్యూం 9, నెంబర్.6, ఫిబ్రవరి 1, 1929, పేజీలు 93-94)** ★

# అస్సాం ధాల్‌పూర్‌లో పైశాచిక అకృత్యాలకు మూలాలు

# పామాయిల్ సామ్రాజ్య ప్రయోజనాలకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకం

హరకుమార్ గోస్వామి

**'ముస్లిమ్** బాలికలను సమాధుల నుండి బయటకు తీసినప్పటికీ వారిపై అత్యాచారాలు జరిపి తీరాల్సిందే'నని తీవ్ర హిందూమతతత్వవాది ఒకరు నీచమైన నిప్పులు చిమ్మే ప్రసంగం చేశాడు. భారత దేశంలోని అతిపెద్ద రాష్ట్రాలలో ఒకటైన ఉత్తరప్రదేశ్, ముఖ్యమంత్రిగా వున్న అజయ్ కుమార్ బిస్త్(యోగి ఆదిత్యనాథ్) సమక్షంలో ఈ వ్యాఖ్యలు చేశాడు.

ఆసిఫా గుర్తుంది కదా? జమ్ములోయకు చెందిన 8 సం॥ల గొర్రెల కాపరుల బాలికను ఒక దేవాలయంలో నిర్బంధించి రోజుల తరబడి ఆమెపై అత్యాచారం జరిపారు. ఆ బాలిక మరణించిన తర్వాత కూడా కొందరు పైశాచికులు ఆ బాలిక మృతదేహాన్ని సైతం వదలకుండా తమ పైశాచికత్వాన్ని ప్రదర్శించారు.

ఈవిధమైన దిగజారిన నీచమైన పైశాచిక మానసిక ప్రవృత్తినే నెక్రోఫిలియా వ్యాధి అంటారు. పైన పేర్కొన్న ఉపన్యాసం కూడా ప్రజలలో నెక్రోఫిలియాను రెచ్చగొట్టేందుకు ఉద్దేశించినదే. అస్సాం రాష్ట్రం - దారంగ్ జిల్లాలోని సిపాఝర్, ధాల్‌పూర్ ప్రాంతం వద్ద చేపట్టిన ముస్లిములను తొలగించే ప్రక్రియలో కడుపులో తిప్పివేసే సంఘటనల ద్వారా కూడా ఇదే తరహా నెక్రోఫిలియా వ్యాధి లక్షణాలను చూడగలం.

32 సం॥ల మైనుల్ అనే ఓ రైతు యువకుడు పోలీసు కాల్పులలో మరణించాడు. మరో యువకుడు తనకు తాను అస్సామీ వలె రుజువు చేసుకునే విధంగా అస్సామీయుల తువ్వాలును ముఖానికి మాస్క్‌లాగా అడ్డుపెట్టుకొని 'మియాన్' అని పిలువబడే మైనుల్ శవాన్ని కాలితో తంతున్నాడు. 'మియాన్' అంటే వలస వచ్చిన ముస్లిం అని అర్థం. మరో పోలీసు చనిపోయిన అతన్ని రాడ్‌తో కొడుతున్నాడు. ఈ వీడియోలు ప్రపంచమంతటా ప్రసారమయ్యాయి. ఇదంతా పట్టపగలు, పోలీస్ అధికారుల, జిల్లా అధికార యంత్రాంగ ప్రతినిధుల సమక్షంలో వేలాదిమంది ప్రజలు చూస్తుండగా జరిగింది.

శవాన్ని కాలితో తన్నుతూవున్న యువకుడు ఎవరు? అతను జిల్లా అధికార యంత్రాంగం నియమించిన ఓ ఫోటో జర్నలిస్టు. అతని పేరు బిజయ్ బనియా. పోలీసులు అతనిని ఈ చర్యకు ప్రేరేపించారు. ఇది ఓ పిచ్చితనంతో చేసిన చర్యకాదు. ఎందుకంటే హిస్టీరిక్‌గా వుండే ప్రజలను ఆనందపరచటం కోసం చేసింది. మైనుల్‌కు, బిజయ్‌కు నడుమ పాత శత్రుత్వాలేమీ లేవు; అంతకుమించి వారు గతంలో ఏనాడూ కలుసుకుని వుండే అవకాశమే లేదు.

సహజంగా ఇలాంటి ద్వేషాన్ని ప్రదర్శించే చర్యలు-సున్నిత మనస్కులైన వారి ఆలోచనలను ప్రభావితం చేస్తాయి; వారికి కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. ఇంతటి పైశాచిక ఆగ్రహానికి మూలం ఎక్కడుంది? అస్సామ్ రాజకీయాలతో, సామాజిక జీవితంతో తగిన సంబంధం, పరిశీలన, జ్ఞానం లేకపోతే ఇది ఎవరికైనా చాలా పెద్ద ప్రశ్నగా వుంటుంది. అస్సామ్ అనేక జాతుల, తెగల అస్తిత్వాలు కలిగివున్న భూమి. ఈ జాతుల నడుమ విభేధాలు, ఐక్యతలపై ఆధారపడి మొదట సమాజం, ప్రభుత్వ విధానాలు శాంతియుతంగాను, ప్రజాస్వామ్యయుతంగాను నడిచాయి. అయితే అస్సామ్ పాలకవర్గాలు ఈ విధానం వారి ప్రయోజనాలకు నష్టదాయంగా భావించారు. కనుక జాతుల మధ్య విభేధాలను తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవటానికి ఉపయోగించుకోవటం మొదలుపెట్టారు. ఈ పాలకవర్గం స్థానికంగా ఆధిపత్యం కలిగి, ఢిల్లీలో కేంద్రంలో అధికారంలోనున్న వారి ఆశీర్వాదాల కోసం పాకులాడుతుంది. "జాతీయవాదం", దురభిమానం, మతతత్వం, విభజనవాదాన్ని తలకెత్తుకొని నూతిలో కప్పల్లా విదేశీ వస్తు విముఖత కలిగి ప్రజాస్వామీకరణ అనే విస్తృత మార్గం నుండి ప్రక్కకు తప్పుకున్న వీరు, దీనికి వ్యతిరేక మార్గంలో గత 40 సం॥లుగా మతతత్వంలో ప్రయాణిస్తూ నెక్రోఫిలిక్ స్థితికి చేరుకున్నారు. 'అస్సామీస్ నేషనల్ ఆర్గనైజేషన్లు"గా చెప్పబడేవాని పాత్ర, అస్సామ్ ప్రసారసాధనాల పాత్ర ఖచ్చితంగా ఇందులో కీలకమైనది. బిజయ్ బనియా ఆ విషవృక్షానికి కాసిన చేదు ఫలం వంటివాడు.

గత నాలుగు దశాబ్దాల కాలంగా, అంతకు ముందునుండి కూడా, అస్సామ్ పాలకవర్గాలు, వారిపై ఆధారపడి జీవిస్తున్న మేధోవర్గం విద్వేష రాజకీయాలను కొనసాగిస్తూరావటం, ఈ విధమైన అస్తవ్యస్త మానసిక ప్రవృత్తికి కారణంగా వుంది. జాతీయవాదం పేరుతో, బెంగాలీల పట్ల, ముస్లిముల పట్ల ప్రత్యేకించి 'మియాన్ల' పట్ల అంతులేని వ్యతిరేక ద్వేషబీజాలు నాటారు. అక్కడి గిరిజనులను, టీతోట కార్మికులను కూడా వారు తక్కువగా చూస్తారు. అయితే తమ రాజకీయ అధికార క్రీడ ప్రయోజనాలకనుగుణంగా రాజీ విధానాన్ని అనుసరిస్తారు.

1. గోహ్‌పూర్ - నెల్లీ - ముకర్ముచా - చౌక్‌హోవా మారణకాండ, ప్రత్యేకించి నిర్దిష్ట జాతులపై జరిపే హత్యాకాండ, రాజ్యం రహస్య సమ్మతితో వేలాదిమందిని హత్యగావించటం (రాష్ట్ర యంత్రాంగానికి పూర్తిగా తెలిసే విధంగానే నెల్లీ ప్రాంతాన్ని చుట్టుముట్టి రెండురోజులపాటు దాడులు, బీభత్సం సాగించగా 4000 మంది అగ్నికి ఆహుతయ్యారు; అధికారిక ప్రకటనలే 2500 మంది పైగా హతులయ్యారని పేర్కొన్నారు)

2. ఓటర్ల జాబితాలోని లక్షలాది మంది పౌరుల పేర్లకు ఎదురుగా 'డి' (డౌట్‌ఫుల్ - అనుమానితుడు) అని పేర్కొని వారందరిని అసాధారణంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన నీయకపోవటం

3. బిజెపి గత ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ ప్రోత్సాహంతో వలసవచ్చిన వారిని గుర్తించే ఐఎమ్‌డిటి చట్టం రద్దుచేయటం

4. 'ఫారినర్స్ ట్రిబ్యునల్' (విదేశీయులను విచారించే న్యాయస్థానం) వందలాది మంది పౌరులను, విదేశీయులని ఏకపక్షంగా ప్రకటించి, వారందరిని నిర్బంధ శిబిరాలకు తరలించటం

5. ఎన్ఆర్‌సి (జాతీయ పౌరుల పట్టిక) సందర్భంగా లక్షలాదిమంది పేర్లపై అభ్యంతరాలను రాత్రికి రాత్రే తెలియజేయాలనటం

6. క్లిష్టమైన నియంతృత్వ పోకడతో పౌరుల జాబితా నుండి వృత్తి విరమణ చేసిన సైనిక సిబ్బందితో సహా 19 లక్షలమంది పౌరులను తొలగించటం

7. తాజాగా ధాల్‌పూర్ నుండి ఖాళీ చేయించటం, బిజయ్ బనియా ఉదంతం. ఈ పైన పేర్కొన్న విషయాలన్నీ ఒకే అంశంలో భాగంగా వున్నాయి.

'జాతీయవాద' ఎజెండాలో ఇవన్నీ భాగాలే. అస్సామ్ ప్రచార, ప్రసార సాధనాలు దీనికి ఛాంపియన్‌గా వ్యవహరించాయి. ముస్లిమ్‌లపట్ల ఏహ్యభావాన్ని తొలుత ప్రారంభించి, అస్సామ్‌లో 'జాతీయవాదం' పేరుతో రహస్యంగా కొనసాగు

తోంది. ఎత్తుగడల కారణంతో ఇది ముసుగులో సాగుతోంది. తర్వాత వారు శంకర్‌మాధవ్‌తో బాటు అజన్‌ఫకీర్ పేరునుపయోగించి తమ వాస్తవ ముఖాన్ని దాచుకున్నారు. అది ఇకపై అవసరంలేదు. గో ప్రాధాన్యత ప్రాంతాల్లో దూకుడుగా వుండే హిందూమతతత్వానికి ఒకసారి లొంగిపోయిన తర్వాత అజన్‌ఫకీర్ అనేది ఇక గతమే. బిజెపి ముందుకు రావటంతో వంచనాత్మక లౌకికవాదాన్ని కవచంగా వాడుకునే ఇబ్బంది ముగిసింది. 'జాతీయవాదాని'కి చెందిన బడా నాయకుల నుండి ఛోటా మోటా నాయకుల వరకు, వామపక్ష భావాలున్న వారిగా చెప్పబడే మేధావులు, కాషాయ దుస్తుల్లో 'ప్రజాదరణ పొందిన కళాకారులు' సైతం అవకాశవాదంగా తమ లౌకిక విలువలను ఉన్మాదులకు అమ్ముకోవటం ఒక సాధారణ అంశంగా ముందుకొచ్చింది.

హిమంత్ బిశ్వశర్మ ఈనాటి 'నిజమైన హీరో'గా మారాడు. బ్రిటిష్ పాలనా కాలంలో అస్సామ్‌లో ఒక భాగమైన సిల్హెట్ జిల్లాను విభజించిన మహత్తర బార్డోలీ రోజుల నుండి ఇది ప్రారంభమైంది. 1950 సం॥ ప్రాంతంలో దిగువ అస్సాము ప్రాంతమంతటా మతతత్వ హింస చెలరేగింది. దీనితో భాషా సంబంధ జనాభా లెక్కల సేకరణలో ముస్లిములందరూ అస్సామీ భాష మాట్లాడే వారిగా నమోదు చేయించుకునేవిధంగా తలవంచారు. దీనితో సహజంగా, స్వాభావికంగా శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతుల్లో జాతీయ భావం అభివృద్ధిచెందే క్రమం జరుగుతుండగా, దానిని విచ్ఛిన్నంచేసి 'అస్సామీ'ని రాష్ట్ర అధికార భాషగా చేయటం సులభసాధ్యమైంది. అలాగే అస్సామ్ జాతీయతని బలవంతంగా ప్రజలపై రుద్దే నూతన ధోరణి దిగుమతైంది.

హిమంత్ బిశ్వశర్మ అస్సామ్‌కు చెందిన వాస్తవాలను తల్లక్రిందులు చేసి ప్రకటించే విధానాన్ని అభివృద్ధిచేయటం ద్వారా ఒక నూతన ప్రసిద్ధునిగా ముందుకొచ్చాడు. ప్రారంభం నుండి నెల్లీ, గోహ్‌పూర్‌ల తర్వాత కూడా దాడిచేసేవారే, దూకుడుగా వచ్చేవారే దాడికి గురైనవారిగా అస్సాముకు బయటనున్న ప్రజలను నమ్మించే ఎత్తుగడలననుసరించారు. హిమంత్ బిశ్వశర్మ దీనిని ఒక కళగా అభివృద్ధి చేశాడు. భారత బడాపెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను కాపాడటంలో మొనగాడిగా నిలవటంద్వారా జాతీయ ప్రయోజనాల పేరుతో 'తొలగింపు' విధానానికి విద్యార్థి సంఘం, జాతీయవాద సంస్థలుగా చెప్పబడే వాని మద్దతును పొంద గలగటంలో అతను విజయం సాధించాడు.

బడా పెట్టుబడిదారుల 'జాతీయవాద' ప్రయోజనాలకోసం, తొలగింపు ప్రక్రియను అభివృద్ధికర చర్యగా ముస్తాబుచేశారు; ఈ చర్యను మతతత్వీకరణ యొక్క నమూనాగా రూపొందించారు. మానవ జీవితాల, జీవనోపాధుల విధ్వంస క్రమం అలాగే భారీస్థాయిలో పర్యావరణ విధ్వంసం ప్రారంభించారు. మతతత్వ సమీకరణ రాజకీయాలు, స్థానిక తెగల ప్రజలమధ్యనున్న విభేధాలను ఉపయోగించుకొని వారి ప్రయోజనాలను పెంపొందించుకున్నారు. అస్సామ్ బయటనున్న ప్రజలకు ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవటం కష్టమౌతుంది; కనీసం ప్రతిపక్షం కూడా దీనిని అర్థం చేసుకోలేకపోయింది.

ఎన్నికల్లో గెలుపుపై భరోసానివ్వటం, ముఖ్యమంత్రి పీఠంపై బిశ్వశర్మను నిలపటం రెండింటి వెనుక 'తొలగింపు విధానంతో కూడిన అభివృద్ధి'ని అమలుపరచాలనే వ్రాసుకొన్న, మౌఖిక అవగాహనతో వ్యవహరించారు. ఈ విధాన కీలక అంశం ఏమంటే, రైతులను పెద్ద సంఖ్యలో ఖాళీ చేయించి, ఆ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టాలి. నిరంతరాయంగా జిడిపి అభివృద్ధికి తోడ్పడుతున్న వ్యవసాయ ప్రాంతాలను పునర్వ్యవస్థీకరించే, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు సేవచేసే మోడీ ప్రభుత్వ పంథాలో ఇదొక భాగం.

వంటనూనెలలో పామాయిల్‌కు ప్రాధాన్యత నివ్వాలనే కేంద్రప్రభుత్వ ప్రకటన, పామ్ ఆయిల్ తోటల అభివృద్ధి అనే అంశంతోపాటే పామ్‌ఆయిల్ తోటల పెంపకానికి ఈశాన్య రాష్ట్రాల ప్రాంతమే అనువైనదంటూ ముందుకు తెచ్చారు. పామ్ ఆయిల్ తోటల పెంపకం పర్యావరణానికి హానికరమైందని దీనిపట్ల అవగాహన కలిగిన కొందరి ద్వారా తెలుస్తోంది. ఇతర రాష్ట్రాలలో దీనికి ప్రతిఘటన వస్తుందనే భయంతో కావచ్చు; ఈ లక్ష్య సాధనకు ఈశాన్య ప్రాంతాన్ని ఎంచుకున్నారు.

అస్సామ్‌లో అటవీ ప్రాంతాలు మినహా అత్యధిక భూములన్నీ ప్రభుత్వ లాభంకోసమే వున్నాయి. శ్రామిక ప్రజానీకంలో ఒక పెద్ద విభాగం ఆ భూములను దున్నుకొంటూ అక్కడే జీవిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో అత్యధిక ప్రజానీకానికి ఏవిధమైన పట్టాలు లేవు. ఛార్ దీవులు, తీరప్రాంతాలతోసహా రాష్ట్రవ్యాపితంగా భూమిపై హక్కు పట్టాల కోసం దశాబ్దాల కాలంగా డిమాండ్ వుంది. సంవత్సరాలుగా రైతులు ఆ భూములను సాగుచేస్తూ విలువైన ఆహారధాన్యాలను, కూరగాయలను పండిస్తున్నారు. ఛార్ దీవులు, తీరప్రాంతాల్లో పేద రైతులలో అత్యధికులు బెంగాలీ మూలానికి చెందిన ముస్లిములు. రాష్ట్రంలో ఇతర సరిహద్దుల ప్రాంతంలో, రిజర్వ్ అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీలు, నేపాలీలు, స్థానిక ప్రజానీకం పెద్దసంఖ్యలో వున్నారు.

'తొలగింపు' కత్తి ఈ ప్రజలందరిపై వేలాడుతూనే వుంది. అయితే, రాజ్యం 'మియాన్'లను వారి మొదటి లక్ష్యంగా చేసుకుంది. తొలగింపు ప్రదేశాన్ని దర్శించిన ఎవరైనా మియాన్లను లక్ష్యంగా చేసుకొని ఎంత మోసకారితనంతో తొలగింపు జరుగుతోందో స్పష్టంగా అర్థంచేసుకోగలుగుతారు. మొదట జాతీయవాద శక్తులుగా చెప్పబడుతున్న వారు సంఘ్‌పరివార్ లాగా ప్రచార యంత్రాంగాన్ని వుపయోగించి, ప్రచార సాధనాల ద్వారా మియాన్లను లక్ష్యంగా చేసుకొని మొదట దుష్ప్రచారం సాగిస్తారు.

ధాల్‌పూర్ పరిసర ప్రాంతాల్లోని అత్యధిక ప్రజానీకం వరదల కారణంగా తమ భూములను కోల్పోయిన తర్వాత అక్కడకొచ్చి స్థిరపడినవారే. కొందరు 3-4 సార్లు విస్థాపనకు గురైన వారున్నారు. కొందరు దశాబ్దాల కాలంగా ఇక్కడే జీవిస్తున్నవారున్నారు. చెమటోడ్చి వారు శ్రమించటం ద్వారా బ్రహ్మపుత్రకు చెందిన ఛార్ ప్రాంతంలోని సేద్యంచేయని భూములను సాగుచేసి, ఆహార ధాన్యాలు, కూరగాయల పంటలతో హరిత ప్రాంతంగా మార్చివేశారు. గుహహతిలో 'కురౌర్ షాక్' అనే (కురౌరా ప్రాంత) కూరగాయలకు అత్యంత ప్రాచుర్యం వుంది. గత కొన్ని దశాబ్దాలుగా ధాల్‌పూర్ పరిసరాల్లోని గ్రామాల రైతాంగ ప్రజానీకం పాఠశాలలను, మార్కెట్‌ను, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసుకోగలిగారు.

మతతత్వ సంస్థలు, ప్రచార సాధనాల ద్వారా విదేశాల నుండి వచ్చి స్థిరపడిన వారుగా ముద్రించటంద్వారా ప్రజలను అంతర్గతంగా విస్థాపనకు గురిచేస్తున్నారు. దీనిని అర్థంచేసుకోవటానికి కొంత సమాచారం అవసరమౌతుంది.

1990లలో ధాల్‌పూర్ ప్రాంతం 77,420 బీఘాలుగా వుండేది. ఇటీవల రాష్ట్రశాసనసభలో మనోరంజన్ దాస్ అడిగిన ఓ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో ధాల్‌పూర్ విస్తీర్ణం 25,929 బీఘాల 8 లెచ్చాలు అని పేర్కొన్నారు. మిగిలిన భూమి ఏమైపోయింది? దీనికి మరికొంత సమాచారం తెలుసుకోవాలి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం కురువ, ఎన్‌సి కిరకరా అనే రెండు గ్రామాలకు 10,000 బీఘాలు, 41,488 బీఘాల 3 కొత్తాల 12 లెచ్చాల భూములున్నాయి. ప్రస్తుతం ఆ రెండు గ్రామాలు బ్రహ్మపుత్ర నదిలో కలిసిపోయాయి.

అంతర్గత విస్థాపన సమస్య లోతును అర్థం చేసుకోవటానికి ఈ రెండు గ్రామాల అనుభవాలు సరిపోతాయి. ఉన్నత న్యాయస్థానాలు ఈ సమస్యను ఎలా పరిష్కరించాలనే దానిపై ఇచ్చిన అనేక తీర్పులు, అలాగే ఐక్యరాజ్యసమితి ఆదేశం

కూడా వున్నాయి. అయితే వాటన్నింటిని పెడచెవిన పెట్టి బలవంతంగా విస్థాపన చేయించేందుకు తొలగింపు ప్రక్రియను కరోనా విపత్తు సమయంలోనూ కొనసాగిస్తున్నారు.

అంతర్గతంగా విస్థాపనకు గురైన వ్యక్తులు ఆటంకాలన్నింటికి ఎదురొడ్డి నూతనంగా తమ జీవితాన్ని ప్రారంభించిన ఆ ప్రాంతం నుండి బలవంతంగా ఎలా వదలివెళ్ళారో అనే దానికి అనేక సంఘటనలున్నాయి. ఎన్‌సి కిర్‌కరాకు చెందిన దాదాపు 500 కుటుంబాల ప్రజలు ఫుహార్‌తలిలోని ఒక భాగంలో జీవితాన్ని కొత్తగా ప్రారంభించిన వారికి ఆ ప్రాంతం విడిచి వెళ్ళాల్సిందిగా నోటీసులు జారీచేశారు. ఇంకా అనుమానాలున్నవారు వెళ్ళి పరిశీలించుకోవచ్చు.

హిమంత్ బిశ్వకర్మ ప్రభుత్వ, అలాగే కేంద్రప్రభుత్వ 'మానవత్వ' అప్రోచ్ అనే దాని వూసే లేదు. ధాల్‌పూర్ ప్రజానీకాన్ని బ్రహ్మపుత్ర నదికి 6-7 కి॥మీ దూరంలోని నిర్జీవమైన ప్రాంతంలో నివశించమని చెబుతున్నారు. తాగునీటి సౌకర్యాలను, మురుగునీటి సదుపాయాలను, తగిన జీవనోపాధులను, జీవన ఏర్పాట్లను వదిలేసుకొని వెళ్ళిపొమ్మని కోరేంత 'మానవత్వ' అప్రోచ్‌తో వారున్నారు. ఈవిధమైన 'మానవత్వ' చర్యలు స్వేచ్ఛగా జీవిస్తున్న రైతులను బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకనుగుణంగా, వ్యవసాయ భూములలో వారు చేపడుతున్న నూతన వాణిజ్య కార్యకలాపాలకు కారుచౌకగా లభించే నిరుద్యోగ రిజర్వు కూలీలుగా మార్చివేశాయి.

'తొలగింపు' ప్రదేశాలలో పోలీసుల క్యాంపులు, అర్ధసైనిక బలగాల మోహరింపు జరుగుతోంది. ఒకటో, రెండో ట్రాక్టర్లు అక్కడక్కడా తిరుగుతూండటమే చూడగలుగుతాం. తొలగింపబడిన ప్రజలను ముందు వేతన కార్మికులుగా పనిచేయమనే ప్రతిపాదన పెడుతున్నారు. 6, 7 కి॥మీ దూరంలో పని ప్రదేశానికి నడిచి వెళ్ళగలిగిన వారికి మాత్రమే ఈ అవకాశం. గువహతీ పౌరులకు, ఇతర ప్రాంతాలకు ఆహారం, కూరగాయలు అందించిన అదే ప్రజలు, రైతాంగం, ఆదానీవంటి పామాయిల్ చక్రవర్తుల వద్ద బలవంతంగా కట్టుబానిసలుగా మార్చబడ్డారు. అయితే చరిత్ర ఇక్కడితో అంతం కాబోదు. అస్సామ్ ప్రజానీకం ముందు గంభీరమైన ప్రశ్నలు నిలచివున్నాయి. మోడీ భారతదేశాన్ని అమ్ముతున్న విధంగానే, 'జాతీయవాదులు' అస్సామ్‌ను బడాపెట్టుబడిదార్లకు అమ్మటాన్ని అస్సామ్ ప్రజానీకం అనుమతిస్తారా? లేక భవిష్యత్తులో అస్సామ్‌లో నిజమైన ప్రజాస్వామిక అభివృద్ధికోసం నిలుస్తారా? ప్రస్తుతం కుట్రదారులు పైచేయిలో వున్నారు. అయితే ప్రజాస్వామికం కోసం సాగే పోరాటం అస్సామ్‌లో బడాపెట్టుబడి సాగించే కుట్రలను అంతిమంగా ఓడిస్తుంది.

సరళరేఖలలో ఏదీ అభివృద్ధి కాదు. అనేక మార్పులు, మలుపులు వుంటాయి. సరళరేఖలో సాగుతుందనే అభివృద్ధి ప్రయత్నాలు, తాము ఆశించిన దానికి భిన్నంగా పరిణమిస్తాయని కార్పొరేట్లకు అర్థం చేయించుదాం. ✸

# మహా సంకల్పం

మూలం : బెర్టోల్డ్ బ్రెక్ట్

(సాంగ్ ఆఫ్ రిజల్యూషన్)

అనువాదం : ఏ.బి.కె. ప్రసాద్

తెలుసు మాకు తెలుసు -
మా దుర్బలత్వం జడత్వం
మీ దారుణ చట్టాలకు పటుత్వం,
ఈ బిక్కతనం బక్కతనం
ఉండదు కలకాలం
నేటి మీ శాసనాలే మా లక్ష్యశుద్ధికి
రేపటి వరిపిడి రాళ్ళు
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
మా తలలకు పిస్తోళ్ళు ఎక్కుపెట్టి
తరిమి తరిమి చెరబడతారు మీరు,
కాని చిత్రహింసలకు
చెదరేదిలేదని, బెదరేదిలేదని
సంకల్పం సమష్టిగా చెప్పుకుంటాం.
బానిసత్వం మిత్తువను మించిన
ముత్తవ, హీనాతి హీనం!

తెలుసు మాకు తెలుసు - మా
ఆర్తి తీర్చకుండా మమ్మ
క్షుధార్తులుగానే ఉంచుతారు
ఆపన్నుల బతుకులను సంపన్నులకు
అప్పడాలు నైవేద్యాలుగా మార్చుతారు!
మేట వేసిన మీ గరిసెల
గుమ్మాల దరిచేరకుండా
అడ్డగిస్తున్న కంచుకోటల కవాటాలు
బద్దలు కొడతాం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
మా చుట్టూ కొంపలెన్నో నిర్జనవాసాలు
అయినా నిరంతరం మేము నిర్వాసితులం
ఈ క్షణం నుండే దారుణాతిక్రమణకు
స్వస్తి చెప్పేస్తాం
గోడుమంటున్న మానవునికి
గూడు కల్పిస్తాం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
పూట బత్తెం పుల్ల వెలుగై
పూట గడవనిమ్మని సాగిలపడి ఇక
బామాలేది లేదు బతిమాలేది లేదు
కరాల సత్తువకొద్దీ మీ
కర్మాగారాలన్నీ రేపటినుంచే మా సొత్తు
ఇకపై నష్టాలు మీ వంతు,
లాభాలు మా వంతు
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు
పాలకుల బాసల యాసలు
కానేరవు పాలితుల బతుకుల బాటలు
స్వేచ్ఛాపథమే సుఖజీవన మార్గం
సుందర భవితవ్యం
మా చేతనా సహకార ఫలం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
తుపాకీల 'తూర్య' నాదాలే
మీకర్థం కాగల ఘంటారావాలు
పాఠం గుణపాఠంగా నిరూపిస్తాం
రేపే బందూకులనే మీపై ఎక్కుపెడతాం
ఇదే మా సంకల్పం.

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారిగా కార్మికవర్గ నియంతృత్వాన్ని ఏర్పరచిన ప్యారిస్ కమ్యూన్ (1871 మార్చి) సంఘటనలను చక్కగా చిత్రించిన బ్రెక్ట్ నాటకంలోనిది యీ గేయం. ఈ నాటకం పేరు "కమ్యూన్ రోజులు".

# ఆటోమొబైల్ కేంద్రంగా దేశ పారిశ్రామికాభివృద్ధి
# గుత్త పెట్టుబడి లాభం కోసమే

**పోటీ** పెట్టుబడిదారీ వ్యవస్థ గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థగా పరివర్తన చెందే క్రమంలో ప్రపంచ స్థాయిలోనే కాకుండా భారతదేశంలో కూడా ఆటోమొబైల్స్ పరిశ్రమ కేంద్రంగా, పారిశ్రామిక రంగం వృద్ధి చెందింది. ఈ ధోరణి బలపడటానికి కారణం ఏమిటి? అసలు ఆటో మొబైల్స్ పరిశ్రమ అంటేనే ప్రవేటు వాహనాల ఉత్పత్తి, అమ్మకాలు. ప్రజా రవాణా వ్యవస్థలను క్రమంగా పక్కకు జరిపి ఇటువంటి వ్యక్తిగత స్థాయి రవాణా వ్యవస్థ వేగవంతం కావడం ఎవరి ప్రయోజనాల కొరకు? అన్నిరకాల వ్యవస్థలకు అనుసంధానంగా నిలిచే రవాణా వ్యవస్థలోని ఈ పరిణామాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయా? పేదరిక నిర్మూలన జరుగుతుందా? ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవనోపాధులు అందుబాటులోకి వస్తాయా? నిజానికి అభివృద్ధి క్రమం నుండి మెజారిటీ ప్రజలు బయటకు నెట్టివేయ బడడంతో సంక్షుభిత, దుర్భర జీవితాలు సర్వసాధారణమయినాయి. మరి ఈ ఆటోమొబైల్ పరిశ్రమ వృద్ధి ఎవరి కోసం?

నిరపేక్షంగా, సాపేక్షంగా మిగులు శ్రమను దోచుకొని లాభాలు ఆర్జించడంతో గుత్త పెట్టుబడుల లాభదాహం తీరదు; ఇంకా ఇంకా మరింత లాభాల కోసం నూతన మార్గాల అన్వేషణ కొనసాగుతూనే ఉంటుంది. ఆ క్రమంలో ఆవిష్కరించబడిన మార్గం ఏమిటంటే టర్నోవర్ సమయాన్ని తగ్గించడం. అంటే పెట్టుబడి పెట్టడం మొదలుకొని లాభాలను వాస్తవీకరించుకునే వరకు పట్టే సమయం తగ్గించటం అన్నమాట. ఇది తగ్గిన కొద్దీ వార్షిక లాభం రేటు పెరుగుతూనే ఉంటుంది. టర్నోవర్ సమయాన్ని తగ్గించడంలో రవాణా, కమ్యూనికేషన్ రంగాలదే కీలక పాత్ర. గుత్త పెట్టుబడుల లాభ దాహంతో ముడిపడి ఉన్న ఆటోమొబైల్ రంగం వైవిధ్యీకరణతో స్థిరంగా, బలంగా విస్తరిస్తూనే ఉన్నది.

"అభివృద్ధి" అంటేనే విలాసవంతమైన ఆడంబర ప్రైవేటు వ్యక్తిగత వాహనాలు, అవి వేగంగా పోవటానికి పెద్ద విశాలమైన హైవేలు అనే తప్పుడు వాదన బాగా బలపడింది. ఈ విధంగా పరిశ్రమల రంగ నిర్మాణంలో వక్రీకరణకు పునాదులు పడ్డాయి. దేశీయ మౌలిక ఉత్పాదక పరిశ్రమల అభివృద్ధి స్థానంలో ఎగుమతి, దిగుమతుల ఆధారిత వసతుల, వనరుల రూపకల్పన అన్నది ప్రాధాన్యత సంతరించుకొంది. ఈమేరకు సామ్రాజ్యవాద నిర్దేశిత విధానాలను దేశంలో రూపొందించి అమలు చేశారు. స్వావలంబన మాటల్లోను, కాగితాల్లోనే ఉండి పోయింది. ఈ పరిణామం ప్రపంచీకరణ క్రమం వేగంగా విస్తరించటానికి తోడ్పడింది.

అమెరికాకు చెందిన మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త పాల్ స్వీజీ అభిప్రాయం ప్రకారం, 20వ శతాబ్దపు మూలధన కల్పన మొత్తం ఆటోమొబైల్ పరిశ్రమ చుట్టూ పరిభ్రమించింది. కార్ల కంపెనీలు, ఆయిల్ పరిశ్రమ, స్టీలు మొదలైన ఖనిజాలు, హైవే నిర్మాణాలు– అందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు మొదలైనవి అన్నీ ఆటోమొబైల్ పారిశ్రామికీకరణను సృష్టించాయి. దీనితో ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ మీద ఆధారపడటం తీవ్రమైంది. అమెరికాలో గానీ మొత్తం ప్రపంచంలోగానీ అత్యధిక కార్బన్ డయాక్సైడ్ వ్యర్థ పదార్థాల విడుదలకు అంటే వాతావరణ మార్పులకు ఈ తరహా రవాణా వ్యవస్థనే కారణమైంది.

**భారతదేశంలో ఆటోమొబైల్ రంగం :**

మన ఆటోమొబైల్ పరిశ్రమ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమగా నేడు 4వ స్థానంలో ఉంది. మనదేశంలోని తయారీ రంగం ఉత్పత్తిలో ఆటో మొబైల్ ఉత్పత్తులు 50 శాతం. ఈ రంగంలో ఉద్యోగిత 3 కోట్ల 50 లక్షలకు పైగానే. ఈ రంగానికి గుర్గావ్, చెన్నై, పూణే మూడు ప్రధానమైన కేంద్రాలు. అతిపెద్ద ఆటోమొబైల్, మరియు ఆటోమొబైల్ అనుబంధ ఉత్పత్తులలో ముందున్న చెన్నైని ఆసియా ఖండంలోని డెట్రాయిట్ అంటారు. ప్రపంచంలోని అత్యున్నత ఆటోమొబైల్ హబ్స్ లో చెన్నై ఒకటి. హుండాయ్, నిస్సాన్, బీఎండబ్ల్యూ, యమహా, టీవీఎస్ మొదలైన చాలా కంపెనీలు ఉన్నాయి. నిమిషానికి మూడు కార్లు ఇక్కడ ఉత్పత్తి అవుతాయి. అంటే సంవత్సరానికి 14 లక్షల కార్లు.

కాగా, గుర్గావ్‌లో ఫోర్డ్, హుండాయ్ మోటార్స్ ప్రధానమైన కార్ల కంపెనీలు ఉన్నాయి. ఇక పూణేలో టాటా, ఫియట్ కంపెనీలు ముఖ్యమైనవి. ఇట్లా ఆటోమొబైల్ ఉత్పత్తులు అంటే ప్యాసింజర్ కార్ల ఉత్పత్తి అన్నమాట. కార్ల శ్రేణి పరిధి చాలా విశాలమైంది. బిలియనీర్ల విలాసాలకు, ఆడంబరాలకు అనుగుణంగా అత్యంత విలాసవంతమైన కార్ల నుండి మధ్యతరగతి వర్గం వినియోగించే సాధారణ కార్ల వరకు ఉంటాయి. ఖరీదైన కారును బట్టి సమాజంలో హోదా నిర్ణయించబడుతుంది. దీని పట్ల మోజు, వెంపర్లాట, తమ గొప్పను ప్రదర్శించే ధోరణి మధ్యతరగతి, సంపన్నవర్గాలలో రోజురోజుకూ తీవ్రమవుతూనే ఉన్నది. మెజారిటీ ప్రజల జీవితావసర వస్తువులతో ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తిగత కార్ల ఉత్పత్తి మన ఆర్థిక వ్యవస్థలో అతి ముఖ్యమైన పరిశ్రమ అయింది. అందువల్ల పారిశ్రామికాభివృద్ధి మొత్తం ఈ రంగం చుట్టూ అల్లుకుపోతున్నది. దీనితో ప్రజల జీవితావసరాలతో పారిశ్రామిక రంగం స్పష్టంగా వేరు పడింది.

పైగా ఈ రంగంలో మూలధన సాంద్రత చాలా ఎక్కువ. చాలా దేశాలలాగా శతాబ్దాల తరబడి సామ్రాజ్యవాద పీడన కొనసాగిన కారణంగా వెనుకబడిన మన దేశంలో పెట్టుబడుల కొరత ఉంటుంది. కనుక విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలి, రాయితీలివ్వాలి అంటూ అతి విలువైన కొరతగా ఉన్న పెట్టుబడులను ఎందుకోసం ఉపయోగించడం జరుగుతున్నది? సంపద, ఆదాయాలలో తీవ్రంగా అసమానతలున్న నేపథ్యంలో సంపన్నుల విలాసవంతమైన, ఆడంబర జీవితాలకు కావలసిన అధునాతన కార్ల ఉత్పత్తికోసం కేటాయించాల్సి వస్తున్నది. మౌలిక పారిశ్రామిక అభివృద్ధి క్రమంలో ఇది క్రూరమైన అణచివేత.

మూలధన సాంద్రత అత్యధికంగా ఉన్న పరిశ్రమలలో ఉద్యోగ కల్పన బలహీనంగానే ఉంటుంది. పారిశ్రామిక రంగంలో ఉద్యోగిత వాటా పెరిగితేనే దానిని పారిశ్రామికాభివృద్ధి అని అంటారు. కాగా శ్రమ సంపద అధికంగా ఉన్న మనదేశంలో అందుకు విభిన్నంగా మూలధన సాంద్రత అధికంగా ఉన్న ఆటోమొబైల్ రంగం కేంద్రంగా పరిశ్రమల రంగం అభివృద్ధి కావటం, సామ్రాజ్యవాద ఒత్తిడులకు లొంగిపోయిన విధానాల ఫలితమే.

**వ్యక్తిగత కార్ల ఉత్పత్తిలో వృద్ధి ధోరణులు :**

1980 వరకు ప్యాసింజర్ కార్ల దిగుమతుల మీద కఠినమైన ఆంక్షలు ఉండేవి. దేశీయ ఉత్పత్తులను, విడిభాగాల ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వ విధానాలు ఉండేవి. ఈ

రంగంలో విదేశీ ఉనికిని నిరుత్సాహపరిచే దానికి అధిక స్థాయిలో టారిఫ్‌లు, పరిమాణాత్మక నిబంధనలు అమలులో ఉండేవి. రవాణా వ్యవస్థలో కార్ల పాత్ర, అసలు వ్యక్తిగత కార్ల పాత్ర అతి తక్కువ స్థాయిలో ఉండేది.

భద్రత, అందుబాటులో ఉండటం లక్షణాలతో ప్రజా రవాణా వ్యవస్థ బలంగా ఉండేది. సమిష్టిగా ఉపయోగించగల వాహనం బస్సు. ఇంధనం, ఖనిజాల వాడకంలో ఆదా ఉంటుంది. రోడ్లమీద రద్దీ తక్కువగా ఉంటుంది. కాలుష్యం కూడా తక్కువే. వీటి నిర్వహణ ఖర్చు, వ్యక్తిగతంగా రవాణా ఖర్చు రెండూ తక్కువగానే ఉంటాయి.

1981 నుండే ఈ పరిస్థితులు తలక్రిందులు కావటం ప్రారంభమైంది. గ్లోబలైజేషన్ క్రమంతో ఈ ధోరణి వేగవంతమై ప్రస్తుతం పరాకాష్ట దశకు చేరుకుంది. 1981 నుండి ఈ రంగంలో సరళీకరణ ధోరణులు ప్రవేశించాయి.

దిగుమతులను ప్రోత్సహించటం, విదేశీ మిలాఖత్‌లను పెంచటం ప్రారంభమైంది. క్రమంగా దేశీయ ఉత్పత్తి, దేశీయ టెక్నాలజీ భావనలు కనుమరుగయ్యాయి. భారత ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న మారుతి ఉద్యోగ్ లిమిటెడ్, సుజుకి మోటార్స్‌లో విలీనం కావడంతో కార్ల మార్కెట్లో ప్రీమియర్ ఆటోమొబైల్స్ లిమిటెడ్, హిందుస్థాన్ మోటార్ లిమిటెడ్ ఆధిపత్యం అంతరించింది. విదేశీ మిలాఖత్తులు, విదేశీ కంపెనీలు ఆటోమొబైల్ రంగాన్ని ఆక్రమించుకున్నాయి.

నూతన ఆర్థిక విధానంలో లైసెన్సుల రద్దుతో పాటు ఆటోమొబైల్ రంగంలోకి విదేశీ సంస్థలను ఆహ్వానించటం ముమ్మరం అయింది. 2002 నాటికే 16 ఉమ్మడి వెంచర్లు బలపడ్డాయి. రకరకాల కార్లతో మార్కెట్ నిండిపోయింది. అంతేకాకుండా, ముడిసరుకులు, మధ్యంతర సరుకులు, విడిభాగాలు అన్నింటిలో దిగుమతులు చేసుకోవటం పెరిగింది. టెక్నాలజీ దిగుమతులు విపరీతంగా పెరగడంతో అత్యధిక స్థాయి లైసెన్సు ఫీజులు, రాయల్టీలు, టెక్నికల్ నైపుణ్యానికి ఫీజులతో భారీఎత్తున మన దేశ సంపద విదేశాలకు తరలి వెళ్లింది. ఈ రంగంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం తీవ్రమైంది. అత్యధిక దిగుమతి సాంద్రత గల కార్ల అమ్మకాలు పెరగటంతో దేశీయ నిజ అవసరాల దిగుమతులకు వినియోగించాల్సిన, అసలే కొరతగా ఉన్న విదేశీ మారక ద్రవ్యం పెద్ద ఎత్తున తరలి వెళ్లింది. భారతదేశం నుంచి వెళ్లి విదేశాల్లో రెక్కలు ముక్కలుచేసుకుని, పొట్టలు మాడ్చుకుని లక్షలాది మంది ప్రజలు, మధ్యతరగతి వర్గాల బిడ్డలు సంపాదించే డాలర్ల మారకద్రవ్యం ఈ ఖరీదైన కార్ల కొనుగోలు దారులకు రాయితీ రూపంలోకి మారిపోతూ వుంది.

## ఈ కార్ల విక్రయాలు ఎలా సాధ్యమైనాయి?

80వ దశకం నుండి ఆటోమొబైల్ రంగంలో సరళీకరణ ధోరణులు పెరిగాయి. అయితే, వ్యక్తిగత కారు, ఒక అత్యవసర వినియోగ వస్తువు ఎలా అయింది? మనదేశంలో ఉత్పాదక రంగంలో భారీ పరిశ్రమలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చిన రెండవ పంచవర్ష ప్రణాళిక పూర్తిగా విఫలమైంది. వినియోగ వస్తువుల లభ్యతలో తీవ్రమైన కొరత ఏర్పడి పీడిత వర్గాల బతుకులు మరింత దుర్భరం అయినాయి. ఈ కొరత ప్రభావం సంపన్న వర్గం మీద ఉండదు కదా! సామాన్య జనానికి అవసరమైన వినియోగ వస్తువుల ఉత్పత్తిని, దిగుమతులను ప్రోత్సహించడం తప్పనిసరి అని గుర్తించడం జరిగింది. ఈ నెపంతో, సంపన్నవర్గం వినియోగించే విలాస వస్తువుల ఉత్పత్తులు, దిగుమతులు పెరగటం తీవ్రమైంది. ఇందులో భాగంగా వ్యక్తిగత కార్ల ఉత్పత్తులు పెరిగాయి. దిగుమతుల పెరుగుదలకు దిగుమతుల సరళీకరణ విధానం తోడ్పడింది. ఆటోమొబైల్ రంగంలో విదేశీ మిలాఖత్ సంస్థల ఆధిపత్యం పెరిగింది. దేశీయ టెక్నాలజీ అభివృద్ధి అదృశ్యమైంది. విదేశాలలో ఉన్న ఈ మిలాఖత్‌ల మాతృసంస్థల చేతిలో టెక్నాలజీ గుత్తాధిపత్యం కేంద్రీకృతమైంది. నిజానికి 1990ల తర్వాత ప్యాసింజర్ కార్ల విషయంలో భారతదేశం, కారు విడిభాగాలను దిగుమతి చేసుకొని కూర్పుచేసే కేంద్రం అయింది. ఈ విధంగా మూలధన సాంద్రత, విదేశీ మూలధన సాంద్రత, దిగుమతుల సాంద్రత అన్నీ అధికంగా ఉన్న ఆటోమొబైల్ పరిశ్రమ కేంద్రంగా మన పరిశ్రమల రంగం అభివృద్ధి చెందింది. పారిశ్రామిక నిర్మాణాలలో వక్రీకరణ బలపడింది.

## భారీ స్థాయిలో కార్లకు గిరాకి ఏ విధంగా పెరిగింది?

ఆటోమొబైల్ పరిశ్రమ మనుగడకు ఇది అత్యవసరం. ఈ దిశగా ప్రభుత్వం రెండు వ్యూహాలను బలంగా అమలు పరిచింది.

1. ప్రజారవాణా వ్యవస్థను కుదించివేయటాన్ని తీవ్రం చేసింది. ప్రైవేటీకరణ తీవ్రమైంది. ఇక ఆటోలు, క్యాబ్‌లు ప్రజారవాణా అవసరాలకు తప్పనిసరి అయినాయి. దీనితో ఆటోలు, క్యాబ్‌లు నడపటం ఉపాధి మార్గాలు అయినాయి.

2. కార్ల మార్కెట్ లోకి మధ్యతరగతి వర్గం కొనుగోళ్లు పెరిగితేనే ఆటోమొబైల్ రంగం మనగలుగుతుంది. ప్రజారవాణా వ్యవస్థ బలహీన పడటంతో ఈ వర్గానికి, కార్లు కొనటం ఒకవైపు తప్పనిసరైంది. మరొకవైపు కార్ల కొనుగోలుకు పరపతి లభ్యత పెరిగింది. వ్యక్తిగత రుణాలు అందుబాటులోకి వచ్చాయి. అదే సమయంలో అనువైన పే రివిజన్ వల్ల ప్రభుత్వ ఉద్యోగస్తుల జీతాలు పెరిగాయి. ఈ అనుకూల పరిస్థితులన్నీ మధ్యతరగతి వర్గాన్ని కార్ల కొనుగోలుకు ప్రోత్సహించాయి. మనదేశంలో మధ్యతరగతి వర్గం పరిమాణం, ఇంగ్లాండ్ జనాభా కంటే, ఫ్రాన్స్ జనాభా కంటే అధికం. కాబట్టి, ఈ వర్గం కార్ల కొనుగోలులోకి ప్రవేశించినట్లయితే, కార్ల గిరాకీకి ఇక లోటు ఉండదు.

ఆటోమొబైల్ పరిశ్రమను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం అయ్యింది. మేకిన్ ఇండియాలో గుర్తించిన ఆరు సూపర్ స్టార్ రంగాలలో ఇది ఒకటి. ప్యాసింజర్ కారు విభాగంలో విక్రయాలు పెరుగుతూనే ఉన్నాయి. 2026 నాటికి, ఈ రంగం వాటా స్థూల దేశీయ ఉత్పత్తిలో 12 శాతాన్ని మించాలి అన్న లక్ష్యంతో ప్రభుత్వ విధానాల రూపకల్పన జరుగుతున్నది.

ఈ వ్యక్తిగత వాహనాలన్నీ రోడ్డు మీద నడవటానికి చమురు అవసరం. నిజానికి 1990-91లో తీవ్రంగా ఏర్పడిన విదేశీ మారక సంక్షోభానికి చమురు దిగుమతులే ప్రధాన కారణం. మన పరిశ్రమల రంగం అభివృద్ధి మొత్తంగా ఆటోమొబైల్ పరిశ్రమ కేంద్రంగా మలుచుకున్నప్పుడు, చమురు దిగుమతులను నియంత్రించినట్లయితే గుత్త పెట్టుబడులకు నష్టం కదా! అందువల్ల చమురు దిగుమతులను సరళీకరించటం విదేశీ మారక ద్రవ్య సంక్షోభం దృష్ట్యా సీరియస్ వైరుధ్యమే. దిగుమతులలో దాదాపు 80% ముడి చమురు అవసరాలే.

ఆటోమొబైల్ రంగం కేంద్రంగా వక్రీకరణకు గురైన పారిశ్రామిక అభివృద్ధి వల్ల ముడి చమురు దిగుమతులు నిరాటంకంగా పెరగటానికి అనుకూలమైన సరళీకరణ విధానాలు అమలవుతాయి. పర్యవసానంగా, మన దేశం విదేశీమారక ద్రవ్య సంక్షోభ వలయంలో బందీ అవుతుంది. ఈ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతుంది కూడా.

పైగా పరిశ్రమకు ముందు, వెనుక అనుబంధ పరిశ్రమలు బలంగా ఉంటాయని చెబుతూ ఈ పరిశ్రమ అభివృద్ధి మీదనే కేంద్రీకరించడం వల్ల పారిశ్రామిక వక్ర నిర్మాణాలు మరింత

బలపడ్డాయి. మరొకవైపు అత్యధిక స్థాయిలో చమురు దిగుమతుల వల్ల విదేశీ మారక సంక్షోభం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది.

**ఆటోమొబైల్ రంగంలో సంక్షోభం :**

2019లో 5 లక్షల ప్యాసింజర్ కార్లను, 30 లక్షల ద్విచక్ర వాహనాలను విక్రయించలేని స్థితి ఏర్పడడంతో కార్ల కంపెనీలకు లాభాల సంక్షోభం ఏర్పడింది. మనదేశంలో పరిశ్రమల అభివృద్ధికి ఈ రంగమే కేంద్రం కావడం వల్ల ఇదే ఆర్థిక సంక్షోభం అయింది. కార్ల కంపెనీలు, తమ ఉత్పత్తులను తగ్గించడం మొదలు పెట్టాయి. ఉదాహరణకు జపాన్ కార్ల తయారీ కంపెనీ టయోటా, దక్షిణ కొరియా కార్ల కంపెనీ హుందాయ్ మోటార్స్ రెండూ 2019లో తమ ప్లాంట్లలో ఉత్పత్తిని 50 శాతం తగ్గించాయి. దీనితో వేల మంది ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారు. ఆటో మొబైల్స్ విడిభాగాల ఉత్పత్తి పరిశ్రమల్లో మూడున్నర లక్షల మంది ఉపాధి కోల్పోయారు అని అంచనా. నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమైంది.

ఒకవైపు ఎస్ బి ఐ అధ్యయనం, ఆర్బీఐ అధ్యయనం, వేతనాలలో వృద్ధి తగ్గుతుందని, ద్రవ్యోల్బణం వల్ల నిజవేతనంలో పెరుగుదల రుణాత్మకం అవుతున్నదని వ్యక్తం చేయగా, ఐ ఎల్ ఓ ప్రకారం, శ్రమ ఉత్పాదకత కంటే వేతనం తక్కువగా ఉన్నదని వ్యక్తం చేసింది. ఆటో మొబైల్ రంగంలోని సంక్షోభం, శ్రామికుల పరిస్థితిని మరింత బలహీనపరిచింది. వీళ్ళ బతుకు సంక్షోభం ప్రభుత్వానికి పట్టనిదే అయ్యింది. కార్పొరేట్ శక్తుల లాభాల దృష్టికోణంలోనే నిర్ణయాలు తీసుకొనే ప్రభుత్వం, కనీస వేతనాన్ని రోజుకు 176 రూపాయల నుండి 178 రూపాయలకి పెంచింది. అంటే రోజుకు రెండు రూపాయల పెరుగుదల!

కాగా ప్యాసింజర్, వాణిజ్య వాహనాలు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు మొత్తం కలిపి 2019లో 2 కోట్ల 60 లక్షల వాహనాలకు పైగా ఉత్పత్తి అయినాయి.

**ఆటోమొబైల్ పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలను పెంచడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు :**

గుత్త పెట్టుబడుల ఉత్పత్తుల అమ్మకాలు తగ్గడం, లాభాలు తగ్గటం, ప్రభుత్వానికి తీవ్రమైన సమస్య. 2019-20 నుండే కార్పొరేట్ పన్నును తగ్గించటం గమనించవచ్చు. ఇది ప్రపంచంలోనే కనిష్టం. 2021 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన నూతన వాహన తుక్కు విధానం ప్రకారం, ప్రభుత్వ, వాణిజ్య వాహనాలను 15 సంవత్సరాలకు, ప్రైవేటు, వ్యక్తిగత వాహనాలను 20 సంవత్సరాలకు తుక్కుగా మార్చవలసిందే. డీజిల్ వాహనాలు అయితే 10 సంవత్సరాలకే తీసేయాలి. కొత్త కార్లకు రిజిస్ట్రేషన్ సెస్ తగ్గించారు. ఈ చర్యలన్నీ కొత్త కార్ల కొనుగోళ్లను పెంచడానికే. పి.ఎల్.ఐ ఉత్పత్తితో ముడిబడిన ప్రోత్సాహక పథకం ద్వారా 42,500 కోట్ల రూపాయల కొత్త పెట్టుబడులను ఆహ్వానించాలని, 2.3 లక్షల కోట్ల రూపాయల విలువ గల అదనపు ఉత్పత్తిని సాధించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా, ఈ రంగంలోకి ఆటోమేటిక్ మార్గం ద్వారా 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి ఇవ్వడం జరిగింది.

ఇక భారతదేశంలో ఉన్న జపాన్ ఆటోమొబైల్ ఉత్పత్తిదారులకు, డీలర్లకు సులభంగా రుణాలను ఇవ్వడం కోసం, జపాన్ బ్యాంక్ ఆఫ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్, మన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో చేసుకొన్న ఒప్పందం విలువ ఒక బిలియన్ అమెరికన్ డాలర్లు.

ఆటోమొబైల్ పరిశ్రమ ఉత్పత్తులను, అమ్మకాలను పెంచడం కోసం సీరియస్ చర్యలు తీసుకున్న ప్రభుత్వం, ప్రజల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఎటువంటి చర్యలూ తీసుకోక పోవటం విషాదమే. పైగా ఈ వాహనాలను వాడుకోవాలంటే పెట్రోల్, డీజిల్, గ్యాస్ అవసరం కదా! వీటి ధరల మీద ప్రభుత్వ విధానం ఏమిటో తెలిసిందే.

**పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు :**

గత ఏడు సంవత్సరాల నుండి వీటి ధరలు నిరంతరాయంగా పెరుగుతూనే ఉన్నాయి. గ్లోబల్ చమురు ధరలు తగ్గినా, ఈ మూడింటి ధరలు తగ్గడం లేదు. ఏప్రిల్ 2020 నుండి డిసెంబర్ 2020 మధ్యకాలంలో పెట్రోల్ ధర 56 సార్లు, డీజిల్ ధర 67 సార్లు పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వేస్తున్న అదనపు పన్నులు, సెస్సులు కలిపి లీటరు పెట్రోల్ ధరలలో 62 శాతం ఉండగా, డీజిల్ ధరలో 57.5 శాతం. కొన్ని రాష్ట్రాలలో లీటరు ధర వంద రూపాయలకు పైగా చేరుకొన్నది.

నిజానికి ఈ పన్నులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాన రాబడి మార్గాలు అయినాయి.

ఈ పన్నుల నుండి 2014- 15లో కేంద్ర ప్రభుత్వ రాబడి 1,72,065.39 కోట్ల రూపాయలు ఉండగా అది 2019-20లో 3,34,314.83 కోట్ల రూపాయలకు పెరిగింది. ఇదే కాలంలో ఒక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రాబడే 1,60,554.29 కోట్ల రూపాయల నుండి 2,21,055.58 రూపాయలకు పెరిగింది. అంటే ఐదు సంవత్సరాలలో రెండు రెట్లు పెరుగుదల. నిజానికిది తిరోగామి పన్ను. సామాన్య ప్రజల మీద ఈ పన్ను భారం అధికం. కానీ 2008-09 నుండి ఆయిల్ దిగుమతుల వల్ల విదేశీ మారక కరెంట్ అకౌంట్‌లో లోటు ప్రమాదకరమైన స్థాయికి చేరుకున్నది. అయినప్పటికీ దిగుమతులను నియంత్రించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

ఆటోమొబైల్ పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలను పెంచే క్రమంలో విధ్వంసం చేయబడిన ప్రజా రవాణా వ్యవస్థ వల్ల,ఈ వాహనాలను నడపడమే ఎంతోమందికి ఉపాధి మార్గం అయింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో వీళ్ళ ఉపాధి సంకటంలో పడింది. దీనికితోడు కోవిడ్-19 విపత్తు ఫలితంగా, అఖిల భారత మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ ప్రకారం 14 మిలియన్‌లకు పైగా ట్రక్కులను, టూరిస్ట్ వాహనాలను ఆపరేట్ చేసేవాళ్ళు, ఇంకా ఎంతోమంది చిన్నా చితక ట్రాన్స్ పోర్ట్ ఆపరేటర్లు, వీటి ద్వారా జీతం పొందేవాళ్ళు ఉపాధిని కోల్పోయారు. కార్పొరేట్ అనుకూల - ప్రజా వ్యతిరేక ప్రభుత్వ చర్యలలో ఇది ముఖ్యమైనదే.

ఆటోమొబైల్ ఉత్పత్తుల వాడకందారులైన ప్రజల మీద అధిక పన్నుల భారం వేయటం ప్రభుత్వ చర్య అయింది.

ఇట్లా ఆయిల్ ధరలు పెంచడంలోనూ ఎన్ని వత్తిడులు, ఆందోళనలు జరుగుతున్నా కొంత మేరకైనా తమ పన్నుల వాటాలైనా తగ్గించుకోక పోవడంలో ఉన్న మరొక ముఖ్య లక్ష్యం, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం. ఇవి సామ్రాజ్య వాదుల ఆజ్ఞలేనని వేరే చెప్పనవసరంలేదు.

**ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహానికి చర్యలు :**

2019లోనే ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చర్ ఆఫ్ హైబ్రిడ్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్-2 అనే స్కీమ్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకాన్ని 31 మార్చి 2024 వరకు పొడిగించింది. ఈ పథకం కింద జూన్ 2021లో ఎలక్ట్రిక్ వాహనాల కోసం 871 కోట్ల రూపాయలను కేటాయించింది. 87,659 ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం, సిటీలలో, రాష్ట్రాలలో నడపటానికి 6,265 ఎలక్ట్రికల్ బస్సులను మంజూరు చేసింది. 2025 నాటికి మన దేశ ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ 50 వేల కోట్ల రూపాయలకు చేరుకోవాలన్నది వీరి లక్ష్యం. మధ్యతరగతి వర్గాన్ని, పెరుగుతున్న యువ

జనాభాను దృష్టిలో పెట్టుకొని ఎలక్ట్రిక్ వాహనాలకు మారటానికి ప్రయత్నాలు తీవ్రమయ్యాయి.

ఇందుకోసం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, 25.85 బిలియన్ల అమెరికన్ డాలర్లను ఆకర్షించాలని లక్ష్యం. ఈ వాహనాల ఉపయోగం కోసం 18 వేల కోట్ల రూపాయలతో అడ్వాన్స్ కెమిస్ట్రీ సెల్ ప్రారంభించబడింది. ఫిబ్రవరి 2020-21లోనే, ఢిల్లీ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కోసం 100 యూనిట్లను ఏర్పాటు చేసింది. ఇక జనవరి - జూలై 2021 మధ్యకాలంలో కార్ల కంపెనీలు, ఎలక్ట్రిక్-వాహనాల కోసం 25,045 కోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టాయి. ఏప్రిల్ 2021లో మహీంద్రా అండ్ మహీంద్రా 3000 కోట్ల రూపాయలతో మూడు సంవత్సరాలకు సంబంధించిన పెట్టుబడి ప్రణాళికను అమలు చేసింది. మన ఎలక్ట్రిక్ వాహనాల లక్ష్య సాధనకు 2030 నాటికి 12.5 ట్రిలియన్ల రూపాయల పెట్టుబడులు అవసరమని అంచనా. హడావుడిగా తీసుకొనే ఈ చర్యలు, భారీ మొత్తంలో పెట్టుబడుల వల్ల సామాన్య ప్రజానీకానికి, పీడిత వర్గానికి సమకూరే ప్రయోజనం శూన్యం.

ఆటోమొబైల్ రంగం అభివృద్ధికి సూచిక అని వాదన బలంగా ప్రచారం చేసి, అభివృద్ధిలో ఈ రంగాన్నే కేంద్రంగా రూపొందించి, విదేశీ మారక సంక్షోభాన్ని ఖాతరు చేయకుండా, చమురు దిగుమతులు చేసుకుంటూ, ఈ రంగం అభివృద్ధికి దృఢంగా చర్యలు తీసుకున్న ప్రభుత్వం, ప్రస్తుతం దీనితో వాతావరణ మార్పు సమస్య తీవ్రమవుతున్నదని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారటమే అందుకు పరిష్కారం అంటూ మళ్లీ ఆటోమొబైల్ రంగం ప్రాతిపదికగానే పారిశ్రామిక అభివృద్ధిని కొనసాగించటం గుత్త పెట్టుబడుల లాభాల కోసమే.

## మౌలికవసతుల ఆస్తులను అద్దెకివ్వడం :

ఇందులో ప్రధానమైనవి రోడ్లు, విద్యుచ్ఛక్తి. ఈ రెండూ, ఆటోమొబైల్ రంగంతో ముడిపడి ఉన్నాయి. వాహనాల కోసం పెద్ద పెద్ద హైవేలు అవసరం. వాటిని నిర్మించి, బ్రౌన్ ఫీల్డ్ అవస్థాపనగా మార్చి, గుత్త పెట్టుబడులకు టోల్ వసూలు చేసుకోమని ప్రభుత్వం అద్దెకిస్తుంది. ఇంకా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే క్రమం వల్ల, ఈ వాహనాలకు కావలసిన విద్యుత్తును ఉత్పత్తి చేయటానికి, పంపిణీ చేయటానికి ఇంకా మిగిలి ఉన్న ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్టులను గుత్త పెట్టుబడులకు అద్దెకివ్వటం జరుగుతుంది. అన్ని చోట్లా ప్రభుత్వ రంగ ఆస్తులలో పెట్రోలు పంపుల స్థలాల లాగా విద్యుత్తు రీఛార్జ్ స్టేషన్లకు లీజు కిచ్చుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఒకవైపు ఇప్పటికే ఎన్నో గ్రామాలకు, రైతులకు విద్యుత్తు అందడం లేదు. ఇక ఈ ప్రక్రియ వల్ల విద్యుత్ సంక్షోభం ఇంకా తీవ్రం అవుతుంది. విద్యుత్‌తో ముడిపడిన చాలా ప్రాంతాల్లో వ్యవసాయం మూలన పడుతుంది.

## సామ్రాజ్యవాదుల అసలు లక్ష్యం :

కొంతకాలం ఆయిల్ వినియోగం నుంచి సిఎన్‌జి గ్యాస్ వైపుకి మళ్లించారు. డీజిల్ ధరలు పెట్రోల్ కన్నా తక్కువగా ఉండేలా చూసి ఆ వాహనాల అమ్మకాలు పెంచుకున్నారు. తర్వాత డీజిల్ వాహనాలు సర్వీసింగ్ ఎక్కువౌస్తాయన్నారు. సర్వీసింగ్ కొరకు అవసరమైన విడి భాగాల ధరలను విపరీతంగా పెంచి పాత వాహనాల మార్కెటింగ్‌ని, సర్వీస్ సెంటర్ల మార్కెటింగ్‌ను చేజిక్కించుకున్నారు. పెట్రోల్ వాహనాలు కొనిపించారు. పెట్రోల్, డీజిల్ ధరల్లో వ్యత్యాసం తగ్గించారు. ఇప్పుడు విద్యుత్ వాహనాలను మార్కెట్లోకి తెస్తున్నారు. ఎగువ మధ్యతరగతి ఇళ్లముందు వారంతాల్లో వేగంగా పోవడానికి పెట్రోల్ వాహనాలు, ఉద్యోగాలకు ఎలెక్ట్రిక్ వాహనాలు, బరువులు మోయడానికి డీజిల్ వాహనాలు కొనిపెట్టుకోమని ప్రోత్సహిస్తున్నారు. ప్రజలు దాచుకున్న డబ్బుని బైటకు లాగి గుత్త పెట్టుబడుల లాభాలుగా మలచటమే అసలు లక్ష్యం.

ఎలక్ట్రిక్ వాహనాలకు మారటం వల్ల ప్రజల జీవనోపాధి మీద తీవ్రమైన ప్రభావం ఉంటుంది. పెట్రోల్, డీజిల్ వాహనాలలో వందల స్థాయిలో కంబషన్ ఇంజన్లు ఉంటాయి. ఈ స్థాయిలో విడిభాగాల ఉత్పత్తి ప్రక్రియలో బాగుచేయడం, పాడైపోయిన భాగాలను తీసేసి కొత్తవి వేయటం, సర్వీసు చేయడం మొదలైన వాటిలో కంపెనీ షోరూమ్ స్థాయి నుండి అసంఘటిత రంగం వరకు లక్షల మంది పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలలో కేవలం 17 భాగాలే ఉంటాయి. కాబట్టి పెట్రోల్, డీజిల్ వాహనానికి సంబంధించిన ఈ పనుల్లో ఉన్న కార్మికులు పెద్ద ఎత్తున ఉపాధిని కోల్పోతారు. ఎలక్ట్రిక్ వాహనాలకు పరివర్తనా క్రమం లక్షల మంది శ్రామికులకు బతుకుతెరువు లేకుండా చేస్తుంది. ఇది విధ్వంసకర పరిణామమే. అమెరికాలో పెద్ద కార్ల కంపెనీలు ప్రారంభించిన ఈ ప్రక్రియను మన దళారీ ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి

## ముగింపు :

ప్రజా రవాణా వ్యవస్థ ప్రజల మౌలిక అవసరమే. కానీ జీవితావసరాలు దీనికి మాత్రమే పరిమితం కావు. ఈ వ్యవస్థను విధ్వంసం చేస్తూ అభివృద్ధికి ప్రత్యామ్నాయంగా బలపడిన ఆటోమొబైల్ పరిశ్రమ కేవలం గుత్త పెట్టుబడుల లాభాల కోసమే. ప్రజల నిజ జీవితాలకు సంబంధం లేని అభివృద్ధి ఇది. మరొకవైపు పర్యావరణానికి కూడా హానికరం. అయితే ఇదే పర్యావరణ సమస్యను సాకుగా చూపించి అన్ని రంగాలలో జీవన విధ్వంసం సాగించడం అన్నది పెట్టుబడిదారీ విధానానికి లాభాలతో పెట్టిన విద్య. ఆటోమొబైల్ పరిశ్రమ అభివృద్ధితో ముడిపడి ఉన్న సకల అంశాలను, హైవేలను, విద్యుత్ ప్రాజెక్టులను గుత్త పెట్టుబడులకు అద్దెకివ్వడం అనే ప్రక్రియను కూడా తీవ్రంగా ప్రతిఘటించాల్సిందే. పీడిత ప్రజలు సంఘటితంగా, బలంగా పోరాడాల్సిందే. ఇందుకు ప్రత్యామ్నాయం లేనేలేదు. ★

---

**(23వ పేజీ నుండి)**

రైతు వ్యతిరేక నల్ల చట్టాలను ఈ విధంగా దొడ్డిదారిన అమలుచేయాలనుకుంటోంది.

ప్రభుత్వాల ఈ తరహా కుట్రలను పసిగట్టిన సంయుక్త కిసాన్ మోర్చా దీనినిగట్టిగా ఎదుర్కోవ డానికి నిర్ణయించుకుంది. హర్యానాలో బీజేపీ ఎమ్మెల్యేల, ఎంపీల నివాసాలను, పంజాబ్‌లో అధికారపార్టీ ఆయన కాంగ్రెస్, బీజేపీ ఎంఎల్ఏల, ఎంపిల నివాసాల ముందు కూడా నిరవధిక ధర్నాలు ప్రకటించింది. భారీగా పోలీసులను మోహరించినప్పటికీ అక్టోబర్ 2న, రైతులు రెండు రాష్ట్రాల్లో ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చి నిరవధిక ఘెరావ్‌లు ప్రారంభించారు. కర్నాల్‌లోని హర్యానా సిఎం నివాసం ముందు పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. రైతాంగంలో వచ్చిన ఈ కదలిక, ఆవేశాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు అంగీకరించవలసి వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో అక్టోబర్ 3 నుండి కొనుగోలు ప్రారంభిస్తామని ప్రకటించింది. రైతాంగ సమైక్య పోరాటానికి లభించిన గొప్ప విజయమిది.

తేమ శాతం 17% దాటితే ధాన్యం ధర తగ్గిస్తామని ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. తేమ శాతం పెరిగేకొద్దీ ధాన్యం ధరలు ఇంకా తగ్గుతాయని తెలిపింది. అంటే ఏదోఒక విధంగా రైతులు పండించిన పంటలకు ప్రకటించిన ఎంఎస్‌పి కంటే చాలా తక్కువకు కొనుగోలు చేయాలి అనేదే ఉద్దేశ్యం. పంజాబ్, హర్యానాలలోని సంయుక్త కిసాన్ మోర్చా ప్రభుత్వ-కార్పొరేట్‌శక్తుల ఈ దుర్మార్గపు ఎత్తుగడలను బహిర్గతం చేయడానికి, పోరాడటానికి రైతాంగాన్ని సమాయత్తపరుస్తున్నారు. ★

(చివరి పేజీనుండి)
బదులుగా కేంద్రంతో పోటీపడి రాష్ట్రంలోనూ ప్రజలపై భారాలు పెంచటంలో పాలకులు ముందున్నారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని ఏనాటి నుండో అటకెక్కించిన కారణంగా, కరోనా మహమ్మారి విజృంభించి ప్రజలను కబళించే సమయంలో ప్రభుత్వ వైద్య ఆరోగ్య వ్యవస్థ చేతులెత్తేసింది. సమయానికి, సక్రమమైన వైద్యమందక మరణించిన వారెందరో కాగా, కొంపాగోడు అమ్ముకుని కార్పొరేటు ఆసుపత్రుల పాలై ప్రాణాలు నిలుపుకున్నవారు కొందరు; ఇంతా జేసి ప్రాణాలు కూడా కోల్పోయినవారు మరికొందరు. అదే సమయంలో నిత్యావసరాలపై, మందుల దుకాణాలపై ప్రభుత్వ నియంత్రణను వదలి వేయటంతో ప్రజలపై భారాలు మరింత పెరిగాయి. ఇదే అదనుగా విద్యుత్తు శ్లాబులు క్రమబద్ధీకరించే పేరుతో, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని పెంచారు. కేంద్రంతో పోటీపడుతూ పెట్రోల్, డీజిల్‌లపై రాష్ట్ర పన్నులను పెంచుతూ రాష్ట్ర పాలకులు దానిని ఆదాయ వనరుగా మలుచుకున్నారు. దశలవారీగా మద్యాన్ని నిషేధిస్తామని ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన వైయస్సార్ పార్టీ పాలకులు, అనేక జమ్మిక్కులతో మద్యం అమ్మకాలపై ఆదాయం పెంచుకుంటూ పోతున్నారు. రానున్న 25 సం॥ల కాలంలో మద్యంపై వచ్చే ఆదాయాన్ని ష్యూరిటీగా చూపించి దానిపై కూడా అప్పు తీసుకున్నారు. ప్రజల ప్రాణాలను క్రమంగా హరించే మద్యంపై వచ్చే ఆదాయంతోనే సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా సగర్వంగా చెప్పుకుంటున్నారు. సంక్షేమ పథకాల అమలు బాధ్యతను కూడా ఆ శాఖకు అప్పగించే కీర్తి గడించారు. ఇసుక రీచ్‌లను పాలక రాజకీయ నాయకుల చేతుల్లోనే వుంచి, ఇసుకను చౌకగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని ప్రచారాలు చేసుకుంటున్నారు. ఆసరాలు, భరోసాలు, దీవెనలు తదితర వివిధ ప్రభుత్వ ప్రజాకర్షక పథకాలతో, నిర్దిష్ట సామాజిక సెక్షన్లలో కొందరికి నికరంగా ఎంతో కొంత నగదును వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తూ రానున్న ఎన్నికలకు ఇప్పటినుండే ఓటు బ్యాంకును స్థిరీకరించుకుంటున్నారు. ఈ పథకాల వెంపర్లాటతో ప్రజలను నిరంతరం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ, అధికారుల, రాజకీయ నాయకుల చుట్టూ తిరిగే వారిగా మలచుకుంటున్నారు.

వివాదాస్పద నిర్ణయాలు చేయటం, విధానాలు రూపొందించటం, వాటిని న్యాయ స్థానాలు నిలువరించటం, దీనితో తాము ప్రజలకు మేలు చేయలేకపోయామంటూ ప్రచారం చేసుకోవటం ఒక ధోరణిగా రాష్ట్ర పాలకులు సాగిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీకి కూతవేటు దూరంలో 'మూడు రాజధానులు కాదు; అమరావతి రాజధానిగా వుండాలంటూ' దాదాపు 2 సం॥లుగా ఆందోళన సాగిస్తున్న వారితో సంప్రదింపులు జరిపేందుకు కూడా సిద్ధం కాకపోవటం పాలకుల నిరంకుశ స్వభావానికి అద్దంపడుతోంది. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయటం, కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయటం మినహా రాష్ట్ర ప్రయోజనాలపై – ప్రత్యేకించి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ఆందోళనకు పూనుకోకపోవటం వీరి అవకాశవాద స్వభావానికి తార్కాణం.

ఇక పాలకపార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు జుగుప్సాకరమైన రీతిలో సాగించుకుంటున్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. అధికారం చేతిలో వున్న వైసీపీ పాలకులు తమకు వ్యతిరేకంగా దూషణలకు పాల్పడ్డారనే పేరున కేసులు పెట్టటం, అరెస్టులకు పాల్పడటమేకాక, పార్టీ కార్యాలయాల పైకి దాడులకు పాల్పడుతున్నారు. రేపు తాము అధికారంలోకి వచ్చాక వైసీపీ నాయకులకు కూడా ఇదే గతి పడుతుందని టిడిపి నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈవిధంగా రాష్ట్ర రాజకీయాలు అధికార, ప్రతిపక్షపార్టీల కుమ్ములాటలుగా మారిపోయాయి.

రాష్ట్రంలో ఈ వాతావరణం పాలకపార్టీలన్నింటికీ సమ్మతమేననేది గమనించాల్సిన అంశం. రానున్న కాలంలో ఈ వాతావరణం మరింత తీవ్రమైనా, ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. దోపిడీ పాలకవర్గాలు ఈ గొడవల మాటున ప్రజావ్యతిరేక విధానాలను నల్లేరుపై బండిలా నడిపించుకుపోతున్నారనేది వాస్తవం. దోపిడీ అనుకూల మీడియా కూడా ప్రజల వాస్తవిక పరిస్థితులను, వాస్తవిక సమస్యలపై ఆందోళనలకు బదులుగా ఈ తిట్ల పురాణాన్ని, దూషణల పర్వాన్ని పదేపదే ప్రసారం, ప్రచారం చేస్తూ ప్రజల దృష్టిని వీటిపైకి మళ్ళిస్తున్నాయి. వీరిలో ఎవరు మంచి, ఎవరు చెడు అనే విశ్లేషణలతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. దోపిడీ పాలక పార్టీలన్నింటి ప్రజా వ్యతిరేక స్వభావాన్ని గుర్తింపజేసి, ప్రజలను తమ తక్షణ, దీర్ఘకాలిక సమస్యలపై ఆందోళనోద్యమాలలోకి సంఘటితం చేయటమే ప్రజాఉద్యమకారుల ముందున్న కర్తవ్యం. ✶

# పంజాబ్, హర్యానాలలో ధాన్యం సేకరణలో ప్రభుత్వ, కార్పొరేట్ దళారీశక్తుల కుమ్మక్కు

**పంజాబ్,** హర్యానాలలో ఈసారి రైతులు ధాన్యాన్ని మార్కెట్‌కి తీసుకువస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం 10 రోజుల పాటు కొనుగోళ్లు వాయిదా వేస్తున్నట్లుప్రకటించింది. అక్టోబర్ 1 వ తేదీనాటికి పంజాబ్ మార్కెట్లలో దాదాపు 1 లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వచ్చి చేరింది. వాతావరణంలో మార్పు వల్ల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వారు 10 రోజులు వేచి ఉండటం అసాధ్యం.

ఈప్రాంతంలో భారీ వర్షాల కారణంగా ఈ సమయంలో తేమ శాతం 17% కంటే ఎక్కువగా ఉండడం వల్ల వెంటనే కొనుగోలు ప్రారంభించకుండా వాయిదా వేశామని ప్రభుత్వాలు కారణం చెప్పినప్పటికీ ఇది ప్రధాన అడ్డంకి కాదు. వాస్తవకారణాలు చాలా భిన్నంగా ఉన్నాయి. మొదటి కారణం ప్రభుత్వం రైతాంగ ఉద్యమానికి వెన్నెముకగా భావించే పంజాబ్, హర్యానా రైతాంగాన్ని వేధించాలనుకుంది. రెండవది – కొనుగోలు 10 రోజులు ఆలస్యం అయితే రైతులు కనీస మద్దతు ధరకంటే తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారస్తులకు, కార్పొరేట్లకు విక్రయించవలసి వస్తుంది. ప్రభుత్వం 3 వ్యవసాయ చట్టాలలో ప్రధాన ఎజెండా అయిన కార్పొరేట్ సంస్థలను వరి కొనుగోలులోకి తీసుకురావడానికి ఇది దొడ్డిదారిగా ఉపయోగపడుతుంది. మూడవది ఈ సంవత్సరం పంజాబ్‌లో ధాన్యం ఉత్పత్తి దాదాపు 191 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా ఉండగా ఎఫ్‌సిఐ మాత్రం కేవలం 171 లక్షల మెట్రిక్ టన్నుల వరిని మాత్రమే కొనుగోలు చేస్తానని ప్రకటించింది. మిగిలిన 20 లక్షల టన్నులు ఎవరు కొనుగోలుచేస్తారు? కార్పొరేట్‌ల వ్యాపారం కోసం రంగం సిద్ధం చేస్తున్నారని సులభంగానే అర్థంచేసుకోవచ్చు. యుపి, బీహార్ రాష్ట్రాలలో ప్రభుత్వ మార్కెట్ యార్డుల వ్యవస్థ నిర్వీర్యమవ్వడం వల్ల పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో లభించే కనీస మద్దతుధరలో దాదాపు సగం ఉన్నందున ఈ రాష్ట్రాల నుంచి తమ సొంత డీలర్ల ద్వారా ధాన్యాన్ని సేకరించడానికి బిజెపి ప్రణాళిక సిద్ధం చేసుకొంది. ఈ అక్రమ రవాణాతో ఎఫ్‌సిఐ కోటా ముందుగానే పూర్తయి, పెద్ద సంఖ్యలో పంజాబ్, హర్యానా రైతులు అమ్ముకోలేక మిగిలిపోతారు. ఎమ్ఎస్‌పి కంటే చాలా తక్కువ ధరకు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారస్తులకు అప్పగించడం తప్పవారికి వేరే మార్గంలేదు. ప్రభుత్వం తను అమలు చేయాలనుకుంటున్న దేశవ్యతిరేక, **(మిగతా 22వ పేజీలో)**

Janasakti (Communist Revolutionaries' Monthly)    RNI No. 8315/63 VJ-077/2019-21

No.of pages : 24    Date of publication : 1st & 2nd of Every Month    Posting date : 5th or 6th of Every Month

# ఆంధ్రప్రదేశ్‌లో కుమ్ములాటలతో ప్రజాసమస్యలను గాలికొదిలేసిన పాలక పార్టీలు

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గత, ప్రస్తుత రాష్ట్ర పాలకులు అనుసరించిన విధానాలతో పాటుగా, కేంద్రప్రభుత్వం రాష్ట్రాల వనరులను, అధికారాలను క్రమంగా తన చేతుల్లోకి తీసుకోవటం కూడా మరో కారణం.

గత ప్రభుత్వానికి మించి శుద్ధమైన, ప్రజారంజకమైన పాలన నందిస్తామని వాగ్దానాలు చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగన్ నాయకత్వంలోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ, తొలిసారిగా అధికారంలోకి వచ్చినా – తానూ, అదే తానులో ముక్కనేనని అనతికాలంలోనే రుజువు చేసుకుంది.

భూములు సాగుచేసుకొనేందుకు రైతులకు రుణాలు, సాగునీరు, విత్తనాలు, ఎరువులు తదితర మరిన్ని సదుపాయాలను కల్పించకుండా ప్రచార ఆర్భాటాలు, ప్రదర్శనాత్మక చర్యలకు పూనుకుంటున్నారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతుల సమస్యలన్నీ పరిష్కారమైపోయినట్లుగా, పంట ఖర్చులో నామమాత్రపు భాగాన్ని కొందరు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమచేసి రైతాంగాన్ని గొప్పగా ఆదుకున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా వున్న కౌలు రైతులకు ఈ మేరకు సహాయం, నామమాత్రపు బీమా పరిహారం అందకపోయినా, పాలకుల నుండి దానికోసం చర్యలేమీ లేవు. ఈ–క్రాప్ నమోదు, ఈ–కెవైసి వంటి పలు షరతులతో పండించిన పంటనైనా రైతునుండి సకాలంలో, సక్రమంగా కొనుగోలు చేయించటంలోనూ రాష్ట్రప్రభుత్వం విఫలమైంది. అంతేగాదు; అప్పో సొప్పోజేసి, ప్రకృతి అవాంతరాలకు ఎదురొడ్డి పంటను సంరక్షించుకొని, ఏదో కాడికి తెగనమ్ముకున్నా, ఆ అమ్మిన పంట తాలూకూ డబ్బులకై నెలల తరబడి రైతాంగం ఎదురుచూడాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

బోర్లక్రింద వ్యవసాయం చేసే రైతులకు విద్యుత్తును ఉచితంగా అందించకుండా ప్రపంచ బ్యాంకు రూపొందించిన పథకాలను అమలు చేయటంలోనూ రాష్ట్ర పాలకులు ముందున్నారు. సాగు విద్యుత్తుకు స్మార్ట్‌మీటర్లు బిగించటాన్ని రైతాంగంతోపాటు, అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, బేఖాతర్ చేస్తూ ఆం.ప్ర. రాష్ట్ర పాలకులు ఆ చర్యలకు నడుం బిగించారు. రైతులనుండి అసంతృప్తి పెల్లుబకకుండా వుండేందుకు, ‘మీటర్లు పెట్టినప్పటికీ, ఆ విద్యుత్తు బిల్లులను రాష్ట్రప్రభుత్వమే చెల్లిస్తుంద’ని హామీ ఇస్తూ జోకొట్టజూస్తున్నారు. ప్రపంచబ్యాంకు ఆదేశాలను త్వరిత గతిన అమలుచేసే రాష్ట్రాలకు ఎంతో కొంత అదనంగా అప్పు విదులుస్తారన్న దానికోసం రాష్ట్ర పాలకులు మరింత సాగిలబడుతున్నారు.

రాష్ట్రంలో వ్యవసాయం కష్టనష్టాల్లో వున్నప్పటికీ, పశువుల పెంపకం, పాడిచేసుకోవటమే గ్రామీణ ప్రాంత రైతుకుటుంబాలకు ఏదో మేరకు అండగా నిలుస్తూ వస్తోంది. సహకార సంఘ రూపంలో వున్న గుజరాత్‌కు చెందిన బడా పాలడెయిరీ ‘అమూల్’ను ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ప్రోత్సాహ ప్రోద్బలాలతో పాలసేకరణకు పాలకులు పూనుకున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని సహకార పాడిపరిశ్రమ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నా, రైతులకు, వినియోగదారులకు సేవలందిస్తోంది. రాష్ట్ర పాడిపరిశ్రమలోని లోపాల్ని చక్కదిద్ది ఈ సహకార రంగాన్ని బలోపేతం చేయటానికి బదులు, ప్రభుత్వమే ప్రోత్సాహకాలు కల్పించి అమూల్‌ను ముందుకు తేవటంలో పాలకుల స్వార్థప్రయోజనాలు ఇమిడి వున్నాయని స్పష్టమౌతోంది.

రాష్ట్రంలో గతంలో మూతబడిన చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తాము అధికారంలోకి వచ్చాక తిరిగి తెరిపించి, కార్మికులందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీని గాలికొదిలేశారు. చెరకు, జనపనార (జూట్) పరిశ్రమల ద్వారా సంపదలను పోగేసుకొని, ఏకపక్షంగా ఆ పరిశ్రమలను మూతవేసి ఒకవైపున రైతాంగాన్ని, మరోవైపున కార్మికులను పారిశ్రామిక యాజమాన్యాలు రోడ్లపైకి విసరివేస్తున్నా, దానిని నిలువరించే చర్యలను పాలకులు చేబట్టటంలేదు. ముడిసరుకును ముందుగానే తోలిన రైతాంగానికి చెల్లించాల్సిన అతి స్వల్పమైన బకాయిలను –వారి ఆస్థులతో పోల్చుకుంటే – చెల్లింపజేయటానికి కూడా పాలకులు ముందుకు రాకపోవటం వారి ప్రజావ్యతిరేక స్వభావాన్ని తెలుపుతోంది.

నాడు చంద్రబాబు ప్రభుత్వ పాలనా కాలంలో నగరాల్లోని వివిధ కూడళ్ళలో నిఘా కెమేరాలను ఏర్పరచి ప్రభుత్వ వ్యతిరేక గొంతులను అణచటానికి ప్రయత్నం చేసిన తీరులోనే జగన్ పాలన మరి రెండాకులు ఎక్కువ చదివింది. ప్రజాప్రదర్శనలు, సమావేశాలలో డ్రోన్ కెమేరాల నుపయోగించి, అందులో పాల్గొన్నవారిని విశ్లేషించి, కేసులు బనాయించే అణచివేత పద్ధతుల నెంచుకుంటున్నారు. రాష్ట్ర అసెంబ్లీ, సెక్రటేరియట్‌ల సమీపంలో ఆందోళనలకు అవకాశం లేకుండా, విజయవాడలో కాల్వ గట్టున ప్రజల రద్దీలేని ప్రాంతాన్ని ధర్నాచౌక్‌గా మార్చి ఆందోళన, నిరసనలను అక్కడికే పరిమితం చేయబూనుకుంటున్నారు. అధికారపార్టీ నేతలు వారి ప్రమాణ స్వీకారాలకు, ఆడంబరాలకు, ప్రారంభోత్సవాలకు పెద్దసంఖ్యలో జనసమీకరణకు పూనుకుంటూనే, కొవిడ్ ముసుగు – శాంతిభద్రతల సమస్యలంటూ ప్రజలు శాంతియుతంగా కనీసం ప్రదర్శన – ఆందోళనలు చేయటానికి కూడా నిరాకరిస్తూ నిర్బంధం ప్రయోగించటం పెరుగుతోంది. ఎయిడెడ్ పాఠశాలల విలీనాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్రవ్యాపితంగా విద్యార్థుల, తల్లిదండ్రుల ఆందోళనలపై లాఠీఛార్జీ జరిగాయి. జాబ్‌లెస్ క్యాలెండర్ కాదు, హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగకల్పన చేయాలన్న యువజన, విద్యార్థి సమూహాలపైనా లాఠీలు ప్రయోగించారు. సిపిఎస్ స్థానంలో పాతపెన్షను స్కీమ్‌ను పునరుద్ధరించాలని, ఇచ్చిన హామీని నెరవేర్చాలని, పిఆర్‌సిని ప్రకటించాలని ఆందోళనలు చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలపైనా పోలీసులు విచక్షణరహితంగా వ్యవహరించారు. పోలవరం నిర్వాసితులు, ఆశవర్కర్స్, పారిశుద్ధ్య సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు, మొదలుకొని ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తామనే హామీతో చేర్చుకున్న వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది కూడా కరోనా కష్టకాలంలోనూ రోడ్లపైకొచ్చి ఆందోళనలు చేయవలసి వచ్చింది. ఇక, కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ ప్రజాఉద్యమ కార్యకర్తలు, న్యాయవాదులకు సైతం నోటీసులు జారీచేయటం, ‘ఉపా’ చట్టాల ప్రయోగం విచక్షణారహితంగా సాగుతున్నాయి.

గత రెండు సంవత్సరాలుగా కరోనా కారణంగా కకావికలైన ప్రజలను ఉదారంగా ఆదుకోవటానికి **(తరువాయి 23వ పేజీలో)**

Printed, Published and Owned by S. Seshamma

32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3

Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010